వసంతం
ఆశ సంతోషాల పెన్నిధి

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఖమ్మం

: fb.com/vaartha Digital

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

17-10-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 256 పేజీలు: 8+16 వెల: 6.50


## గుజరాత్ రాజకీయాల్లో భారీ కుదుపు

సిఎం మినహా మంత్రివర్గం రాజీనామా

నేడు కొత్త మంత్రుల ప్రమాణం

5

## ఇద్దరు పిల్లల నిబంధన కట్



గురువారం హైదరాబాద్‌లో కేబినెట్ వివరాలు మీడియాకు వెల్లడిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి. చిత్రంలో వాకిటి శ్రీహరి, ఎంపి బలరాంనాయక్

డిసెంబరు 1 నుంచి ప్రజాపాలన విజయోత్సవాలు

ధాన్యానికి 'మద్దతు'తో పాటు రూ. 500 బోనస్

### స్థానిక ఎన్నికల్లో పోటీకి అర్హతపై కేబినెట్ కీలక నిర్ణయం

### రాష్ట్రంలో కొత్తగా మూడు వ్యవసాయ కళాశాలలు

### ఎలివేటెడ్ కారిడార్లకోసం రక్షణ శాఖకు 435 ఎకరాలు

### కేబినెట్ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు16:** స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి ఇద్దరు పిల్లలు నిబంధనపై తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇద్దరు పిల్లలకు మించి సంతానమున్న వారు స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులనే నిబంధనను తొలగించేందుకు మంత్రివర్గం నిర్ణయించింది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం సచివాలయంలో మంత్రివర్గ సమావేశం జరిగింది. కేబినెట్ నిర్ణయాలను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియాకు వివరించారు. రాష్ట్రంలో జనాభా నియంత్రణ కట్టుదిట్టంగా అమలవుతున్న తరుణంలో ఇద్దరు పిల్లల నిబంధనను అమలు చేయాల్సిన అవసరం లేదనే మంత్రివర్గ సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయని, ఈ నిబంధనను ఎత్తివేసేందుకు కేబినెట్ అంగీకరించిందని ఆయన పేర్కొన్నారు. కాగా, ఈవానాకాలంలో 1.48కోట్ల మెట్రిక్‌టన్నుల ధాన్యం దిగుబడి వస్తుంది. దేశంలోనే ఇది రికార్డు స్థాయి ఉత్పత్తి. ఇందులో రాష్ట్రంలో 80 లక్షల మెట్రిక్ టన్నుల >>2

## కోటాపై చుక్కెదురు



### ఎస్ఎల్‌పి విచారణకు సుప్రీం తిరస్కృతి

### పాత రిజర్వేషన్లతో ఎన్నికలు జరపొచ్చని సూచించిన ధర్మాసనం

### మెరిట్స్ ప్రకారం తదుపరి విచారణ జరపాలని హైకోర్టుకు సూచన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు16:** బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున విచారణకు స్వీకరించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో సంబంధం లేకుండా తదుపరి విచారణ చేపట్టాలని హైకోర్టుకు సూచించింది. మెరిట్స్ ప్రకారం విచారణ కొనసాగించాలని హైకోర్టుకు సుప్రీంకోర్టు సూచించింది. కావాలనుకుంటే ప్రభుత్వం పాత >>2

## 'జూబ్లీ' బోగస్ ఓట్ల పిటిషన్‌పై ప్రత్యేక ఆదేశాలు ఇవ్వలేం: హైకోర్టు

2

## మరో 170 మంది మావోయిస్టుల లొంగుబాటు!

### నేడు జగ్దల్‌పూర్‌లో సభకు సిఎం విష్ణుదేవ్



ఇంద్రావతి నుంచి లొంగిపోయేందుకు వెళ్తున్న మావోయిస్టులు

**చర్ల, అక్టోబర్ 16, ప్రభాతవార్త:** ఐదు దశాబ్దాల పాటు దేశ వ్యాప్తంగా మావోయిస్టులకు పట్టున్న ప్రాంతాలతో పాటు దండకారణ్యాన్ని అక్కడ ప్రభుత్వం తో పాటు సమానంగా సామాంతర పాలన నడిపిన నక్సల్స్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు >>2



శ్రీశైలంలో ప్రత్యేక పూజలు చేసిన ప్రధాని

## జిఎస్టీ సంస్కరణలతో రూ.8 వేల కోట్లు ఆదా

### డబులింజన్ సర్కార్ వల్లే ఎపిలో ప్రగతి: కర్నూలు సభలో ప్రధాని మోడీ

### పాల్గొన్న ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు, డి.సిఎం పవన్

### శ్రీశైలం మల్లన్నను దర్శించిన ప్రధాని



గురువారం కర్నూలు సభలో ప్రధాని మోడీని సత్కరిస్తున్న ఎపి సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్

**కర్నూలు, అక్టోబర్ 16 ప్రభాతవార్త బ్యూరో:** వికసిత్ ఎపితోనే వికసిత్ భారత్ లక్ష్యం సాకారం అవుతుందని ప్రధాని నరేంద్రమోడీ వ్యాఖ్యానించారు. స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించినప్పుడే జిఎస్‌టి సంస్కరణలకు సార్థకత చేకూరుతుందని స్పష్టం చేశారు. వికసిత్ భారత్, ఆత్మనిర్భర్ భారత్ వంటివి సాకారం కావడంలో ఎపి కీలక పాత్ర పోషిస్తుందని ప్రధాని స్పష్టం చేశారు. ఎపి యువత ఎంతో చైతన్య కలిగిన వారని... సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం >>2

## కేబినెట్‌కు మంత్రి సురేఖ గైర్హాజర్



### సిఎంను టార్గెట్ చేసిన కొండా కుటుంబం

### డి.సిఎం, పార్టీ ఇన్‌చార్జి మీనాక్షితో భేటీ

### సమస్య పరిష్కరిస్తామని పెద్దలు హామీ ఇచ్చారంటున్న మంత్రి

**హైదరాబాద్, అక్టోబరు 16,ప్రభాతవార్త:** తెలంగాణకాంగ్రెస్ ప్రభుత్వంలో పంచాయతీ ఏకంగా మంత్రి మండలి సమావేశంను తాకింది. అటవీ దేవాదాయశాఖ మంత్రి కొండ సురేఖ ఏకంగా మంత్రిమండలి సమావేశంకు గైర్హాజరయ్యారు. మంత్రి కొండ సురేఖ తన కూతురు సుస్మిత >>2




# కేబినెట్‌కు మంత్రి సురేఖ గైర్హాజర్

>> పటేల్‌ను తీసుకొని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కతో ప్రజాభవన్‌లో సమావేశమయ్యారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌తో కొండా సురేఖ ఆమె కూతురు చర్చించారు. డెక్కన్ సిమెంట్ యాజమాన్యం వ్యవహారంలో జరిగిన పరిణామాలు ఆ సంసత్థ అక్రమాలు చర్చలలో వివరించారు. అనంతరం కొండా సురేఖ మీడియాతో మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా తనను తన కుటుంబాన్ని టార్గెట్ చేసి ఇబ్బంది పెడుతున్నారని నేతలకు తెలిపానని చెప్పారు. నా సమస్యలు పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తామని తర్వలోనే సెటిల్ చేస్తామని హామి కూడా ఇచ్చారని తెలిపారు. వరంగల్ జిల్లాలో గతకొద్దిరోజులుగా జరుగుతున్న పరిణామాలతోపాటు బుధవారం రాత్రి నుంచి జరిగిన అనేక విషయాలు డిప్యూటి సిఎంకు కొండా సురేఖ వివరించినట్లు తెలిసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మేడారం జాతరా అభివృద్ధి పనులు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటికి, మంత్రి సురేఖ మధ్య విబేధాలు సృష్టించాయి. తన పరిధిలోని టెండర్లు ఎలా పొంగులేటి వర్గానికి ఖరారు చేస్తారంటూ ఆగ్రహంతో ఉన్నారు. జిల్లా వ్యవహారాల్లో పొంగులేటి జోక్యంపై విమర్శలు గుప్పించిన సురేఖ అధిష్ఠానానికీ ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో మంగళవారం జిల్లాలో మంత్రి పొంగులేటి పర్యటనకు, ఆమె దూరంగా ఉన్నారు. మరోవైపు సిఎం రేవంత్‌రెడ్డి బుధవారం వరంగల్ పర్యటనకు వచ్చారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తల్లి దశదిన కర్మకు ముఖ్యమంత్రి హాజరైనప్పటికీ, కొండా సురేఖ ఆ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. ఈ రచ్చ కొనసాగుతుండగానే సురేఖకు సమాచారం ఇవ్వకుండా ఆమె ఓఎస్‌డి సుమంత్‌ను తొలగించారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ఉన్న దక్కన్ సిమెంట్ నుంచి డబ్బులు డిమాండ్ చేసేందుకు సుమంత్ గన్‌తో బెదిరించారన్న ఆరోపణల నేపథ్యంలో కేసు నమోదు చేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు 24గంటలు గడవకముందే అతడిని అరెస్టు చేయడానికి జూబ్లిహిల్స్‌లోని సురేఖ ఇంటికి చేరుకోవడం తో వివాదం రావణకాష్టంలా రగిలించింది. మఫ్టీలో ఉన్న టాస్క్‌ఫోర్స్ పోలీసులను గేటు వద్దే మంత్రి సురేఖ కుమార్తె సుస్మిత అడ్డుకొన్నారు. పోలీసుల తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. 'ఏమిటిది? ఎక్కడున్నం? కాంగ్రెస్ గవర్నమెంట్‌లో ఉన్నమా? మరో గవర్నమెంట్‌లో ఉన్నమా? రాత్రిపూట ఇకడికి ఎందుకువచ్చిండ్రు? ఏమనుకుంటున్నరు? మీకు పర్మిషన్ ఎవరిచ్చింఢ్రు? పోలీసులే అయితే మఫ్టీలో ఎందుకొచ్చింఢ్రు? ఆయన (సుమంత్) ఏం తప్పు చేసిండని ఇకడికి వచ్చింఢ్రు? మీ దగ్గర ఆయన బెదిరించినట్టు ఆధారాలుంటే వీడియోనైనా చూపెట్టండి? రాత్రిపూట మా ఇంటికి పోలీసులను పంపుడుఆ మూలకు, ఈ మూలకు కాపలా పెట్టుడు ఏందిది? ఏమనుకుంటున్నరు?' అని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. సుమంత్‌పై వరంగల్‌లో కేసు నమోదైందని పోలీసులు తెలుపగా, ఎవరు ఫిర్యాదు చేశారంటూ సుస్మిత ప్రశ్నించారు. హుజూర్‌నగర్ బెదిరింపుల కేసులో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫిర్యాదు మేరకే వచ్చామంటూ పోలీసులు తెలుపడంతో.. సురేఖ అక్కడినుంచే ఉత్తమ్‌కు ఫోన్ చేశారు. అయితే తానెలాంటి ఫిర్యాదూ చేయలేదని మంత్రి తెలుపడంతో మంత్రి పోలీసులపై మండిపడ్డారు. ఈ సందర్భంగా మంత్రి కుమార్తె నేరుగా ముఖ్యమంత్రి పేరునే ప్రస్తావిస్తూ ఆరోపణలకు దిగారు. 'తిరుపతిరెడ్డికి, కొండల్‌రెడ్డికి గన్‌మెన్లు ఎందుకు ఉన్నారు? వాళ్లు కాంగ్రెస్ పార్టీకి ఏం చేశారని వాళ్లకు గన్‌మెన్లను ఇచ్చారు? రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వేం నరేందర్‌రెడ్డి కుట్ర చేస్తున్నారు. రేవంత్‌రెడ్డి చెప్తేనే రోహిన్‌రెడ్డి సుమంత్‌ను పిలిచాడు. ఆ రోజు ఆయన వెళ్లి వారితో మాట్లాడి వచ్చేశాడు. అంతకుమించి ఏమీ జరగలేదు. ఈ రోజు సుమంత్ మీద తప్పుడు కేసు పెట్టికావాలని వేధిస్తున్నారు. ఇప్పుడు ఏకంగా మా ఇంటి మీదికే వచ్చారు' అంటూ సుస్మిత మీడియాతో మాట్లాడారు. 'ఈ రోజు సుమంత్ మీద కేసుపెట్టి, అర్ధరాత్రి మా ఇంటికి పోలీసులను పంపి.. మా అమ్మను అరెస్ట్ చేయాలని చూస్తున్నారు. లేకపోతే మహిళా పోలీసులనూ వెంట తీసుకురావాల్సి న అవసరమేంది?' అని సుస్మిత ఆందోళన వ్యక్తంచేశారు. ఆ ఉద్రిక్తత మధ్యలోనే సుమంత్‌ను తన కార్లో ఎక్కించుకుని సురేఖ అక్కడినుంచి వెళ్లిపోయారు. బుధవారం రాత్రి సురేఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇంటికి వెళ్లడం, ఆమె కుమార్తె సిఎం రేవంత్‌రెడ్డిని టార్గెట్ చేస్తూ వ్యాఖ్యలు చేయడం గురువారం ఉదయం ప్రెస్‌మీట్ పెట్టి రద్దుచేయడం, భట్టి ఇంటికి పోవడం నుంచి కేబినెట్ సమావేశానికి గైర్హాజరు కావడం తర్వాత మినాక్షి నటరాజన్, మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలవడం వరకు కాంగ్రెస్ రాజకీయాలు ఉత్కంఠభరితంగా మారాయి.

**రేవంత్ కాళ్లు పట్టుకొని మొక్కాలా? : కొండా సురేఖ కూతురు**

తెలంగాణలో రెడ్లు బిసిలను అణిచివేస్తున్నారని ముఖ్యమంత్రి ఇతర మంత్రులపై చేసిన వ్యాఖ్యలకు నేను కట్టుబడిఉన్నాని మంత్రి కొండ సురేఖ కూతురు ఖరాఖండిగా తెగేసి గురువారం కూడా చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మా అమ్మను ఇష్టమొచ్చినట్లు తిట్టేవాడు సంచలన వ్యాఖ్యలు కొండ సుస్మిత పటేల్ చేశారు. మమ్మల్ని వదిలేయండి అని రేవంత్ రెడ్డి కాళ్ల పట్టుకొని మొక్కాలా..? అని ప్రశ్నించారు. ఢిల్లీలో ఖర్గేతో మీటింగ్‌లో మా అమ్మను రేవంత్ రెడ్డి తిడితే ఆరోజు మా అమ్మ ఎంతో ఏడ్చింది అని సుష్మిత తెలిపారు

**మీడియా ముందుకు వెళ్లొద్దు: సురేఖను ఫోన్ చేసిన మీనాక్షి**

తెలంగాణ అటవీ పర్యావరణం, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను మీడియా ముందుకు వెళ్ళవద్దని ఎఐసిసి తెలంగాణ ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ వారించారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంత్రి ఇంటి మందు చేసిన గలాటను వివరించడానికి గురువారం విలేఖరుల సమావేశం మంత్రి కొండ సురేఖ ఏర్పాటు చేయడంతో ఫోన్‌లో వద్దని హెచ్చరించారు.. ఈ పరిణామాల నేపథ్యంలో కొండా సురేఖతో మీనాక్షి నటరాజన్ మాట్లాడినట్లు తెలిసింది. ఈ వ్యవహారాన్ని ఇంతటితో సమసిపోయేట్లు చూద్దామని ఆమె చెప్పినట్లు సమాచారం.

**అసాంఘిక కార్యక్రమాల్లో తలదూర్చలేదు: రోహిన్‌రెడ్డి**

దక్కన్ సిమెంట్ అంశంపై మంత్రి మాజీ ఓఎస్‌డి ప్రస్తావించినా తాను ఇలాంటి వాటిలో వేలు పెట్టనని సున్నితంగా తిరస్కరించానని తాను ఏలాంటి అసాంఘిక కార్యకలాపాలలో తలదూర్చలేదని కావలంటే విచారణకు సిద్దమని డిసిసి అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి స్పందించారు. కొండ సురేఖ కూతురు సుస్మిత మాట్లాడుతూ సుమంత్ దగ్గర గన్ ఉంటే అది ఖైరతాబాద్ డిసిసి రోహన్‌రెడ్డి తీసుకొచ్చిందే అని వాళ్ళ కాల్‌డేటా బయటకు తీయాలని డిమాండ్ చేయడంతో ఆయన వివరణ ఇచ్చారు.



శ్రీశైలంలో తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్న ప్రధాని



గురువారం కర్నూలులో జరిగిన సభలో అభివాదం చేస్తున్న ప్రధాని మోడీ. ఎపి సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్

# రూ.8 వేల కోట్లు ఆదా

>> పవన్ కళ్యాణ్ వంటి వారి నేతృత్వంలో ఎపి అభివృద్ధి పథంలో వెళ్తోందని... కేంద్రం కూడా పూర్తిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సహకరిస్తుందని ప్రధాని చెప్పారు. సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ బహిరంగ సభ గురువారం నన్నూరు చెక్ పోస్ట్ సమీపంలో జరిగింది. శ్రీశైలంలో మల్లికార్జున స్వామి వారిని, భ్రమరాంబ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం అనంతరం ప్రధాని కర్నూలు చేరుకున్నారు. కర్నూలులో సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ జిఎస్‌టి బచత్ ఉత్సవ్‌పై ఏర్పాటు చేసిన బహిరంగ సభా వేదికకు చేరుకున్న ప్రధానికి మంత్రులు, ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజా ప్రతినిధులు స్వాగతం పలికారు. హెలీప్యాడ్ నుంచి సభా ప్రాంగణం వరకు ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఓపెన్ టాప్ జీపులో ప్రజలకు అభివాదం చేస్తూ వేదికపైకి చేరుకున్నారు. ఓపెన్ టాప్ జీపులో ర్యాలీగా వచ్చిన ముగ్గురు నేతలకు భారత్ మాతాకీ జై అంటూ మువ్వెన్నల జెండాలతో ప్రజలు స్వాగతం పలికారు.

బహిరంగ సభలో జిఎస్‌టి సంస్కరణలపై ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడుతూ..."ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతికంగా అభివృద్ధి చెందిన ప్రాంతం, యువత ఎంతో చైతన్యవంతులు. ఎపిలో విజన్ ఉన్న చంద్రబాబు, పవన్ కల్యాణ్ లాంటి నేతలు ఉన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా ఉంది. గత 16 నెలల్లో డబుల్ ఇంజన్ సర్కారు వల్ల ఎపిలో ప్రగతి వేగంగా జరుగుతోంది. ఢిల్లీ, అమరావతిలు రెండూ అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు వెళ్తున్నాయి. దేశ ఆర్థిక విప్లవానికి ఆంధ్రప్రదేశ్ ఓ కీలక ప్రాంతంగా ఉంది. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం వేగంగా అభివృద్ధి దిశగా నడుస్తోంది. భారత్ దేశంతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రగతి వేగాన్ని ప్రపంచం గమనిస్తోంది. గూగుల్ లాంటి ఐటీ దిగ్గజం ఎపిలో అతిపెద్ద పెట్టుబడిని ప్రకటించింది. దేశపు తొలి అతిపెద్ద ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కేంద్రం విశాఖలో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అమెరికా వెలుపల భారీ పెట్టుబడితో ఏపీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్ పెడుతున్నట్టు గూగుల్ సిఇఒ నాతో చెప్పారు. డేటా సెంటర్, ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్ లాంటి అత్యాధునిక మౌలిక సదుపాయాలు ఈ కేంద్రంలో ఏర్పాటు కాబోతున్నాయి. ప్రపంచ దేశాలను కలుపుతూ వేయనున్న సబ్ సీ కేబుల్ ద్వారా తూర్పు తీరం బలోపేతం అవుతుంది. విశాఖలో ఏర్పాటు కానున్న కనెక్టివిటీ హబ్ భారత్ కే కాదు ప్రపంచానికి సేవలందిస్తుంది. ఈ విషయంలో సిఎం చంద్రబాబు విజన్‌ను అభినందిస్తున్నాను. 21వ శతాబ్దపు మాన్యుఫాక్చరింగ్ కేంద్రంగా ప్రపంచ దేశాలు భారత్ వైపు చూస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం భారత్ ఉత్పత్తి కేంద్రంగా రూపుదిద్దుకుంటోంది. ఆత్మనిర్భర్ భారత్‌లో ఎపి కీలకంగా మారింది." అని ప్రధాని అన్నారు.

పౌరులకు అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలనేది ఎన్డీయే ప్రభుత్వ నినాదం. ఈజ్ ఆఫ్ లివింగ్ అనే అధ్యాయం దేశంలో ప్రారంభమైంది.

ప్రజల జీవితాలను సులభతరం చేసే సంకల్పంతో ఎన్డీయే పని చేస్తోంది. 12 లక్షల ఆదాయం ఉన్న ప్రతీ ఒక్కరికి పన్ను లేకుండా చేశాం. వృద్ధుల కోసం ఆయుష్మాన్ భారత్ లాంటి సదుపాయాలు కల్పిస్తున్నాం. సరిగ్గా నవరాత్రి ముందు జిఎస్‌టి సంస్కరణలు అమల్లోకి తీసుకువచ్చాం. ప్రజలపై పన్నుల భారం తొలగించాం. మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో జిఎస్‌టి పొదువు ఉత్సవాన్ని పండుగలా చేసుకున్నారు. సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ పేరిట కార్యక్రమాలు చేపట్టటం అభినందనీయం. ఈ జిఎస్‌టి సంస్కరణల వల్ల రూ.8 వేల కోట్ల మేర ప్రజలకు ఆదా అవటం సంతోషం. కానీ ఆ ప్రయోజనాలు అందరికీ అందాల్సి ఉంది... అప్పుడే అది సఫలమైనట్టు. 21వ శతాబ్దం భారత దేశానిది, 140 కోట్ల మంది భారతీయులది." అని ప్రధాని చెప్పారు.

ఢిల్లీ నుంచి నుంచి నేరుగా కర్నూలు ఎయిర్ పోర్టుకు చేరుకున్న ప్రధాని నరేంద్ర మోడీకి గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్, సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్, బీజేపీ ఎపి అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సహా... వివిధ ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. కర్నూలు ఎయిర్ పోర్టు నుంచి సిఎం, డిప్యూటీ సిఎంలతో కలిసి శ్రీశైల దేవస్థానానికి హెలీకాప్టరులో వెళ్లారు. దేవస్థానంలో కొలువైన శ్రీశైల భ్రమరాంబిక, మల్లిఖార్జున స్వామి వార్లను ప్రధాని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీశైల క్షేత్రం విశేషాలను ప్రధాని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రధానికి వేదశీర్వాచనాలిచ్చి... తీర్థ ప్రసాదాలు అందించారు. ఆ తర్వాత ఛత్రపతి శివాజీ ధ్యాన మందిరాన్ని ప్రధాని సహా సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ సందర్శించారు. అక్కడున్న శిల్పాలను, చిత్రపటాల్లోని విశేషాలను ప్రధానికి నిర్వాహకులు వివరించారు. అనంతరం భ్రమరాంబిక గెస్ట్ హౌసులో ప్రధాని భోజన విరామం తీసుకున్నారు. ఆ తర్వాత హెలీకాప్టర్ ద్వారా కర్నూలులో సూపర్ సేవింగ్స్ సూపర్ జిఎస్‌టి బహిరంగ సభ ప్రాంగణానికి చేరుకున్నారు.

# అంతిమ దశకు నక్సలిజం: అమిత్‌షా

**న్యూఢిల్లీ, అక్టోబరు 16:** నక్సలిజంపై పోరాటంలో ఇది గుర్తుంచుకోదగిన రోజు అని కేంద్ర హోమ్‌మంత్రి అమిత్‌షా అన్నారు. మావోయిస్టుపార్టీకి దశాబ్దాలపాటు అత్యంత కీలక నేతగా వ్యవహరించిన మల్లోజుల వేణుగోపాల్‌రావు బుధవారం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ముందు లొంగిపోయిన మరుసరిరోజే మరో 170 మంది మావోయిస్టులు చత్తీస్‌గఢ్‌లో సరెండర్ అయ్యారు. ఈ విషయాన్ని చెబుతూ అమిత్‌షా పైవిధంగా వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో సుదీర్ఘ పోస్టు పెట్టారు. బుధవారం ఛత్తీస్‌గఢ్‌లో 27 మంది, మహారాష్ట్రలో 61 మంది జనజీవన స్రవంతిలోకి వచ్చిన విషయాన్ని ప్రస్తావించారు.

రెండు రోజుల వ్యవధిలో 258 మంది మావోయిస్టులు లొంగిపోయారని తెలిపారు. భారత రాజ్యాంగంపై తమ విశ్వాసాన్ని ప్రకటిస్తూ హింసను త్యజించాలనే వీరి నిర్ణయాన్ని అభినందిస్తున్నట్లు అమిత్‌షా పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం వామపక్ష తీవ్రవాదాన్ని అంతం చేసేందుకు చేస్తున్న ప్రయత్నాల ఫలితాలను ఇది ప్రతిబింబిస్తుందన్నారు. తమ విధానం స్పష్టంగా ఉందన్న అమిత్‌షా.. లొంగిపోయే వారిని స్వాగతిస్తామని, ఇంకా తుపాకీ కొనసాగించాలనుకొనే వారు మాత్రం భద్రతాదళాల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. నక్సలిజం మార్గంలో ఇంకా కొనసాగున్న వారు తమ ఆయుధాలను విడిచిపెట్టి ప్రధాన జనజీవన స్రవంతిలో చేరాలని మరోసారి విజ్ఞప్తి చేశారు.

## మరో 170 మంది మావోయిస్టుల లొంగుబాటు!

>> చేపట్టిన ఆపరేషన్ కాగార్‌తో కాకావికలం అవుతుంది. ఆయుధాలు విడి జనజీవ స్రవంతిలో కలవాలి లేదంటే మావోయిస్టుల అంతం తప్పదని కేంద్ర హోంశాఖ మంత్రి పలుమార్లు ప్రకటించారు. 2026 మార్చి 31 కల్లా మావోయిస్టు రహిత భారత్ ను చూస్తారని డెడ్ లైన్ విధించి సంచలనం కలిగించారు. అనుకున్న గడువుకల్లా మావోల ఏరివేత సాద్యమా అని అనేక అనేక చర్చలు జరిగిన సందర్భాలు ఉన్నాయి. తాజా సంఘటనలు నేటి పరిస్థితులను నిషితంగా పరిశీలిస్తే మావోయిజం అంతిమ దశకు చేరిందా అన్న సందేశాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి..

వరసు లొంగుబాట్లు ఎన్ కౌంటర్లు మావోయిస్టు పార్టీని కోలుకోని దెబ్బతీసింది. మరణమే తప్ప శరణం ఉండదని భావించిన కొందరు కేంద్ర కమిటీ సభ్యులు రాష్ట్ర కమిటీ సభ్యులు ఏరియా కమిటీ సభ్యులు లొంగుబాటు సిద్దం అయ్యారు. కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ తోపాటు 60 మంది వివిధ కేడర్లకు చెందిన మావోలు గడ్చిరోలి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సమక్షంలో లొంగిపొయిన రెండురోజుకు మరో 170 మంది మావోయిస్టులు చత్తీస్‌గఢ్ ప్రభుత్వం ముందు లొంగుబాటు సిద్ధం అయ్యారు.

**నేడు జగ్దల్ పూర్ సభ**

మావోయిస్టు అగ్రనేత సెంట్రల్ కమిటీ మెంబర్ తక్కెళ్లపల్లి వాసుదేవరావుతోపాటు సౌత్ బస్తర్ డివిజన్ కమిటీ సభ్యులు రాజమన్ రనిత రాజ సలాంతో పాటు మరికొందరు డివిజన్ కమిటీ సభ్యులు లొంగిపొయేందుకు బీజాపూర్ చేరుకున్నారు. వారిని ప్రత్యేక వాహనాల్లో జగ్దల్ పూర్ తరలిస్తున్నారు. ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి హోం మంత్రి విజయ్ శర్మలు ఈ సభకు హాజరుకానున్నారు.

**నక్సల్స్ రహిత ప్రాంతం అబూజ్ మఢ్ చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి.**

నక్సల్స్ రహిత భారత్ కు కృషిచేసిన హోం మంత్రి అమిత్ షా ముఖ్యమంత్రి విష్ణుదేవ్ దన్యవాదాలు తెలిపారు. ఉత్తర్ బస్తర్ అబూజ్ మఢ్ అటవి ప్రాంతం నేడు నక్సల్స్ రహిత ప్రాంతంగా మారిందని బస్తర్ లో శాంతి మరియు అభివృద్ధికి నాంది పలికిందని అన్నారు. గడిచిన రెండురోజుల్లో 258 మంది లొంగిపొయారని ప్రస్తుతం మావోయిజం ముగింపు అంచున ఉందన్నారు. గత 22 నెలల్లో సిజీ లో 477 మృతిచెందగా 2.110 మంది లొంగిపొయారని 1785 మందిని అరెస్టు చేసామని ఈ ఘనాంకాలు చత్తీస్‌గఢ్ లో నక్సల్స్ రహితం చేయాలని మా అంచంచల సంకల్పానికి నిదర్శనం అన్నారు. మార్చి 31 నక్సల్స్ రహితం చేయాలనే మా లక్షాణిని నేడు దగ్గరగా ఉన్నామని అన్నారు. మావోల అనివేతకు బస్తర్ ప్రాంత అభివృద్ధి కి ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని మా భద్రతా బలగాలు చేపట్టిన సైనిక చర్య విజయం సాధించిందని అన్నారు.

**రెండురోజుల్లో 258 మంది లొంగుబాటు : కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా**

చత్తీస్‌గఢ్ రెండురోజుల్లో 258 మంది మావోయిస్టులు లొంగిపొయినట్లు అమిత్ షా ఎక్స్ వేదిక గా ట్విట్ చేసారు. ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలిపొవాలన్నారు.

# కోటాపై చుక్కెదురు

>> రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్లవచ్చని సూచనలు చేసింది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జారీ చేసిన జీవో 9పై హైకోర్టు విధించిన స్టేను సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఎస్‌ఎల్‌పీ దాఖలు చేసిన విషయం తెలిసిందే. హైకోర్టు ఈ నెల 9న జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం 13వ తేదీన పిటిషన్ దాఖలు చేసింది. అత్యవసర పరిస్థితుల దృష్ట్యా 16,17వ తేదీల్లో ఏదో ఒకరోజు ఈ అంశంపై విచారించాలని మంగళవారం సుప్రీంకోర్టు రిజిస్ట్రార్ ముందు మెన్షన్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం కోరినట్లుగానే రిజిస్ట్రీ ఈ కేసును గురువారం విచారణ జాబితాలో చేర్చింది. అయితే సుప్రీంకోర్టు దీనిపై విచారణకు నిరాకరించింది. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. రాష్ట్రవ్యాప్తంగా కులగణన సర్వే నిర్వహించి, శాస్త్రీయంగానే రిజర్వేషన్లను పెంచాలని నిర్ణయించామని, దీనిపై అసెంబ్లీలో కూడా అన్ని పార్టీలు ఏకాభిప్రాయం వ్యక్తం చేశాయని కోర్టుకు వివరించారు. కాగా, రిజర్వేషన్లు 50 శాతం మించరాదని గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన కృష్ణమూర్తి తీర్పు స్పష్టంగా చెబుతోందని ప్రతివాదుల తరఫు న్యాయవాది బలంగా వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, ఈ అంశంపై ఇప్పటికే హైకోర్టులో విచారణ కొనసాగుతున్నందున తాము జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది. ఈ దశలో పిటిషన్‌ను విచారణకు స్వీకరించలేమని పేర్కొంటూ కొట్టివేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో సంబంధం లేకుండా ఈ కేసులో విచారణను కొనసాగించాలని హైకోర్టుకు సూచించింది. సుప్రీంకోర్టు తాజా తీర్పుతో రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై మళ్లీ ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తదుపరి ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.

**రిజర్వేషన్లు 50శాతంకు మించొద్దనే వాదన సరికాదు: సింఘ్వీ**

అసెంబ్లీలో అన్ని పార్టీలు ఏకగ్రీవ తీర్మానం చేశాయని సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రిజర్వేషన్లు 50 మించొద్దనే వాదన సరికాదని అన్నారు. ఇందిరా సహానీ కేసులోనూ 50 పరిమితి దాటొచ్చని ఉందని తెలియజేశారు. డేటా ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వొచ్చని ఉంది అని సింఘ్వీ పేర్కొన్నారు.

# ఇద్దరు పిల్లల నిబంధన కట్

>> ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని పౌరసరఫరాల విభాగం అంచనా వేసింది. కేంద్ర ప్రభుత్వం 50 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణకు అంగీకరించింది.. మరో 15 లక్షల మెట్రిక్ టన్నులుసేకరించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని మంత్రి వర్గం నిర్ణయించింది. వానకాలం సీజన్లో పండించిన ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ, పౌర సరఫరాల శాఖ, రవాణా శాఖ సమన్వయంతో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని నిర్ణయించింది. ధాన్యానికి చెల్లించే మద్దతు ధరతో పాటు సన్న వడ్లకు ఇచ్చే రూ.500 బోనస్ రైతుల ఖాతాల్లో వెంట వెంటనే జమ చేయాలని నిర్ణయం తీసుకుంది. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేయాలని, ప్రతి కొనుగోలు కేంద్రం పర్యవేక్షణ, సమన్వయానికి ఒక్కో అధికారికి ప్రత్యేక బాధ్యతలు అప్పగించాలని మంత్రివర్గం నిర్ణయించింది. రాష్ట్రంలో కొత్తగా మూడు (3) అగ్రికల్చర్ కాలేజీల ఏర్పాటు కు రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. హుజూర్‌నగర్, కొడంగల్, నిజామాబాద్‌లో అగ్రికల్చర్ కాలేజీల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేండ్లు పూర్తయిన సందర్భంగా ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలను నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. డిసెంబర్ 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తుంది. ఉత్సవాల నిర్వహణ.. సంబంధిత ఏర్పాట్లపై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడులో ఏన్కూర్ మార్కెట్ యార్డ్‌కు పది ఎకరాలు కేటాయిస్తూ కేబినెట్ తీర్మానం చేసింది నల్సార్ న్యాయ విశ్వ విద్యాలయానికి ఇప్పుడున్న చోటనే అదనంగా 7 ఎకరాల భూమిని కేటాయించే ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. నల్సార్ యూనివర్సిటీ అడ్మిషన్లలో ఇప్పుడు తెలంగాణ స్థానికులకు కేటాయించిన 25 శాతం సీట్ల కోటాను 50 శాతం పెంచాలని కేబినెట్ తీర్మానం చేసింది. హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. మెట్రో 2ఎ, 2బి విస్తరణకు అడ్డంకిగా మారిన మొదటి దశను పీపీపీ మోడ్‌లో నిర్వహిస్తున్న ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకునే విషయంపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించింది. మెట్రో రైలును ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకునే విషయంలో సాధ్యాసాధ్యాలు, అందులో ముడిపడి ఉన్న అంశాలన్నింటినీ లోతుగా అధ్యయనం చేసేందుకు ఉన్నత అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. సీఎస్ ఛైర్మన్‌గా, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, ఎంఏయూడీ కార్యదర్శి, లా సెక్రెటరీ, మెట్రో రైలు ఎండీ, అర్బన్ ట్రాన్స్‌పోర్ట్ అడ్వయిజర్ అధికారుల కమిటీలో సభ్యులుగా ఉంటారు. అధికారుల కమిటీ తమ రిపోర్టును కేబినెట్ సబ్ కమిటీకి అందిస్తుంది. కేబినేట్ సబ్ కమిటీ సిఫారసుల ఆధారంగా మెట్రోను ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకునే విషయంలో తుది నిర్ణయం తీసుకోవాలని మంత్రివర్గం తీర్మానించింది. రాష్ట్రంలో హ్యామ్ మోడ్‌లో మొదటి దశలో 5,566 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. జాతీయ రహదారులు, జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాలు, పర్యాటక ప్రాంతాలు, ఇతర రాష్ట్రాలతో అనుసంధానమయ్యే రహదారులకు సంబంధించి అభివృద్ధి, విస్తరణ పనులు చేపడుతాం ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్ పేట ఓఆర్ఆర్, ప్యారడైజ్ జంక్షన్ నుంచి డెయిరీ ఫాం రోడ్ వరకు నిర్మించే ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి సంబంధించి రక్షణ శాఖ భూములు వినియోగించుకుంటున్నందున వారికి ప్రత్యామ్నాయంగా 435.08 ఎకరాల భూములను అప్పగిస్తూ క్యాబినెట్ తీర్మానం చేసింది. కృష్ణా వికారాబాద్ బ్రాడ్‌గేజ్ రైలు మార్గం నిర్మాణానికి సంబంధించి 845 హైక్టార్ల భూ సేకరణకు అయ్యే రూ.438 కోట్ల వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించేందుకు అంగీకరిస్తూ రాష్ట్ర క్యాబినెట్ తీర్మానం చేసింది. మన్ననూర్-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించి మొత్తం వ్యయంలో మూడోవంతు ప్రభుత్వం భరించేందుకు అంగీకరిస్తూ క్యాబినెట్ తీర్మానం చేసింది. మీడియా సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీ బలరాం నాయక్ కూడా పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, 23న రాష్ట్ర కేబినెట్ సమావేశం నిర్వహించేందుకు గురువారం కేబినెట్ భేటీలో నిర్ణయం తీసుకున్నారు.

## ముఖ్యమంత్రితో విభేధాలు లేవు: కొండా మురళి

**హైదరాబాద్,అక్టోబరు16,ప్రభాతవార్త:** ముఖ్యయమంత్రి రేవంత్ రెడ్డితో తమకెలాంటి విభేదాలు లేవని కాంగ్రెస్ నేత, మంత్రి కొండా సురేఖ భర్త కొండా మురళి స్పష్టం చేశారు. ఈ మేరకు హైదరాబాద్ లో ఆయన ప్రెస్‌మీట్ నిర్వహించి మాట్లాడారు. రేవంత్‌ను కొండా సురేఖ వైఎస్‌తో పోల్చారు అని చెప్పారు. మాజీ ఓఎస్డీ సుమంత్ విషయం తనకు తెలియదని చెప్పారు. కొండా సురేఖ ఛాంబర్‌కు తాను ఇప్పటివరకు పోలేదని వ్యాఖ్యానించారు. తనకు సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్సీ పదవి ఇస్తామన్నారని. ఇస్తారని ధీమా వ్యక్తం చేశారు. తన బిడ్డ, అల్లుడు లండన్‌లో ఉన్నారని.. అక్కడే వ్యాపారం చేస్తున్నారని చెప్పారు. తన బిడ్డకు పదవి ఏమీ లేదనిప పార్టీలోనూ లేదని స్పష్టం చేశారు.

## 'జూబ్లీ' బోగస్ ఓట్ల పిటిషన్‌పై ప్రత్యేక ఆదేశాలు ఇవ్వలేం: హైకోర్టు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు16:** జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయంటూ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత, మాజీ మంత్రి కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు ఈరోజు విచారణ ముగించింది. ఈ పిటిషన్‌ను చట్ట ప్రకారం పరిశీలిస్తున్నామని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసిందని, ఈ నేపథ్యంలో ప్రత్యేకంగా కోర్టు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని హైకోర్టు సీజే ధర్మాసనం ఉత్తర్వుల్లో పేర్కొంది. పిటిషనర్ల తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు వాదనలు వినిపించారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఒకే వ్యక్తికి రెండు ఓట్లు ఉన్నాయని, ఇలా 1942కు పైగా ఓట్లను గుర్తించినట్లు తెలిపారు. నియోజకవర్గానికి సంబంధం లేని 12 వేలకు పైగా ఓట్లను గుర్తించినట్లు చెప్పారు. అనుమానాస్పద ఓట్లు, బోగస్ ఓట్లు, ఒకరికి ఒకటి కంటే ఎక్కువ ఓట్ల వివరాలను ఈ నెల 13న ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా పట్టించుకోలేదని అన్నారు. ఎన్నికల కమిషన్ తరపున దేశాయ్ అవినాశ్ రెడ్డి వాదనలు వినిపించారు. ఓటర్ల జాబితా నిరంతర ప్రక్రియ అని, 365 రోజుల పాటు ఓటర్ల నమోదు, తొలగింపు, సవరణ జరుగుతూనే ఉంటుందని కోర్టుకు తెలిపారు. ఓటర్ల జాబితాను ఈ ఏడాది జులైలో ప్రచురించి అభ్యంతరాలు కోరామని, కానీ అప్పుడు ఎలాంటి అభ్యంతరాలు రాలేదని కోర్టుకు తెలియజేశారు. నోటిఫికేషన్ విడుదలైన తర్వాత పిటిషనర్లు అత్యవసర పిటిషన్ దాఖలు చేశారని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ అభ్యంతరాలను పరిశీలిస్తున్న సమయంలో పిటిషన్ దాఖలు చేయడాన్ని తప్పుబట్టారు. కాబట్టి ఆ పిటిషన్ విచారణార్హం కాదని కోర్టుకు తెలియజేశారు. ఈ నెల 21వ తేదీ వరకు అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటామని కోర్టుకు తెలిపారు. ఇరువైపుల వాదనలు విన్న ధర్మాసనం పిటిషన్లపై విచారణ ముగించినట్లు తెలిపింది. పిటిషనర్ల ఫిర్యాదులను పరిశీలిస్తున్నట్లు ఈసీ తెలిపినందున ప్రత్యేక ఆదేశాలు అవసరం లేదని పేర్కొంది.

## వారం - వర్జ్యం

17-10-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, కృష్ణపక్షం
ఏకాదశి ఉ.11.14
మఖ మ.2.00
వర్జ్యం : రా.10.35-12.17
దు.ఉ.9.56-10.43, 2)మ.12.17-మ.1.04
శుభసమయం : ఉ.8.20-9.00
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** ఇంటి యందు శుభకార్యాలు దిగ్విజయంగా పూర్తి చేస్తారు.

**వృషభం:** నూతన విద్యావకాశాలు లాభిస్తాయి. భాగస్వామ్య వ్యాపారంలో అభివృద్ధి సాధిస్తారు.

**మిథునం:** ఇంటిలో ఒకరి ఆరోగ్యం ఆందోళన కలిగిస్తుంది. ప్రయాణాలు.

**కర్కాటకం :** ఏపనిని చేపట్టినా ఆటంకాలు ఎదురై చికాకు కలిగిస్తాయి.

**సింహం:** దీర్ఘకాలిక ఋణాలు తీరి కొంత ఊపిరిపీల్చుకుంటారు.

**కన్య :** సాంకేతిక, పరిశోధన విషయాలపై ఆసక్తి చూపుతారు.

**తుల :** వ్యాపారాలలో స్వల్ప మార్పు చోటు చేసుకుంటాయి.

**వృశ్చికం:** క్రయ, విక్రయాలలో అనుకున్నంతగా లాభాలు పొందలేక పోవచ్చు.

**ధనుస్సు:** సన్నిహితుల నుండి అందిన సమాచారం కొంత ఆందోళనకు గురిచేస్తుంది.

**మకరం:** పనులు నిదానంగా పూర్తి చేస్తారు. ఉద్యోగ యత్నాలు సాగిస్తారు.

**కుంభం:** నూతన ఒప్పందాలు చేసుకుంటారు. బంధువులను కలుస్తారు.

**మీనం :**వివాదాలకు దూరంగా వుండండి. ఉద్యోగులకు స్థానచలనం ఉంటుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



ఓంప్రకాష్‌సింగ్

## హార్యానా నూతన డిజిపిగా ఓంప్రకాష్‌సింగ్

**హైదరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** హర్యానా పూర్తిస్థాయి డిజిపిగా ఓంప్రకాష్‌సింగ్ నియమితులయ్యారు. ఆ రాష్ట్ర సీనియర్ ఐపిఎస్ అధికారి పూరన్‌కుమార్ ఆత్మహత్య తరువాత ఈ నెల 13న డిజిపిగా వున్న శతృజిత్‌సింగ్ కపూర్‌ను సర్కారు తొలగించడం తెలిసిందే. ఆయన స్థానంలో అదేరోజున ఇన్‌ఛార్జి డిజిపిగా ఓంప్రకాష్‌సింగ్‌ను నియమించారు. అదేరోజున ఆయన బాధ్యతలు కూడా చేబట్టారు. కాగా ఓంప్రకాష్‌సింగ్‌ను హార్యానా సర్కారు తాజాగా పూర్తి స్థాయి డిజిపిగా నియమించింది. బిహార్‌కు చెందిన ఓంప్రకాష్‌సింగ్ 1992 బ్యాచ్ ఐపిఎస్ అధికారి. వచ్చే డిసెంబర్ నెలాఖరు వరకు ఆయనకు సర్వీసు ఉంది. హర్యానాలో అనేక చోట్ల అనేక హోదాల్లో ఆయన పనిచేశారు.

## బిసిల బంద్‌కు మావోయిస్టు పార్టీ మద్దతు

**హైదరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకు బిసి జెఏసి ఈ నెల 18వ తేదీన తల పెట్టిన రాష్ట్ర బంద్‌కు మావోయిస్టు పార్టీ మద్దతు పలికింది. ఈ మేరకు పార్టీ అధికార ప్రతినిధి జగన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బిసిల కు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందేనని, ఈ విషయంలో కేంద్రంతో పాటు రాష్ట్ర సర్కారు కూడా సరిగ్గా వ్యవహరించడం లేదని ఆయన విమర్శించారు. దీనిపై ప్రజా ప్రతినిధులు పోరాడాలని ఆయన కోరారు. విద్యార్థులు, మేధావులు కలిసి బలమైన ప్రజా ఆందోళన చేయడం ద్వారా బిసిల కు 42 శాతం రిజర్వేషన్లు సాధించవచ్చుని ఆయన తెలిపారు. కాగా ఆర్‌ఎస్‌ఎస్ ఏర్పాటై వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రధాని మోది వంద రూపాయల నాణాన్ని, పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేయడం కూడా సరైంది కాదని జగన్ విమర్శించారు.

## కత్తితో తల్లిదండ్రులపై దాడి చేసిన కొడుకు

### ఇద్దరి పరిస్థితి విషమం: వైద్యులు

**హైదరాబాద్ (నార్సింగి), అక్టోబరు 16, ప్రభాత వార్త :** కన్నకొడుకే కత్తితో తల్లిదండ్రులిద్దరిపై దాడిచేసి తీవ్రంగా పొడిచాడు. ఈ దుర్ఘటన నార్సింగి పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గండిపేట మండలం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఇవిపిఎల్ అపీలా అపార్టుమెంట్‌లో భారతి, రవీందర్‌రెడ్డి దంపతులు తమ కుమారుడైన రఘుపాల్‌రెడ్డితో కలిసి నివాసముంటున్నారు. రఘుపాల్‌రెడ్డి నగరంలోని ఓ కళాశాలలో ఎల్‌ఎల్‌బి చదువుతున్నాడు. కొంతకాలంగా ఇతడు మానసిక అనారోగ్యంతో బాధపడు తున్నాడు. తనకు మతిస్థిమితం లేదని తల్లిదండ్రులు భావించి వైద్యం చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని, ఎంత చెప్పినా నా మాటవినడం లేదని బుధవారం అర్ధరాత్రి తల్లిదండ్రులపై కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. వారి అరుపులు విన్న చుట్టు పక్కల వారు వచ్చి తీవ్రగాయాలతో రక్తపుమడుగులో పడి ఉన్న భార్యభర్తలిద్దరిని వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారని పోలీసులు వివరించారు. ఈ మేరకు రఘుపాల్‌రెడ్డిని అరెస్టుచేసి, కేసును దర్యాప్తు చేస్తున్నట్లు నార్సింగి పోలీసులు తెలిపారు.

## ఎసిబి వలలో అగ్నిమాపక అధికారి

**నల్లగొండ, ప్రభాతవార్త, అక్టోబరు 16 :** నల్లగొండ జిల్లా కేంద్రంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు వేసిన వలలో అవినీతి తిమింగలం చిక్కింది. గురువారం పక్కా సమాచారం మేరకు ఏసీబీ అధికారులు జరిపిన మెరుపు దాడిలో నల్లగొండ జిల్లా కేంద్రంలోని అగ్నిమాపక కేంద్ర కార్యాలయం స్టేషన్ ఫైర్ ఆఫీసర్ సత్యనారాయణరెడ్డి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. దీపావళి టపాసుల దుకాణం అనుమతి కోసం రూ. 8 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఫైర్ డిపార్ట్‌మెంట్ ఆఫీసులో ఏసీబీ అధికారుల తనిఖీలు చేపట్టగా దీపావళి సందర్భంగా క్రాకర్స్ షాపు ఏర్పాటు చేయడానికి షాపు నిర్వాహకుడి దగ్గర రూ.8వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. మరిన్ని పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. నల్లగొండ జిల్లా కేంద్రం లోని అంజి కళాశాల మైదానంలో క్రాకర్స్ షాప్ ఎన్‌ఓసి అనుమతి కోసం పట్టణ ఫైర్ ఆఫీసర్ ను సంప్రదించగా ఆయన రూ. 10 వేలు డిమాండ్ చేయగా రూ. 8 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. బాధితుడు గురువారం సాయంత్రం సమయంలో ఎన్జీ కాలేజ్ మైదానంలో పట్టణ ఫైర్ ఆఫీసర్ శ్యాంసుందర్ రెడ్డిని కలిసి డబ్బులు ఇచ్చేందుకు అంగీకారం తెలపడంతో ఆయన తన బైక్ సీట్ ప్యాకెట్ లో డబ్బులు పెట్టాల్సిందిగా ఆదేశించడంతో బాధితులు అందులో నగదు పెట్టడంతో ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఏసీబి డిఎస్పి చందర్ ఈ విషయంపై పూర్తి వివరాలు సేకరించడంతో పాటు పట్టణ ఫైర్ ఆఫీసర్ శ్యాంసుందర్ రెడ్డి కార్యాలయంతో పాటు ఇండ్లలో సోదాలు చేపట్టారు. పూర్తి విచారణ అనంతరం ఎస్‌ఎఫ్‌ఓను శుక్రవారం నాంపల్లి కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎసిబీ డిఎస్పి తెలిపారు.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో మద్దతివ్వండి

### బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలులో కలిసి రండి

### సిపిఎంను కోరిన పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్



**హైదరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** నవంబరు 11న జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ కుమార్ యాదవ్‌కి మద్దతివ్వాలనీ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం జరుగుతున్న పోరాటంలో ప్రభుత్వంతో కలిసిరావాలని సిపిఎం నేతలను టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్ కోరారు. గురువారం హైదరాబాద్‌లోని సిపిఎం రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతోపాటు ఇతర నాయకులతో టీపీసీసీ చీఫ్ భేటీ అయ్యారు. భేటీలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, తదితరాంశాలపై చర్చించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై మహేష్ కుమార్ గౌడ్ మద్దతు కోరగా... ఈ విషయంపై హైదరాబాద్ నగర కమిటీలో చర్చలు జరుగుతున్నాయనీ, ఈ నెల 20న జరిగే తమ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాల్లో నిర్ణయాన్ని ప్రకటిస్తామని జాన్‌వెస్లీ హామీ ఇచ్చారు. అలాగే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అఖిల పక్ష సమావేశాన్ని నిర్వహించాలని సూచించారు. సమావేశం అనంతరం అన్ని పార్టీల నాయకులతో కూడిన బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి బీసీ రిజర్వేషన్లపై కేంద్రంపై ఒత్తిడి తెచ్చేలా కార్యాచరణ రూపొందించాలని కోరారు. ఇదే సమయంలో ఢిల్లీలో జాతీయపార్టీలతోపాటు ఇతర ప్రధాన పార్టీల మద్దతు కూడగట్టే ప్రయత్నాన్ని కూడా చేయాలన్నారు. అప్పుడే కేంద్రంపై ఈ విషయంలో తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చి విజయం సాధించగలుగుతామన్నారు. అఖిల పక్ష సమావేశం నిర్వహణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం ఢిల్లీకి అన్ని పార్టీల నేత బృందాన్ని తీసుకెళ్లడం అంశాలపై త్వరలోనే నిర్ణయం ప్రకటిస్తామని మహేష్ మార్ గౌడ్ సానుకూలత వ్యక్తపరిచారు. టీపీసీసీ చీఫ్‌తో సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, టి. జ్యోతి, టి. సాగర్, మల్లు లక్ష్మి, అబ్బాస్, బండారు రవికుమార్, ఆశయ్య, డిజి నరసింహారావు పాల్గొన్నారు.

# ఆహార శీతలపానీయాలపై 'ఒఆర్‌ఎస్' లేబుల్ నిషేధం

### ఎఫ్‌ఎస్‌ఎస్‌ఎఐ తాజా ఉత్తర్వులు జారీ



**న్యూఢిల్లీ, అక్టోబరు 16:** ఆహారశీతలపానీయాల సంస్థలు ఇకపై తమ పానీయాలపై ఒఆర్‌ఎస్ అన్న పదాన్ని వినియోగించకూడదని కేంద్ర ఆహారభద్రతా ప్రమాణాల సంస్థ (ఎఫ్‌ఎస్‌ఎస్‌ఎఐ) కొత్త సర్క్యులర్ జారీచేసింది. అన్ని ఉత్పత్తులపైనా, లేబుళ్లపైనా, ట్రేడ్ మార్కులు వంటి అన్నింటిపైనా 'ఒఆర్‌ఎస్' అన్న పదాన్ని నిషేధిస్తున్నట్లు ప్రకటించింది. పండ్లరసాలతో ఉన్నా, నాన్ కార్బొనేటెడ్ డ్రింక్స్ అయినా రెడీటు డ్రింక్ ఉత్పత్తులు అయినా కూడా ఎఫ్‌ఎస్‌ఎస్‌ఎఐ ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని ఆదేశించారు. అలాగే గతంలో అంటే 2022 లోను, 2024 లోను జారీ చేసిన మార్గదర్శకాలు, అనుమతుల ప్రకారం కంపెనీలు ఒఆర్‌ఎస్ అన్న పదం ముద్రించేందుకు అనుమతులిచ్చింది. అయితే ఈ పానీయాలేవీ కూడా ఒఆర్‌ఎస్ ఫార్ములా అనుసరించాలేదని, ప్రపంచ ఆరోగ్యసంస్థ నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా లేవని అందువల్ల ఒఆర్‌ఎస్ అన్న పదం ఇకపై ముద్రించ కూడదని ఎఫ్‌ఎస్‌ఎస్‌ఎఐ స్పష్టంచేసింది. గతంలో ఇచ్చిన అనుమతులను కూడా ఏజెన్సీ రద్దుచేసింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన ప్రమాణాలప్రకారం మాత్రమే ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్స్ ఉండాలని నిర్దేశిత ఫార్మా నిబంధనలప్రకారం ఉండాలని వాటిపైనే ఒఆర్‌ఎస్ ముద్ర ఉండవచ్చుని ఎఫ్‌ఎస్‌ఎస్‌ఎఐ వెల్లడించింది. కొన్ని వాణిజ్య పానీయాలు, ఎనర్జీ బేవరేజెస్ కూడా భారత్‌లో ఓఆర్ ఎస్‌లైక్ అంటూ పదాలను ముద్రిస్తున్నాయని, ఇది చట్టవిరుద్ధమని ఇకపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించింది. ఈ ఉత్పత్తులు ఔషధ పానీయాలు కాదని, చక్కెర, ఇతర రుచులు సమ్మిళితంచేసి ఉంటాయని అందువల్ల వీటిని ఎంతమాత్రం ఒఆర్‌ఎస్ అనేందుకు వీలులేదన్నారు.

# రాష్ట్ర బంద్‌కు ఎఐఎస్‌ఎఫ్ సంపూర్ణ మద్దతు

### స్థానిక ఎన్నికల్లో 42 శాతం బిసి రిజర్వేషన్లను అడ్డుకుంటున్న బిజెపి, బిఆర్‌ఎస్

**హైదరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో ఈ నెల 18న బీసీ జేఏసీ తలపెట్టిన బంద్ ఫర్ జస్టిస్(తెలంగాణ బంద్)కి అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్‌ఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి సంపూర్ణ మద్ధతు ప్రకటించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి గవర్నర్, రాష్ట్రపతికి పంపిన బిల్లును 6 నెలలైన ఆమోదించకుండా, బీసీ బిల్లు జివోనీ 9వ షెడ్యూల్లో చేర్చకుండా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అడ్డుకుంటున్నదని సంఘం రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్ విమర్శించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయడం ద్వారా విద్య, ఉపాధి, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు న్యాయం జరుగుతుందని, బిజెపి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రావలసిన హక్కులను కాలరాస్తుందన్నారు. రాష్ట్రంలో రాజకీయ లబ్ధి కోసం మద్దతు అంటున్న బిజెపి.. కేంద్రంలో బీసీ బిల్లును అడ్డుకుంటుందని మండి పడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యార్థిలోకం కేంద్రంలోని బిజెపి అనుసరిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వ్యతిరేక విధానాలపై తల్లిదండ్రులను ఆలోచింపజేసి రానున్న రోజుల్లో బిజెపికి ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని, రాష్ట్రంలో ఏనిమిది మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్న ఉపయోగం లేకుండా పోయిందన్నారు. బిజెపికి బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే వెంటనే బీసీ రిజర్వేషన్ల బిల్లు గవర్నర్, రాష్ట్రపతి చేత ఆమోదింపచేసి 9వ షెడ్యూల్లో చేర్చేందుకు రాజ్యాంగ సవరణ చేయాలని, రేపు(శనివారం) బీసీ జేఏసీ సంఘాల ఆధ్వర్యంలో 'బంద్ ఫర్ జస్టిస్' పేరుతో నిర్వహిస్తున్న తెలంగాణ బంద్‌కి ఏఐఎస్‌ఎఫ్ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని, విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులు బంద్‌కి సహకరించాలని, ఈ బంద్ ద్వారానైనా అసెంబ్లీ ఆమోదించిన బీసీ బిల్లుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదముద్రవేయాలని మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

# కొండగట్టు అంజన్న ఆలయంలో విద్యుదాఘాతంతో భక్తురాలు మృతి

### ఆలయ అధికారులపై పోలీసులకు ఫిర్యాదు



**మల్యాల, (జగిత్యాల జిల్లా), ప్రభాతవార్త:** రాష్ట్రంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి దర్శనానికి వచ్చిన ఓ భక్తురాలి ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి, గురువారం జరిగిన ఈ ఘటన కలకలం రేపింది. ఆలయ అధికారుల నిర్లక్ష్యమేనని ఈ ఘటనకు కారణమని మృతురాలి కుటుంబీకులు మల్యాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. గోదావరిఖనికి చెందిన వెనగంటి సత్యనారాయణ(54) తన తల్లి రాజేశ్వరి(84), భార్య సరిత కుటుంబసభ్యులతో కలిసి బుధవారం వేములవాడలో దర్శనం చేసుకుని గురువారం ఉదయం 6:30కు కొండగట్టు అంజన్న ఆలయానికి చేరుకున్నారు. 7 గంటల ప్రాంతంలో రాజేశ్వరి, కోడలు సరిత కలిసి కొండపైన కోనేరు పక్కనే ఉన్న టాయిలెట్స్‌కు దగ్గరికి వెళ్లారు. మరుగుదొడ్ల గోడకు అనుకొని ఉన్న ఇనుపజాలిని ముట్టుకోగానే రాజేశ్వరితోపాటు సరితకు కరెంట్ షాక్ తగిలింది. దాంతో రాజేశ్వరి స్పృహతప్పి పడిపోయింది. అయితే సరితకు కొద్దిగా షాక్ రాగానే వారిని గమనించిన కుటుంబీకులు వారిద్దరిని జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ వైద్యులు పరిశీలించి అప్పటికే రాజేశ్వరి చనిపోయిందని వెల్లడించారు. నిత్యం వేల సంఖ్యలో భక్తులు వచ్చే ఆలయంలో భద్రత కరువైందని, ఇటువంటి దుర్ఘటన జరగడం పట్ల ఆలయ అధికారుల నిర్లక్ష్యమేనని పలువురు భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం అక్కడ ప్రమాదకరమని బోర్డులు సైతం అమర్చకపోవడం, అన్నిటికి మించి విద్యుత్ లైన్లపై పర్యవేక్షణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం పై స్థానికులతోపాటు భక్తులు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా కొండగట్టులో తన తల్లి రాజేశ్వరి కరెంటుషాక్‌తో చనిపోవడానికి ఆలయ ఇఒతో పాటు సంబంధిత అధికారుల నిర్లక్ష్యమే కారణమని మృతురాలి పెద్ద కొడుకు సత్యనారాయణ ఫిర్యాదు చేశాడని ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మల్యాల ఎస్ఐ నరేష్ కుమార్ తెలిపారు,

## రోడ్లు భవనాల శాఖకు సమ్మక్క సారక్క జాతరపనులు

**హైదరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** మేడారం సమ్మక్క సారక్క జాతర పనులను రోడ్లుభవనాల శాఖకు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దేవాదాయశాఖకు ఈ పనులను పర్యవేక్షించే సాంకేతికత లేనందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆదేశాలు జారీ చేశారు. సమ్మక్క సారలమ్మ జాతరకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చే భక్తుల కోసం మౌలిక సదుపాయాలతోపాటు గద్దెలు, ప్రాకారాన్ని పునర్నిర్మించాలని నిర్ణయించింది. గద్దెలు, ప్రాకారం గోడ నిర్మాణాలను రూ.101 కోట్లతో చేపట్టేందుకు గతనెల 24న రెవెన్యూ దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.వీటితో పాటు రోడ్ల పనులు కూడా చేపట్టింది. తర్వాత రోడ్లు భవనాల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ చైర్మన్ సాంకేతిక కమిటీని నియమించింది. టెండర్లను ఆహ్వానించి ఈ నెల పదో తేదీన స్వీకరించింది. ఇప్పటివరకు ఈ పనుల బాధ్యత దేవాదాయశాఖకే ఉన్నా. పనుల స్వభావం, సాంకేతిక అంశాలు, నాణ్యత, నిర్ణీత వ్యవధిలోగా పూర్తి చేయడం, వీటితోపాటు ఇతర మౌలిక సదుపాయాలు, రోడ్ల నిర్మాణం.. అన్నింటినీ పరిగణనలోకి తీసుకుని మొత్తం పనులను రోడ్లుభవనాల శాఖకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఉన్న దశ నుంచి పనులను స్వాధీనం చేసుకోవాలని రోడ్లుభవనాలశాఖకు ఆదేశాలు ఇచ్చారు.

# 42 శాతం రిజర్వేషన్లు సాధించేవరకు పోరాటం ఆగదు

### 18న జరిగే రాష్ట్ర బంద్ సెగ ఢిల్లీకి తాకాలి

### బిసి జెఎసి చైర్మన్ ఆర్.కృష్ణయ్య, వర్కింగ్ చైర్మన్ జాజుల



అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, జాజుల శ్రీనివాస్‌గౌడ్, విజిఆర్ నారగోని తదితరులు

**హైదరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** ఈనెల 18న జరిగే రాష్ట్ర బంద్ సెగ ఢిల్లీకి తాకాలని బీసీ జేఏసీ చైర్మన్ ఆర్ కృష్ణయ్య, వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఈమేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో బీసీ జర్నలిస్టుల అసోసియేషన్ ఏర్పాటు చేసిన సమావేశానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు ఈ పోరాటం ఆగదని, బీసీలంతా ఏకమై రాష్ట్ర బంద్ ను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర బంద్ ముగింపు కాదని.. ఇది ఆరంభం మాత్రమేనని అన్నారు. హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు స్టే ఇవ్వడానికి నిరాకరించడం బీసీల పట్ల వ్యవస్థలు వ్యతిరేకంగా ఉన్నాయనడానికి నిదర్శనమని ఆరోపించారు. హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు స్టే ఇవ్వకపోవడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూర్తి బాధ్యత వహించాలని అన్నారు. వైస్‌చైర్మన్ విజిఆర్ నారగోని మాట్లాడుతూ బీసీలకు 42 రిజర్వేషన్ల పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి లేదని సమగ్ర కులగణన మొదలుకొని.. బిల్లును రాష్ట్రపతికి పంపడం, అది పెండింగ్‌లో ఉండగానే ఆర్డినెన్స్ తేవడం, ఆర్డినెన్స్ గవర్నర్ దగ్గర పెండింగ్ లో ఉండగానే జీవో 9ని తీసుకురావడం వరకు రేవంత్ రెడ్డి చేసిన తప్పిదాల వల్లే కోర్టులు బీసీ రిజర్వేషన్లను కొట్టేసే పరిస్థితి వచ్చిందనిదన్నారు. ఇప్పటికైనా జనాభా ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగంలో రక్షణ కల్పించినట్టుగానే.. రాజ్యాంగ సవరణ ద్వారా బీసీల రిజర్వేషన్లకు రక్షణ కల్పించాలని అలాగే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పినట్లు.. రిజర్వేషన్ల అమలును రాష్ట్రాలకే అప్పగించాలని, అప్పుడే బీసీలకు న్యాయం జరుగుతుందని రాజారాం యాదవ్ అన్నారు. దీని కోసం భవిష్యత్తులో జరిపే సుదీర్ఘ పోరాటంలో కులాలు, సంఘాలు, పార్టీలకు అతీతంగా ఉద్యమించడానికి అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెఏసి కోఆర్డినేటర్ గుజ్జకృష్ణ, మున్నూరుకాపు సంఘం అధ్యక్షులు కొండా దేవయ్య పటేల్, కనకాల శ్యాంకురుమ, బీసీ జర్నలిస్టుల అసోసియేషన్ నాయకులు మేకల కృష్ణ, కొత్త లక్ష్మణ్ పటేల్, నీలకంఠం ముదిరాజ్, బొమ్మ అమరేందర్, వివిధ కుల సంఘాలు బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## మావోయిస్టు నేత బండి ప్రకాశ్ లొంగుబాటు

**హైదరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** మావోయిస్టు పార్టీకి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఇప్పటికే ఛత్తీస్‌గఢ్ మహారాష్ట్ర, తెలంగాణలో మావోయిస్టు పార్టీ అగ్రనేతలు వారి అనుచరులతోపాటు ఆయుధాలతో వరుసగా లొంగిపోతున్న తరుణంలో సింగరేణి కార్మిక సమాఖ్య (సికాస) నేత, మావోయిస్టు పార్టీలో కీలక సభ్యుడుగా వున్న బండి ప్రకాష్ అలియాస్ ప్రభాత్ తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు సమాచారం. 40 ఏళ్లుగా దండకారణ్యంలో వున్న ప్రకాష్ సికాసలో కీలక నేతగా వుండడంతో పాటు మావోయిస్టు పార్టీలో రాష్ట్ర కమిటీ సభ్యుడు కూడా.

కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తన అనుచరులతో కలిసి పోలీసుల ఎదుట లొంగిపోవాలని నిర్ణయించుకుని ఈ మేరకు ఆయుధాలతో సరెండర్ అయినట్లు సమాచారం. ప్రకాష్ బెల్లంపల్లి వాసి. ఇటీవల మహారాష్ట్ర సిఎం దేవేంద్రఫడ్నవీస్ సమక్షంలో లొంగి పోయిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్‌రావుకు ప్రకాష్ అత్యంత సన్నిహితుడు. ఆయుధాలు వీడాలని వేణు గోపాల్‌రావు చేసిన ప్రకటన మావోయిస్టు పార్టీలో సంచలనం రేపగా దీనిని ప్రకాష్ సమర్థించారు. కాగా ప్రకాష్ లొంగుబాటుపై తెలంగాణ పోలీసులు ఎలాంటి ప్రకటన చేయలేదు. ఒకటి రెండు రోజుల్లో దీనిపై మీడియా సమావేశముండే వీలుందని సమాచారం.

## అమెరికా రక్షణ మంత్రి విమానం అత్యవసర ల్యాండింగ్



**లండన్, అక్టోబరు 16:** అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ విమానం యూకేలో అత్యవసరంగా ల్యాండ్ అయ్యింది. విమానం విండ్ షీల్డ్‌లో పగుళ్లు ఏర్పడటంతో అత్యవసరంగా ల్యాండ్ చేసినట్లు తెలుస్తోంది. బ్రస్సెల్స్‌లో నాటో రక్షణ మంత్రుల సమావేశంలో హెగ్సెత్ పాల్గొన్నారు. అక్కడి నుంచి ఆయన తిరిగి అమెరికాకు వస్తుండగా ఈ ఘటన జరిగింది. ఈ విషయాన్ని పెంటగాన్ కూడా ధ్రువీకరించింది. హెగ్సెత్‌తో సహా విమానంలోని వారంతా సురక్షితంగా ఉన్నారని పెంటగాన్ ప్రతినిధి సీన్ పార్నెల్ పేర్కొన్నారు. ఇదిలా వుంటే నాటో సమావేశంలో ఉక్రెయిన్‌పై దూకుడుగా వ్యవహరిస్తున్న రష్యాకు హెగ్సెత్ కీలక హెచ్చరికలు చేశారు. మాస్కో దూకుడు ఇలాగే కొనసాగితే అమెరికా మిత్రదేశాలతో కలిసి రష్యాకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని, ఉక్రెయిన్ రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేయడంపై కూటమి దృష్టి సారిస్తుందని హెచ్చరించారు.

## రవాణా విభాగంలో ఆయుధపూజ

**తిరుమల,అక్టోబర్ 16ప్రభాతవార్తప్రతి నిధి:** టిటిడి రవాణ విభాగంలో తిరుపతి,తిరుమలలోని ఆ కార్యాలయాల్లో ఆయుధపూజ ఘనంగా నిర్వహించారు. తొలుత వర్కుషాపుల్లో యంత్రాలకు, అనంతరం టిటిడి అన్ని వాహనాలకు పూజలు చేసి పూలతో అలంకరించారు. ప్రతి ఏడాది దసరా తరువాత ఈ ఆయుదపూజ చేయడం ఆనవాయితీ. ఈ కార్యక్రమంలో రవాణా జిఎం శేషారెడ్డి,డిఎంలక్ష్మీప్రసన్న, డిప్యూటీ ఇఒలు లోకనాథం, భాస్కర్, రాజేంద్ర, ఓఎస్‌డి సత్రానాయక్ పాల్గొన్నారు. టిటిడి రవాణావిభాగంలో 340 వాహనాలు, 90 ద్విచక్రవాహనాలుకు పూజలు చేశారు.



## దివంగత ఐపిఎస్ భార్య అమ్నీత్‌కుమార్‌పైనా ఎఫ్ఐఆర్

**రోహతక్, అక్టోబరు 16:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన హర్యానా ఐపీఎస్ ఆఫీసర్ పూరన్ కుమార్ సూసైడ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. పూరన్ కుమార్ భార్య, ఐఏఎస్ అధికారి అమ్నీత్ కుమార్ పై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పూరన్ కుమార్ ఆత్మహత్య చేసుకున్న తర్వాత రెండు రోజులకు ఆయనపై అవినీతి ఆరోపణలు చేస్తూ రోహ తక్ ఏఎస్ఐ సందీప్ కుమార్ సూసైడ్ చేసుకున్నారు. తన భర్త మరణానికి ఐఏఎస్ అధికారి అమ్నీత్ కారణమంటూ ఏఎస్ఐ భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. పూరన్ అవినీతిపై తన భర్త విచారణ జరుపుతున్నాడని, అందుకే ఆయనపై పూరన్, అమ్నీత్ సహా ఉన్నతాధికారులు వేధింపులకు పాల్పడ్డారని సందీప్ భార్య ఆరోపించారు. అమ్నీత్ ను అరెస్టు చేసేంత వరకూ తన భర్తకు అంత్యక్రియలు జరబోమని చెబుతూ బంధువులతో కలిసి సందీప్ మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించి ఆందోళన చేపట్టింది. సందీప్ భార్య ఫిర్యాదుతో పోలీసులు అమ్నీత్ కుమార్ పై కేసు నమోదు చేశారు. కుల వివక్షతో ఉన్నతాధికారులు తనను వేధిస్తున్నారని, తప్పుడు కేసులో ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపిస్తూ హర్యానా జైళ్ల శాఖ ఐజీ, ఐపీఎస్ ఆఫీసర్ పూరన్ కుమార్ ఇటీవల ఆత్మహత్య చేసుకున్నారు. తన నివాసంలో సర్వీస్ రివాల్వర్ తో కాల్చుకుని మరణించారు. తన భర్త మరణానికి కారణమైన హర్యానా డీజీపీ శత్రుజీత్ కపూర్, రోహ తక్ ఎస్పీ బిజార్నియాను అరెస్టు చేయాలంటూ పూరన్ భార్య, ఐపీఎస్ ఆఫీసర్ అమ్నీత్ కుమార్ డిమాండ్ చేశారు. పూరన్ ఆత్మహత్య సంచలనంగా మారడంతో హర్యానా ప్రభుత్వం స్పందించి డీజీపీని సెలవుపై పంపడంతో పాటు రోహ తక్ ఎస్పీని సస్పెండ్ చేసింది. పూరన్ కుమార్ మరణించిన రెండు రోజుల తర్వాత రోహ తక్ ఏఎస్ఐ సందీప్ కుమార్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. పూరన్ కుమార్ అత్యంత అవినీతిపరుడని, తన అవినీతిపై విచారణ జరుగుతుండడంతో నిజాలు బయటపడతాయనే భయంతోనే ఆయన ఆత్మహత్య చేసుకున్నాడని సందీప్ కుమార్ తన సూసైడ్ లేఖలో ఆరోపించారు. డీజీపీ శత్రుజీత్ కపూర్ నిజాయితీపరుడని, పూరన్ కుమార్ తప్పుడు ఆరోపణలు చేశాడని విమర్శించారు. పూరన్ కుమార్ అవినీతిపై విచారణ జరుపుతున్న తనకు తెలిసిన నిజాన్ని ప్రపంచానికి వెల్లడించాలనే ఉద్దేశంతోనే తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నానని చెప్పారు

తెలంగాణ ప్రభుత్వం
సత్తుపల్లి మునిసిపాలిటీ కార్యాలయం
కొటేషన్ మరియు EOI ప్రకటన
Roc.No.E/SPL/129/Quotation/EOI/2025, తేది: 15.10.2025
సత్తుపల్లి మునిసిపాలిటీ కమిషనర్, క్రింది పనులకు కొటేషన్‌లు ఆహ్వానిస్తున్నారు. 1. డంపింగ్ యార్డ్ యొక్క మెషీనరీ మరియు సామగ్రి సరఫరా మరియు అందజేత, 2. సత్తుపల్లి మునిసిపాలిటీ పేరొందిన ఇంజనీరింగ్ మరియు అర్బన్ ప్లానింగ్ కన్సల్టెంట్‌ల నుండి వివిధ అభివృద్ధి గ్రాంట్స్ క్రింద గుర్తింపబడిన సెక్టార్‌లు/ప్రాజెక్ట్‌ల కొరకు సమగ్రాభివృద్ధి ప్రణాళికల సవివర ప్రాజెక్ట్ నివేదిక తయారీ నిమిత్తం ఆసక్తి యొక్క వ్యక్తీకరణ (EOI) ఆహ్వానిస్తోంది. తదుపరి అన్ని వివరాలకు సత్తుపల్లి మునిసిపాలిటీ 9030613631 సంప్రదించండి. కొటేషన్‌ల ఆహ్వానం కొరకు ముగింపు తేది: 25.10.2025. ఏవైనా విచారణలకు, సత్తుపల్లి మునిసిపాలిటీ సెల్ నం: 8008801220, 9030613631 సంప్రదించండి. మెయిల్ : npsathupalli2@gmail.com
సం/-. కమిషనర్, సత్తుపల్లి మునిసిపాలిటీ, ఖమ్మం జిల్లా, TS.
DIPR.NO. 9277-PP/CL/ADVT/1/2025-26 తేది: 16.10.2025

వార్త

కృషిపైనే అభివృద్ధి ఆధారపడి ఉంటుంది. దానంతట అది ఏదీ మన దగ్గరకు రాదు.

-ఫ్రాంక్లిన్


# చట్టం అందరికి సమానమేనా?

'దొరతనంబునందు దొంగతనంబునందు భాగ్యవంతునికి ఏదైనా బాధలేదు' అన్నారు పెద్దలు. ఏ సందర్భంలో ఏ అనుభవంతో ఎవరిని ఉద్దేశించి ఈ లోకోక్తి పుట్టిందో కానీ ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే వారు చెప్పింది అక్షరాలా నిజమేనని పిస్తున్నది. కానీ మన రాజ్యాంగ నిర్మాతలు ఇవేమీ దృష్టిలో పెట్టుకోకుండా కుల, మత,వర్గ,లింగ బేధాలు లేకుండా అందరికి సమానంగా వర్తించే విధంగా శాసనాలతో రాజ్యాంగాన్ని రూపొందించారు. అవి నిష్పక్షపాతంగా అమలు చేస్తారని భావించారు. కానీ దురదృష్టవశాత్తు అమలు చేయాల్సిన కొందరు అధికారులు రాజకీయ ఒత్తిడిలకు లొంగో లేక దక్షిణ ప్రలోభంలో పడి చట్టాన్ని తమకు అనుకూలంగా మలుచుకుంటారని నాటి రాజ్యాంగ నిర్మాతలు ఊహించలేకపోయారు. ఫలితంగా వందలాది కరుడుగట్టిన నేరస్తులు చట్టం నుంచి తప్పించుకోగలుగుతున్నారు. అన్నింటికంటే మించి ప్రజలను వంచించి కోట్లాది రూపాయలు దోచుకుంటున్న వైట్‌కాలర్ నేరస్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బయటపడగలుగుతున్నారు. సమర్థవంతంగా దర్యాప్తు చేసి పటిష్టమైన రికార్డులు తయారు చేసి అవసరమైన సాక్ష్యాలను సేకరించి న్యాయస్థానాల ముందు నిలబెట్టి రుజువు చేయడంలో సంబంధిత అధికారులు ఘోరంగా విఫలమవుతున్నారు. కొన్నిసార్లు పరిస్థితుల ప్రభావం వల్ల దర్యాప్తు సక్రమంగా జరగకపోతే మరికొన్ని సందర్భాల్లో ఆశ్చర్యకరంగా అధికారులే స్వయంగా కేసులు వీగిపోయే విధంగా రికార్డులు తయారు చేస్తున్నారు. అందుకు వారికి ఉన్న కారణాలు వారికి ఉన్నాయి. ఇంకొన్ని సందర్భాల్లో అధికారులుసకల అవస్థలు పడి కోర్టుల ముందు రుజువులు సర్వం సిద్ధం చేసినప్పుడు కొందరు పాలకులే ఏకంగా కేసులకు మోకాలొడ్డుతున్నారు. ఇలాంటి సందర్భాల్లో సమర్థవంతంగా దర్యాప్తులు చేసే అధికారుల్లో నిస్పృహ నిరాశా పెంచుతున్నారు. దీనికితోడు ఏనాడో తయారు చేసిన చట్టాలు నిబంధనల్లో ఉన్న లొసుగులను నేరస్తులు ఉపయోగించుకోగలుగుతున్నారు. అందుకే అప్పటి పరిస్థితులకు అనుగుణంగా ఆనాటి బ్రిటిష్ ప్రభువులు తయారు చేసిన సిఆర్‌పిసి, ఐపిసి నిబంధనలను కాలాగుణంగా సవరించాలనే పోలీసుల వాదన కూడా సమంజసమే. ఇటీవల మూడు చట్టాలను కూడా కేంద్రప్రభుత్వం సవరించింది. అయితే ఉన్న నిబంధనలను, చట్టాలను ఏమేరకు నిష్పక్షపాతంగా అమలు చేస్తున్నారనేదే ప్రశ్న. ధనిక, పేదతేడా లేకుండా ఎంతవరకు చిత్తశుద్ధితో వ్యవహరించగలుగుతున్నారనేదే ముఖ్యం. ఏ అండా లేని నిరుపేదలు పోలీసు స్టేషన్‌కు వస్తే ఎలా వ్యవహరిస్తారో ప్రత్యేకంగా చర్చించాల్సిన అవసరం లేదు. కిందిస్థాయి పోలీసు ఉద్యోగుల్లో ప్రవర్తనలో మార్పులు తీసుకువచ్చేందుకు గత రెండు, మూడు దశాబ్దాలుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. కొంతమేరకు ఫలితాలు కన్పిస్తున్నా ఆశించిన స్థాయిలో ఇవి జరగడంలేదనే చెప్పొచ్చు. ఇందుకు కిందిస్థాయి అధికారులను నియమించేకంటే ఉన్నతస్థాయిలో ఉన్న అధికారుల్లో కొందరు రాజకీయ నాయకులు ఒత్తిడికి తలొగ్గడం వల్లనే ఈ పరిస్థితులు దాపురిస్తున్నాయనే ఆరోపణలను తోసిపుచ్చలేం. ప్రధానంగా పోలీసుల్లో కొందరు ఉన్నతాధికారులు రాజకీయనేతలతో మమేకం కావడం వల్లనే కింది స్థాయి ఉద్యోగులు పెదవి విప్పలేకపోతున్నారు. దేశవ్యాప్తంగా కానీ, తెలుగురాష్ట్రాల్లో కానీ ఈ బోగస్ ఫైనాన్స్ కంపెనీలు పెట్టి కోట్లాదిమంది అమాయకుల కష్టార్జితాన్ని కోట్లల్లో కొల్లగొట్టి బోర్డులు తిప్పేస్తే జీవితకాలంపాటు సంపాదించుకున్న డబ్బుపోగొట్టుకొని న్యాయం చేసేవారు లేక బాధితుల వేదనఅరణ్యరోదనగా మారుతున్నది. కొందరు బాధితులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు తరచుగా చోటుచేసుకుంటున్నాయి. ఇలా మోసపోయిన వారి సంఖ్య ఇటీవల కాలంలో పెరిగిపోతుండడం ఆందోళన కలిగించే అంశం. తెలుగురాష్ట్రాల్లో గత దశాబ్దంలో పరిశీలిస్తే అధికారికంగా, అనధి కారికంగా లెక్కలు చూసినా దాదాపు ఇరవై వేలకోట్లకుపైగా బోగస్ ఫైనాన్స్ కంపెనీలు, చిట్‌ఫండ్ కంపెనీలు ప్రజలను మోసం చేసి దోచుకున్నట్లు అంచనా. ఇందులో కొన్నింటిలో రికవరీ ఏదో కొద్దిశాతం ఉన్నా ఇలా నిలువునా ప్రజలను మోసం చేసిన దగాకోర్లపై నిర్దిష్టమైన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. మరొకపక్క మోసపోయిన వారు బాధితుల సంఘాలంటూ ఏర్పడినిరసనలు, ధర్నాలు, రాస్తారోకోలు, తదితర ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇంకొకపక్క ఏదోరకంగా డబ్బుసంపాదించగలిగితే తమనుఎవరు ఏమీ చేయలేరనే భావన మోసగాళ్లల్లో పెరిగిపోతున్నది. ఈ విషయంలో కొందరు బాధితులు పోలీసు స్టేషన్‌కు వెళ్లితే న్యాయం సంగతి ఎలాఉన్నా అసలుకేసులు నమోదు చేసుకోవడానికి అధికారులు ఇష్టపడడంలేదు. మమ్మల్ని అడిగి ఇచ్చారా? ఇచ్చేటప్పుడు తెలివిలేదా? లాభం వస్తే మా వద్దకు వచ్చేవారా? అంటూ ప్రశ్నల వర్షం కురిపించి మళ్లీ పోలీసు స్టేషన్‌కు రాకుండా చేసి పంపుతున్నారు. అంతేకాదు ఇది సివిల్ తగాదా అని జోక్యం చేసుకోవడానికి వీలులేదని, న్యాయస్థానాలకు వెళ్లి వసూలు చేసుకోమని సలహాలు ఇస్తున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఇలాంటి ఫిర్యాదులన్నీ నమోదు చేస్తే పోలీసులు వేరే పనిచేయలేరనే వాదనను తోసిపుచ్చలేం. పెరిగిన నేరాలతో పాటు పోలీసులకు బాధ్యత కూడా విపరీతంగా పెరిగిపోయిందనడంలో సందేహంలేదు. అయితే ఇలాంటిమోసాలు పెద్దఎత్తున జరగడం ప్రభుత్వ ప్రతిష్టను, పోలీసువ్యవస్థపై ప్రజలకు ఉన్న గౌరవాలను తగ్గిస్తున్నది. పాలకుల పట్ల వ్యతిరేకతను ఏర్పరుస్తున్నది. పాలకులు ఆ కోణంలో ఆలోచించాలి. ఈ దగా, భారీ మోసాలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి.



వాడని ఇనుము తుప్పు పడుతుంది. కదలని నీరు స్వచ్ఛతను కోల్పోతుంది. బద్ధకం మెదడును నిస్తేజం చేస్తుంది.

దావిన్సి



విద్య లేకుండా ఊహలున్నవాడు, కాళ్లు లేకుండా రెక్కలున్న పక్షితో సమానం.

మహాత్మా గాంధీ

# సామాన్యులకు అధికార ఫలాలు దక్కేదెన్నడు?

**సమాజంలో కీలకంగా సేవలందించే నాయీబ్రాహ్మణ, విశ్వబ్రాహ్మణ, శాలివాహన(కుమ్మరి), రజక, మహేంద్ర (మేదర) వంటి వందకుపైగా బీసీ కులా లకు చెందిన వారు స్వాతంత్య్రం వచ్చి 75 సంవత్సరాలు దాటినా నేటి వరకు చట్టసభలలో ప్రవేశించలేకపోయారు. కనీసం వీరికి నామినేటెడ్ పదవులలో కూడా వీరికి తగిన స్థానం లభించడం లేదు. కీలకమైన నామినేటెడ్ పోస్టుల పంపిణీ కూడా ఏ కులానికి చెందినవారు అధికారంలో వుంటే ఆ కులానికి చెందినవారికే దక్కుతున్నాయి. అందుకు ఒక చిన్న ఉదాహరణ రాష్ట్రంలోని కనకదుర్గ గుడి, శ్రీశైలం, కాణిపాకం, అన్నవరం వంటి ప్రధాన దేవాలయాల ట్రస్టు బోర్డు ఛైర్మన్ పదవులన్నీ ఒకే సామాజికవర్గానికి దక్కాయి. కాకపోతే భార్యకు భోజనం పెట్టి సమాజాసేవ చేస్తున్నా మని చెప్పిన చందంగా ఇతర కులాలవారికి వంద రూపా యలు నిధులు కూడా లేని కార్పొరేషన్ ఏర్పాటు చేసి, ఆయా కులాలకు చెందిన వారిని ఆయా కార్పొరేషన్లకు అధ్యక్షులను, డైరక్టర్లను నియమిస్తున్నారు.**



అన్నవరపు బ్రహ్మయ్య

ప్రాచీన కాలం సంగతి ఎలా ఉన్నా స్వాతంత్య్రం వచ్చిన 76 ఏళ్ల తర్వాత కూడా కులాలపై మాట్లాడవలసిరావడం బాధాకరం. 5జి నుంచి 6జికి పరుగులు పెడుతున్న రోజులలో మనుషులు ఏ మాత్రం శాస్త్రీయతలేని కులం కౌగిలి నుంచి బయటకు రాలేకపోవడడానికి కారణం ఏమిటో ఎవరికి వారు ఆత్మ పరిశీలన చేసుకోవాలి. ఎదుటి మనిషికే చెప్పేటందుకు నీతులు వున్నాయి అని ఒక సినిమా కవి అన్నట్టుగా ప్రస్తుతం ఎవరివారు కులం పోవాలని చెప్తున్నారు, కానీ తాము ఆచరించటం లేదు. అందుకు ఉదాహరణ ఇటీవల ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో అనంతపురం శాసన సభ్యులు, సినీనటుడు బాలకృష్ణ చేసిన ప్రసంగం నేపథ్యంలో ప్రధానంగా సోషల్ మీడియా వేదికగా మూడు కులాల మధ్య జరుగుతున్న కుమ్ములాట. రాష్ట్రంలో కులాలంటే ఆ మూడు(రెడ్డి, కమ్మ, కాపు) కులాలే కులాలని, ఇతర కులాలేవి లేనట్టుగా, ఏ రాజకీయం చేయాలన్న తాముమాత్రమే చేయగలమనే అధిపత్య ధోరణి వారిలో కనిపిస్తోంది. సినీ నటుడు, శాసన సభ్యుడు బాలకృష్ణ అసెంబ్లీలో మెగాస్టార్ చిరంజీవిని అవమాన పర్చారంటూ వైఎస్‌ఆర్ కాంగ్రెస్ సోషల్ మీడియానే కాకుండా కాపు సామాజికవర్గానికి చెందిన నేతలు, కొంత మంది జనసేన పార్టీ కార్యకర్తలు తీవ్రంగా స్పందించారు. వాస్తవానికి కమ్మ, కాపు, సామాజికవర్గాల మధ్య రాజకీయంగా పోటీతత్వం ఎన్నోఏళ్లుగా కొనసాగుతోంది. అయినప్పటికీ గత ఎన్నికల్లో అనుకోని రీతిలో చంద్రబాబు,పవన్ కళ్యాన్ మధ్య బంధం ఏర్పడం, పవన్ కళ్యాన్ మధ్యవర్తిత్వంతో తెలుగుదేశంపార్టీ, బిజెపిల మధ్య పొత్తు కుదిరింది. పర్యావసానంగా తెలుగుదేశం, జనసేన, బిజెపిల మధ్య పొత్తుకుదిరి కూటమిగా ఏర్పడం వల్ల తిరుగులేని మెజారిటీని సాధించారన్నది వైఎస్‌ఆర్ కాంగ్రెస్ నేతల భావన. ఈ నేపథ్యంలోనే పొత్తును దెబ్బతీయడానికి ఆ పార్టీ నేతలు ఏ చిన్న అవకాశాన్ని కూడా వదిలి పెట్టడంలేదు. అయితే రాజకీయంగా తలపండిన తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, బాలకృష్ణ కారణంగా తెలుగుదేశం పార్టీ జనసేన పార్టీల మధ్య బాలెన్స్ దెబ్బతినకుండా వుండేందుకు కృషిచేస్తున్నారు. ఆ కృషిలో భాగంగానే ఇటీవల చంద్రబాబు జనసేన నేత పవన్ కళ్యాన్ ఇంటికి వెళ్లారని అర్థం అవుతోంది. అయితే ఈ సందర్భంగా జనసేన నేత పవన్ కళ్యాన్ పరిణితితో వ్యవహారించారని చెప్పవచ్చు. ప్రతి రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు కులం కూడు పెట్టదని, కుల నిర్మూలన జరగాలని అంటారు. రాజకీయ పార్టీలకు చెందిన నేతలైతే అధికారంలోకి రావాలంటే కేవలం ఒక కులంవారు ఓటు వేస్తే చాలదని, మిగిలిన కులాలకు చెందినవారు ఓట్ల మీదనే ఆధారపడాలని సన్నాయి నొక్కులు నొక్కుతారు. వాస్తవంలో కూడా రాష్ట్రంలో ఈ మూడు కులాల సంఖ్య నామమాత్రమే. గత ప్రభుత్వంలో అనధికారికంగా నిర్వహించిన సర్వే ప్రకారం ఆంధ్రప్రదేశ్ మొత్తం జనాభాలో రెడ్డి సామాజిక వర్గం 5శాతం కానీ, వారికి దక్కిన శాసన సభస్థానాలు 32. కమ్మ సామాజిక వర్గం 3.5 శాతం, కానీ వారికి దక్కిన శాసనసభ స్థానాలు 35. కాపుల సామాజికవర్గం 10శాతం, కానీ వారికి దక్కిన శాసన సభస్థానాలు 18. బీసీ సామాజిక వర్గాల జనాభా 45శాతం, కానీ వారికి దక్కిన సీట్లు కేవలం 40 స్థానాలు, అసెంబ్లీలోని మొత్తం175 స్థానాలలో జనాభా నిష్పత్తి ప్రకారం 5 శాతం వున్న రెడ్డి సామాజికవర్గానికి 8స్థానాలు మాత్రమే దక్కాలి, కానీ 35మంది శాసన సభ్యులు వున్నారు.



మొత్తం జనాభాలో 3శాతం వున్న కమ్మ సామాజిక వర్గానికి 5 స్థానాలు మాత్రమే దక్కాలి, కానీ 32 మంది శాసన సభ్యులు వున్నారు. ఇదే సమయంలో మొత్తం జనాభాలో45శాతం వున్న బీసీ సామాజిక వర్గాలకు 80 స్థానాలు దక్కాలి, కానీ కేవలం 40 మంది శాసన సభ్యులు మాత్రమే వున్నారు. సమాజంలో కీలకంగా సేవలందించే నాయీబ్రాహ్మణ, విశ్వబ్రాహ్మణ, శాలివాహన(కుమ్మరి), రజక, మహేంద్ర (మేదర) వంటి వందకుపైగా బీసీ కులాలకు చెందిన వారు స్వాతంత్య్రం వచ్చి 75 సంవత్సరాలు దాటినా నేటి వరకు చట్టసభలలో ప్రవేశించలేకపోయారు. కనీసం వీరికి నామినేటెడ్ పదవులలో కూడా వీరికి తగిన స్థానం లభించడం లేదు. కీలకమైన నామినేటెడ్ పోస్టుల పంపిణీ కూడా ఏ కులానికి చెందినవారు అధికారంలో వుంటే ఆ కులానికి చెందినవారికే దక్కుతున్నాయి. అందుకు ఒక చిన్న ఉదాహరణ రాష్ట్రంలోని కనకదుర్గ గుడి, శ్రీశైలం, కాణిపాకం, అన్నవరం వంటి ప్రధాన దేవాలయాల ట్రస్టు బోర్డు ఛైర్మన్ పదవులన్నీ ఒకే సామాజికవర్గానికి దక్కాయి. కాకపోతే భార్యకు భోజనం పెట్టి సమాజాసేవ చేస్తున్నామని చెప్పిన చందంగా ఇతర కులాలవారికి వంద రూపాయలు నిధులు కూడా లేని కార్పొరేషన్ ఏర్పాటు చేసి, ఆయా కులాలకు చెందిన వారిని ఆయా కార్పొరేషన్లకు అధ్యక్షులను, డైరక్టర్లను నియమిస్తున్నారు.కొంతమంది ఈ మూడు కులాలవారి గురించి మాట్లాడే సమయంలో పాలక వర్గాలని, అధిపత్య కులాలని ప్రస్తావిస్తారు. అసలు పాలక లేదా ఆధిపత్య కులాలుగా మారడానికి అర్హత ఏమిటి? నిజానికి ఈ మూడు కులాలకంటే ముందు బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన రాజాజీ, ప్రకాశం పంతులు, బూర్గుల రామకృష్ణయ్య పంతులు, పి.వి. నరసింహారావు వంటి వారు ముఖ్యమంత్రులుగా పనిచేసినా వారు పాలక వర్గంగా చెలామణి కాలేదు. బ్రాహ్మణ ముఖ్యమంత్రులకు, ఈ మూడు కులాల నాయకులకు మధ్య వున్న తేడాడబ్బు. దీనిని బట్టి పాలక లేదా అధిపత్య కులాలుగా మారడానికి డబ్బే ప్రధాన అర్హత అనిపిస్తోంది. స్వాతంత్య్రం వచ్చిన తొలినాళ్లలో రాజకీయ పార్టీల సిద్ధాంతాలు, నాయకుల సామర్థ్యాన్ని బట్టి రాజకీయాలు నడిచేవి. కానీ ప్రస్తుతం డబ్బు చుట్టూ రాజకీయాలు తిరుగుతున్నాయి. ఎంఎల్‌ఎ టిక్కెట్ కావాలంటే ఎన్నికోట్లు ఖర్చుపెట్టగలవు? పార్టీకి ఎన్నికోట్లు చందా ఇవ్వగలవు అని ప్రశ్నిస్తున్నారు. ఈ కారణంగానే రాజకీయాలు, ఎన్నికలు అత్యంత ఖరీదైన వ్యవహారంగా మారాయి అని చెప్పడం కంటే మార్చారు అని చెప్పాల్సి వుంటుంది. శాసన సభ్యునిగా లేదా పార్లమెంటు సభ్యునిగా సామాన్యులెవ్వరూ పోటీచేసే అవకాశం లేకుండా పోయింది. ఎన్నికలలో కోట్లు ఖర్చుపెట్టి, అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్టిన ఖర్చుకు కొన్ని వందల రెట్లు అదనంగా సంపాదించడమే రాజకీయాలకు అర్హతగా మారింది. గతంలో తహశీల్దారు, సబ్ కలెక్టరు/ఆర్డిఓ కార్యాలయాలు అర్జిదారులతో కిటకిటలాడేవి. కానీ ప్రస్తుతం శాసన సభ్యుల, పార్లమెంటు సభ్యుల కార్యాలయాలు కిటకిటలాడుతున్నాయి. గతంలో కంట్రాక్టు పనులు, వ్యాపారాలు, పరిశ్రమలకు లైసెన్సులు పొందం వంటి సమయాలలో మాత్రమే శాసన సభ్యుల ప్రమేయం వుండేది. కానీ ప్రస్తుతం ఇంటి ప్లాన్ ఆమోదం నుంచి రోడ్డు పక్కన బడ్డీ షాపు పెట్టుకోవడం వంటి చిన్నచిన్న వ్యవహారాలకు కూడా శాసన సభ్యుల అనుమతి కాల్సి వస్తోంది. ఇక నియోజకవర్గంలో ఏ ఉద్యోగి అయినా, అధికారి అయినా పనిచేయాలన్నా, బదిలీ కావాలన్నా శాసన సభ్యుని అనుమతి కావాల్సిందే. చివరికి ఉన్నతాధికారులు కూడా తమ కింద ఉద్యోగులను బదిలీ చేయడానికి స్థానిక శాసన సభ్యుల లేఖలు జతచేయాలని కోరుతున్నారు. రాష్ట్ర స్థాయిలో ఏదైన నిర్ణయం చేయాలంటే ముఖ్యమంత్రి కనీసం కేబినెట్ సమావేశంలో ఏర్పాటు చేయాల్సి వుంటుంది. శాసన సభ్యులకు తన నియోజక వర్గంలో ఎవరి అనుమతి అవసరం లేదు.తాను అనుకుంటే ఏదైన చేయగలడు. ఈ మూడు సామాజిక వర్గాల నేతలు అధికారం కోసం పరస్పరం విమర్శలు చేసుకొంటూనే మరో వైపు వైవాహిక సంబంధాలను కలుపుకుంటున్నారు. అధికార రాజకీయాలకోసం ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్న నాయకుల ఆధిపత్య ధోరణిని ఇతర సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు గమనిస్తున్నారు. ఉందిలే మంచి కాలం ముందు ముందునా..అందరూ సుఖపడాలి నంద నందనా అనిమహాకవి శ్రీశ్రీఅన్నట్టుగా ప్రజాచైతన్యంతో భవిష్యత్తులోఅందరికి అధికార ఫలాలు అందేరోజులు వస్తాయని ఆశిద్దాం. •

# ప్రజలకు ప్రాణసంకటంగా మారిన కల్తీ మద్యం!

బుగ్గన మధుసూదనరెడ్డి

ఈ మధ్యకాలంలో రాష్ట్రవ్యాప్తంగా కూడా విచ్చలవిడిగా కల్తీ మద్యం ఏరులై పారుతూ ప్రజలప్రాణాలతో ఆటలాడుకుంటున్న విషయం మనందరికీ విధితమే. కేవలం స్పిరిట్, రసాయనాలతో తయారుచేసి,పాపులర్ బ్రాండ్‌లను తలపించేలా బాటిళ్లపై నకిలీలేబుల్స్ అతికించి మరీ యధేచ్ఛగా సరఫరా చేస్తూ కల్తీమద్యం తయారీదారులు ఈ మందు ప్రియులను బురిడీ కొట్టిస్తూ తమ వ్యాపారాన్ని మూడుపువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లేటట్లు చేసుకుంటున్నారు అనే మాట అక్షర సత్యం. అయితే ఇది కల్తీ మద్యం అని తెలియని అమాయక ప్రజలు వీటిని సేవించి తమ ఆరోగ్యాన్ని చేజేతులారా పాడుచేసుకుంటున్నారు. ముఖ్యంగా కల్తీ మద్యం సేవనం మూలాన వీటిని తీసుకున్న ప్రజలకు అవయవ వైకల్యం ప్రాప్తించడం, వారికి వినికిడి సమస్యలు తలెత్తడం,దృష్టిలోపం ఏర్పడటం,వారి మూత్రపిండాలు దారుణంగా దెబ్బతిని, చివరకు వారి కాలేయాలు సైతం వైఫల్యానికి గురిఅయ్యి,వారి ప్రాణాలకే ముప్పు ఏర్పడే దయనీయ పరిస్థితులు సైతం వారికి సంప్రాప్తించడం ఎంతైనా ఈసమాజానికి సంబంధించి అత్యంత ఆందోళన రేకెత్తించే విషయం. అయితే ఇంత జరుగుతున్న ఎందుకనో రాష్ట్రవ్యాప్తంగా ఎక్సైజ్ శాఖ అధికారులు ఈ కల్తీమద్యం తయారీకి అడ్డుకట్ట వేయడంలో మాత్రం ఘోర వైఫల్యం చెందుతూనే వున్నారు. అంతేకాదు ఈకల్తీ మద్యం కేసు నిగ్గు తెల్చేందుకు ఈ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఈ కేసును సి.బి.ఐ వారికి అప్పగించాలని కూడా వైస్సార్సీపీ గట్టిగా డిమాండ్ చేశారు. ఏదిఏమైనా ఈ కల్తీ మద్యంలో మీథాయిల్, సీసం, ఇతర విష రసాయనాలు కలవడం మూలాన వీటిని సేవించిన మద్యం ప్రియులు తీవ్ర అనారోగ్యాల బారినపడి ఇటు ఆర్థికంగా నష్టపోవడంతో పాటు, అటు వారి కుటుంబాలను సైతం వారు ఈ మద్యం వ్యసనం మూలాన అధోగతిపాలు చేయడంతో పాటు వారిని రోడ్డు మీద పడేలాచేస్తున్నారు అనేమాట అక్షర సత్యం.ఇక మన రాష్ట్ర ప్రభుత్వం వారైతే 'ఆదాయమే ఏకైక పరమావదిగా భావిస్తూ ప్రజలు ఏమైపోతే మాకేంటి' అనే నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం మూలాన మందు ప్రియుల జీవితాలు రోజురోజుకు నరకప్రాయంగా మారిపోతున్నాయి అనడంలో ఎలాంటి సందేహానికి తావు లేదు.ఏమైనా మన ప్రజలు ఇప్పటికయినా విచక్షణ జ్ఞానంతో వ్యవహరించి 'ఈ కల్తీ మద్యం వద్దు, తమకు తమప్రాణాలే ముద్దు' అనే నీతి నానుడికి పెద్దపీట వేసి, అంతిమంగా తమ కుటుంబాల బాగోగులు,శ్రేయస్సే తమకు ప్రధానమని తక్షణమే భావించి వారి ఆరోగ్యాలను సర్వనాశనం చేసే, గుల్ల గావించే ఈ మద్యం అనే పాడు, చెడు అలవాటుకు వీలైనంత త్వరగా గుడ్ బై చెప్పగలిగితే వారంతా ఎలాంటి ఇబ్బందుల పాలు కాకుండా వారు,వారిని నమ్ముకున్న వారి కుటుంబాలుసైతం అత్యంత సుఖ,సంతోషాలతో నిండు నూరేళ్లు జీవించగలుగుతారు అనడంలో ఎలాంటి సందేహంలేదు.కాబట్టి ఒక్కసారి ఆలోచించుకోండి మీకు మీ ఆరోగ్యం, మీ కుటుంబ బాగుదల ముఖ్యమా ఈ మద్యం అనే దురలవాటు ముఖ్యమా? ఇక నిర్ణయం తీసుకోవడం మీ వంతు. అంటే మీరు మద్యం అనే చెడుఅలవాటుకు మంగళం పాడిమంచి మార్గంలో వెళ్లడమా లేకచెడుమార్గంలో పయనింపచేసుకోవడమా? అన్నింటికి తుది నిర్ణయంమాత్రం ముమ్మాటికీ మీదే. •

# పేదరిక నిర్మూలనకు ఏవీ చర్యలు?

డి. జయరాం

దారిద్రం అనేది కేవలం తగినంత డబ్బు లేకపోవడాన్ని సూచించదు. ఇది ఆరోగ్య సంరక్షణ, విద్య, శుభ్రమైన నీరు, నిర్ణయాత్మక స్వేచ్ఛ వంటి ప్రాథమిక మానవ హక్కులు, అవకాశాలకు దూరంగా ఉండటాన్ని సూచిస్తుంది.ఆర్థికవేత్త అమర్త్యసేన్ అభిప్రాయం ప్రకారం పేదరికం అనేది 'సామర్థ్యాల కొరత'. ఇది సమాజంలోని అట్టడుగు వర్గాల ప్రజలు తమ పూర్తి సామర్థ్యాన్ని చేరుకోకుండా నిరోధించే ఒక సంక్లిష్టమైన సామాజిక ఆర్థిక రుగ్మత. దారిద్ర్యాన్ని స్థూలంగా నిరపేక్ష పేదరికం అంటే కనీస జీవనాధార అవసరాలు తీరనిస్థితి. సాపేక్ష పేదరికం అంటే సమాజం లోని సగటు స్థాయికంటే తక్కువ ఆదాయంగా వర్గీకరించవచ్చు. నేడు, ఆరోగ్యం,విద్య, జీవన ప్రమాణాలు వంటి అంశాలను కొలిచే బహుముఖ పేదరిక సూచిక ద్వారా సమస్య లోతును సమగ్రంగా అంచనా వేస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా పేదరిక నిర్మూలనకు కృషి జరుగుతున్నప్పటికీ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో భాగంగా 2030నాటికి అత్యంత పేదరికాన్ని నిర్మూలించాలనే లక్ష్యం కోవిడ్19మహమ్మారి, అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితుల కారణంగా సవాలుగా మారింది. ప్రపంచబ్యాంకు దారిద్యరేఖను రోజుకు 2.15 డాలర్ల కొనుగోలు శక్తికంటే తక్కువ ఆదాయంగా నిర్ణయించింది. ప్రపంచ నివేదికల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 110 కోట్లకు పైగా ప్రజలు నేటికీ ఆరోగ్య,విద్య, జీవన ప్రమాణాలకు సంబంధించిన బహుముఖ లోపాలను ఎదుర్కొంటున్నారు. మన దేశం గత దశాబ్దంలో పేదరిక నిర్మూలనలో అద్భుతమైన పురోగతిని సాధించింది. ప్రపంచ బ్యాంకు అంచనాల విశ్లేషణ ప్రకారం, 2011-12 నుండి 2022-23 మధ్య కాలంలో మనదేశంలో అత్యంత పేదరికం 27.1 శాతం నుండి 5.3 శాతానికి గణనీయంగా తగ్గింది. ఈ చారిత్రక కాలంలో సుమారు 27కోట్ల మంది ప్రజలు తీవ్ర పేదరికం నుండి బయటపడ్డారు.పట్టణ,గ్రామీణ ప్రాంతాలలో పేదరికం తగ్గడం ప్రభుత్వ మౌలిక సదుపాయాలు,సంక్షేమ పథకాల ప్రభావవంతమైన అమలును సూచిస్తుంది. నీతిఆయోగ్ జాతీయ బహుమితీయ పేదరిక సూచిక నివేదిక కూడా ఇదే విషయాన్ని ధృవీకరిస్తూ విద్యుత్, వంట ఇంధనం, పారిశుధ్యం, గృహ వసతి వంటి అంశాలలో మెరుగుదల కారణంగా కోట్లాది మంది ప్రజలు పేదరికం నుండి బయటపడ్డారని స్పష్టం చేసింది. పేదరికం అనేది అనేక వ్యవస్థాపరమైన అంశాల కలయిక. దారిద్ర్యానికి ప్రధాన కారణాలలో ఒకటి సంపద, ఆదాయ అసమాన పంపిణీ. ఆర్థిక వృద్ధి జరుగుతున్నప్పటికీ, దాని ఫలాలు సమాజంలోని సంపన్న వర్గాలకు మాత్రమే చేరడం వలన అసమానతలు పెరుగుతున్నాయి. ఈ అసమానతలు నిరుద్యోగం, ఉపాధి అవకాశాల కొరతతో మరింత తీవ్రమవుతాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయంపై అధికంగా



ఆధారపడటం, పట్టణాల్లో అసంఘటిత రంగంలో తక్కువ వేతనాలు, సామాజిక భద్రత లేని ఉద్యోగాలు పేదరిక వలయాన్ని కొనసాగిస్తున్నాయి. అంతేకాకుండా నాణ్యమైన విద్య, ఆరోగ్య సంరక్షణ లేకపోవడం దారిద్ర్యానికి వ్యవస్థాపరమైన మూలాలుగా నిలుస్తాయి.నిరక్షరాస్యత, అసంపూర్ణ విద్య వలన శ్రామికులు అధిక వేతన ఉద్యోగాలు పొందలేరు. అదే సమయంలో, పేద కుటుంబాలు అనారోగ్యం పాలైనప్పుడు, చికిత్సకోసం అధికంగా అప్పు చేయవలసి వస్తుంది. ఇది వారిని మరింత అప్పుఊబిలోకి నెట్టివేస్తుంది. వీటితోపాటు, అధిక జనాభా పెరుగుదల, సామాజిక, లింగ వివక్ష, ప్రభుత్వసంక్షేమ పథకాల అమలులో అవినీతి, లీకేజీలు కూడా పేదరికాన్ని సుస్థిరంచేస్తాయి. పేదరిక నిర్మూలన ప్రక్రియలో అనేక నిర్మాణాత్మక సవాళ్లు ఎదురవుతున్నాయి. వాటిలో అత్యంత ముఖ్యమైనది 'పేదరిక వలయం'ను ఛేదించడం. ఈ వలయంలో, తక్కువ ఆదాయం, పేలవమైన ఆరోగ్యం, తక్కువ విద్య తరాల నుండి కొనసాగుతూ, కుటుంబం ఎప్పటికీ మెరుగుపడకుండా నిరోధించబడతాయి. రెండవ ప్రధాన సవాలు వాతావరణ మార్పుల ప్రభావం. అకాల వర్షాలు, కరువులు వంటి ప్రకృతి వైపరీత్యాలు వ్యవసాయాధారిత పేదవారి జీవనోపాధిని నాశనం చేసి, వారిని తిరిగి అత్యంత పేదరికంలోకి నెట్టేస్తాయి. మూడవది, సాంకేతిక పరిజ్ఞాన వేగవంతమైన మార్పు వలన నైపుణ్యం లేని శ్రామికులు ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉంది. ఈ మార్పులకు అనుగుణంగా నైపుణ్యాలను మెరుగుపరచుకోలేని పేదలు పోటీ ప్రపంచంలో వెనుకబడిపోతారు. నాలుగవ సవాలు గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాలకు పెరుగుతున్న వలసలు కారణంగా పట్టణ మురికివాడల్లో పేదరికం, వనరుల కొరత కేంద్రీకృతం కావడం.ఈ సవాళ్లు పేదరిక నిర్మూలనకు ఉద్దేశించిన ఏకపక్ష విధానాల అమలును సంక్లిష్టం చేస్తాయి. మొదటిగా ప్రతి పౌరుడికి నాణ్యమైన సార్వత్రిక విద్యఆరోగ్యం అందించడం అత్యవసరం. ఎందుకంటే ఇవి పేదరిక వలయాన్ని ఛేదించే అంశాలలో ప్రధానమైనది. రెండవది వ్యవసాయేతర రంగాలలో, ముఖ్యంగా తయారీ, సేవారంగంలో ఉత్పాదక స్థిరమైన ఉపాధి అవకాశాలను సృష్టించడం.సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు మద్దతుఇవ్వడం ద్వారా ఉద్యోగాలుసృష్టించవచ్చు. ఈలక్ష్యాల కోసం కేంద్రప్రభుత్వం అనేక విధానాలను అమలు చేస్తోంది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పేదలకు కనీసవేతన ఉపాధి హక్కును కల్పిస్తుంది. దీన్ దయాళ్ అంత్యోదయ యోజన స్వయం సహాయక బృందాలద్వారా ఆర్థికసహాయం అందించి గ్రామీణ పేదలకు స్థిరమైన జీవనోపాధిని సృష్టిస్తుంది. ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన ద్వారా ఆర్థికచేరికను సాధించి, ప్రత్యక్ష ప్రయోజన బదిలీ ద్వారా పథకాల ప్రయోజనాలను లీకేజీలు లేకుండా నేరుగా బదిలీ చేయడం జరుగుతోంది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, ఉజ్వలయోజన వంటి పథకాలు గృహవసతి, శుభ్రమైన ఇంధనాన్ని అందించి బహుముఖ పేదరికాన్ని తగ్గించడంలో ముఖ్యపాత్ర వహిస్తు న్నాయి.పేదరికం అనేది కేవలం ఒక ఆర్థికసూచిక మాత్రమేకాదు. అన్యాయం, అసమానతలకు అద్దంపట్టే మానవీయ సంక్షోభం.భారతదేశం ఇటీవల సాధించిన పేదరిక తగ్గింపు విజయాలు, లక్షిత విధానాలు, సాంకేతికత ఆధారిత పాలన శక్తిని స్పష్టంగా నిరూపిస్తున్నాయి. ఈపురోగతిని నిలకడగా కొనసాగించడం, మిగిలిన పేదరికాన్ని నిర్మూలించడం, ముఖ్యంగా గ్రామీణ, పట్టణ అసమానతలను తగ్గించడం ద్వారానే మనదేశం నిజమైన ఆర్థికసామాజిక న్యాయాన్ని సాధించి,అభివృద్ధి చెందిన దేశంగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకోగలుగుతుంది. •

# ప్రజావాక్కు



## వెండి ధర బంగారాన్ని మించిపోనుందా!

ఎన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం వెండి ధరలు వినియోగదారులనువ్యాపారులను ఆశ్చర్యపరుస్తున్నాయి. ఈ ఏడాది ఆరంభంలో కిలో వెండి ధర సుమారు లక్ష రూపాయలు వుండగా, రాబోయే దీపావళి సమయానికి ఏకంగా 2,0,6000 రూపాయల మార్కును చేరుకుంది. అంటే కేవలం కొన్ని నెలల వ్యవధిలోనే వెండి విలువ దాదాపు90శాతంపెరిగింది.సామాన్యప్రజలు, ముఖ్యంగా మధ్యతరగతి వర్గాలు,బంగారం తర్వాత తమ సంపదను కాపాడుకోవడానికి, పెంచుకోవడానికిఎంచుకోవాల్సిన ఉత్తమ మార్గాలలో వెండికూడా ఒకటిగా ఇప్పుడు నిరూపితమవుతోంది.పెద్దపెద్ద సంస్థలుభవిష్యత్ అవసరాల కోసం పెద్దమొత్తంలో వెండినికొనుగోలు చేసినిల్వ చేసుకుంటున్నాయి. ఈ కారణాల వల్ల,వాస్తవ సరఫరా తగ్గి, ధరలు అమాంతంగా పెరుగుతున్నట్లు కథనాలు వస్తున్నాయి.

- దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

## చెత్త చెదారంతో కొత్తగూడెం పట్టణం

భద్రాద్రి కొత్త గూడెం జిల్లా కేంద్రం అయిన కొత్త గూడెం జిల్లా దుమ్ము ధూళితో అపరిశుభ్రంగా ఉంది. బస్‌స్టాండ్ చుట్టూ ప్రధాన వీధుల గుండా ప్లాస్టిక్ కవర్స్ దుమ్ముతో నిండి వుండి అపరిశుభ్రంగా వుంది. నిత్యం కొత్త గూడెంకి ఎంతో మంది వివిధపనుల నిమిత్తం వస్తుంటారు బొగ్గ గనులు వుండడం చుట్టూ పక్కన వున్న ఇల్లందు భద్రాచలం ఖమ్మంల నుండి జన సంచారం వుండడం వల్ల కొత్తగూడెం వ్యాపార కేంద్రంగా వుంది. కొత్త వారు వివిధ పనుల నిమిత్తం వస్తే రోడ్స్ మీద ఉన్న చెత్త చెదారంతో ఇబ్బంది పడుతూ వున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి కొత్త గూడెం పట్టణానికి క్లీన్ సిటీగా మార్చాలి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

## బాధ్యత విస్మరించరాదు

తల్లిదండ్రులు మనకు జన్మనిచ్చి, పసితనంలో మనల్ని ప్రేమతో పెంచి, చదువులు నేర్పించి మన భవిష్యత్తును నిర్మించారు. మన జీవితంలో వారు మొదటి గురువులు, నిజమైన దేవుళ్లు.చిన్నప్పుడు వారు నిద్ర మానుకుని మన కోసం కష్టపడ్డారు.మన భవిష్యత్తుకోసం తమ సుఖాలను త్యాగం చేశారు. అలాంటి తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఉన్నప్పుడు వారిని నిర్లక్ష్యం చేయడం పెద్దపాపం.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

## చెత్త చెదారంతో కొత్తగూడెం పట్టణం

భద్రాద్రి కొత్త గూడెం జిల్లా కేంద్రం అయిన కొత్త గూడెం జిల్లా దుమ్ము ధూళితోఅపరిశుభ్రంగాఉంది. బస్‌స్టాండ్ చుట్టూ ప్రధాన వీధుల గుండా ప్లాస్టిక్ కవర్స్ దుమ్ముతో నిండి వుండి అపరిశుభ్రంగా వుంది. నిత్యం కొత్త గూడెంకి ఎంతో మంది వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు బొగ్గ గనులు వుండడం చుట్టూ పక్కన వున్న ఇల్లందు భద్రాచలం ఖమ్మంల నుండి జన సంచారం వుండడం వల్ల కొత్త గూడెం వ్యాపార కేంద్రంగా వుంది. కొత్త వారు వివిధ పనుల నిమిత్తం వస్తే రోడ్స్ మీద ఉన్న చెత్త చెదారంతో ఇబ్బంది పడుతూ వున్నారు.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

## తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు ప్రతీ సంవత్సరం తగ్గుతున్నాయి. అన్ని విద్యార్హతలు ఉన్న ఉపాధ్యాయులు ప్రభుత్వపాఠశాలల్లో ఉన్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాలలో సైతంప్రైవేటు పాఠశాలలపట్ల ఆకర్షితులవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేటుకు దీటుగా అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నారు. పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగులు,యూనిఫామ్, బెల్ట్, షూ, ఉపకారవేతనాలు, మధ్యాహ్న భోజనపథకాన్ని ప్రభుత్వం అందిస్తోంది. గ్రామాల్లో తల్లిదండ్రులు ఎక్కువగా ప్రైవేటు పాఠశాలల పట్ల ఆకర్షితులవడంతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేరికలు ప్రతీ సంవత్సరం తగ్గుతున్నట్లు గణాంకాల ద్వారా తెలుస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగటా నికి కృషి చేయాల్సిన అవసరం ఉంది.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

## ప్రజలు, స్వర్ణకారులు సతమతం

ఇటీవల కాలంలో బంగారం ధరలు గణనీయంగా పెరుగుతున్నాయి.దేశీయంగా,అంతర్జాతీయంగా ఆర్థికపరిస్థితులు మార్పుకు లోనవుతుండటమే దీనికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు. అమెరికా డాలర్ విలువ మార్పులు, అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరల పెరుగుదల,అలాగే భవిష్యత్తుపై ఉన్న అనిశ్చితి కారణంగా బంగారంవైపుమొగ్గు చూపుతున్నారు.భారతదేశంలో బంగారం కేవలం ఆభరణంగా కాకుండా పెట్టుబడి సాధనంగా భావించబడుతుంది. పండుగలు, పెళ్లిళ్ల వంటి సంద ర్భాల్లో అధిక డిమాండ్ కూడా ధరలను మరింతగా పెంచుతోంది.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఈసారి గోవాలో ప్రధాని దీపావళి వేడుకలు



**పనాజి, అక్టోబరు 16:** ప్రతి సంవత్సరం దీపావళి వేడుకలను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సరిహద్దుల్లోని జవాన్లతో కలిసి జరుపుకుంటున్న విషయం తెలిసిందే. సైనిక దుస్తులు ధరించి ప్రతి ఏటా ఒక ప్రదేశంలో మోదీ ఈ వేడుకలను జరుపుకుంటూ వస్తున్నారు. జవాన్లకు స్వయంగా స్వీట్లు తినిపించి జాలీగా గుడుపుతుంటారు. అయితే, ఈ సారి గోవాలో దివాళి సెలబ్రేషన్స్ చేసుకోనున్నట్లు తెలిసింది. గోవాలోని నౌకాదళ సిబ్బంది తో ప్రధాని దీపావళి వేడుకలు జరుపుకోనున్నట్లు సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి. పహల్గాం దాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ లో భారత్ సాధించిన విజయాన్ని నౌకాదళ సిబ్బందితో జరుపుకోనున్నట్లు పేర్కొన్నాయి. 2014లో ప్రధానిక పదవి చేపట్టినప్పటి నుంచి మోదీ సాయుధ దళాల సిబ్బందితో దీపావళిని సెలబ్రేట్ చేసుకుంటున్నారు. 2014లో ఆయన లడఖ్‌లోని సియాచిన్ హిమానీనదానికి వెళ్లి అక్కడ గస్తీలో ఉన్న జవాన్లతో వేడుకలు జరుపుకున్నారు. 2015లో పంజాబ్‌లోని అమృత్‌సర్‌లోని డోగ్రాయ్ యుద్ధ స్మారక చిహ్నాన్ని సందర్శించారు. అక్కడ 1965 ఇండోపాక్ యుద్ధంలో అమరులైన జవాన్లకు నివాళులర్పించారు. 2016లో హిమాచల్ ప్రదేశ్‌లోని సుమ్డోలోగల భారత్‌చైనా సరిహద్దు సమీపంలో భద్రతా దళం, సైనిక సిబ్బందిని కలిశారు. 2017లో జమ్ము కశ్మీర్‌లోని గురెజ్ సెక్టార్‌లో, 2018లో ఉత్తరాఖండ్‌లోని ఇండోటిబెటన్ బోర్డర్ పోలీసు సిబ్బందితోను, 2019లో జమ్ము కశ్మీర్‌లోని రాజౌరిలో గల సైనికులతోను దీపావళి వేడుకలు జరుపుకున్న మోడీ 2020లో రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లోను, 2021లో జమ్ము కశ్మీర్‌లోని నౌషెరాలోను, 2022లో కార్గిల్, 2023లో చైనా సరిహద్దులోని లేప్చా (హిమాచల్‌ప్రదేశ్) సైనిక శిబిరంలో వేడుకలు చేసుకున్నారు. 2024లో కచ్‌లోని సర్ క్రీక్ ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తున్న సరిహద్దు భద్రతా దళం, ఆర్మీ, నేవీ, వాయుసేన సిబ్బందిని కలిసి వారితో వేడుకలు చేసుకున్నారు.


# యెమెన్‌లో నిమిషప్రియ హత్యకేసులో స్టే కొనసాగుతోంది

## సుప్రీంకోర్టుకు నివేదించిన కేంద్రం



**న్యూఢిల్లీ, అక్టోబరు 16:** యెమెన్ మరణశిక్షను ఎదుర్కొంటున్న భారత నర్సు నిమిష ప్రియకు శిక్ష అమలుపై స్టే కొనసాగుతున్నదని గురువారం కేంద్రం సుప్రీంకోర్టుకు నివేదించింది. ఈ కేసులో ఇప్పటివరకు ఎలాంటి తీవ్ర పరి ణామాలు చోటుచేసుకోకపోవడం గమనార్హమని పేర్కొంది. భారతీయ నర్సు నిమిష ప్రియను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం దౌత్యమార్గాలను ఉపయోగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారిస్తోంది. తాజాగా ఆ మరణశిక్ష గురించి ప్రశ్నించింది. ఆమెకు చట్టపరమైన సహకారం అందిస్తున్న 'సేవ్ నిమిషప్రియ ఇంటర్నేషనల్ యాక్షన్ కౌన్సిల్' తరఫు న్యాయవాది స్పందిస్తూ శిక్ష అమలుపై స్టే కొనసాగుతోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్ వెంకట రమణి మాట్లాడుతూ ప్రస్తుతం ఈ కేసులోకి కొత్త మధ్యవర్తి వచ్చారని, ఇప్పటివరకు ఈ కేసులో తీవ్రమైన పరిణామాలు చోటుచేసుకోక పోవడం మంచి విషయమని అన్నారు. వాదనలు విన్న అత్యున్నత న్యాయస్థానం కేసును జనవరికి వాయిదా వేసింది. అయితే ఏవైనా అత్యవసర పరిస్థితులు ఉంటే ముందస్తు లిస్టింగ్ కోసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. కాగా నిమిష ప్రియ నర్సింగ్ కోర్సు పూర్తిచేసిన తర్వాత 2008లో యెమెన్ వెళ్లి అక్కడే ఉద్యోగంలో చేరారు. ఆ దేశ నిబంధనల ప్రకారం స్థానిక వ్యక్తి తలాల్ అదిబ్ మెహది భాగస్వామ్యంతో అల్‌అమన్ మెడికల్ కౌన్సిల్ సెంటర్‌ను ప్రారంభించారు. తర్వాత ఆ వ్యక్తి ప్రియను వేధించి, పాస్‌పోర్ట్, ఇతర పత్రాలను లాక్కొన్నాడన్న ఆరోప ణలు ఉన్నాయి. 20 16లో అతడిపై ప్రియ పోలీసులకు కూడా ఫిర్యాదు చేసింది. వారు ఆమెను పట్టించుకోలేదు. దాంతో 2017లో మెహదికి మత్తుమందు ఇచ్చి అతడి వద్ద ఉన్న తన పాస్‌పోర్టును స్వాధీనం చేసుకోవాలని భావించింది. కానీ ఆ డోస్ ఎక్కువకావడంతో అతడు చనిపోయాడు. ఆ తర్వాత మృతదేహాన్ని ఓ వాటర్ ట్యాంక్‌లో పారేసింది. చివరికి అక్కడినుంచి సౌదీకి వెళ్లిపోతుండగా సరిహద్దుల్లో ఆమెను అరెస్టు చేసి మరణశిక్ష విధించారు. భారత ప్రభుత్వం, మత పెద్దల ప్రయత్నాలతో ప్రస్తుతం ఆమె ఉరిశిక్ష స్టే కొనసాగుతోంది.

# చిన్నారుల యాంటిబయాటిక్ సిరప్‌లో పురుగులు



**భోపాల్, అక్టోబరు 16:** ప్రభుత్వ ఆసుపత్రిలో ఇచ్చిన పిల్లల యాంటీబయాటిక్ సిరప్‌లో పురుగులు కనిపించాయి. ఇది చూసి ఒక చిన్నారి తల్లి షాక్ అయ్యింది. ఆ యాంటీబయాటిక్ సిరప్ బాటిల్‌ను ఆసుపత్రికి తీసుకువచ్చి ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో ఆ సిరప్ స్టాక్‌ను సీజ్ చేశారు. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న ఒక చిన్నారిని మోరార్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తల్లి తీసుకెళ్లింది. పరీక్షించిన డాక్టర్, అజిత్రోమైసిన్ యాంటీబయాటిక్ సిరప్ సూచించగా ఆసుపత్రి సిబ్బంది ఆ మందు ఇచ్చారు. ఇంటికి చేరుకున్న తర్వాత చిన్నారికి మందు వేసేందుకు అజిత్రోమైసిన్ సిరప్ మూతను ఆ మహిళ తెరిచింది. ఆ యాంటీబయాటిక్ సిరప్‌లో పురుగులు కనిపించడంతో ఆమె షాక్ అయ్యింది. వెంటనే ఆ సిరప్ బాటిల్ తీసుకుని మోరార్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లింది. తెరిచిన అజిత్రోమైసిన్ సిరప్ బాటిల్‌ను ఆసుపత్రికి సిబ్బందికి చూపించింది. ఈ సంఘటన కలకలం రేపింది. మరోవైపు ఈ విషయం తెలిసిన వెంటనే డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అనుభూతి శర్మ స్పందించారు. మధ్యప్రదేశ్‌లోని ఒక ఔషధ కంపెనీ ఆ అజిత్రోమైసిన్ సిరప్ తయారు చేసినట్లు తెలిపారు. మోరార్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి సరఫరా చేసిన ఆ యాంటీబయాటిక్ సిరప్ బాటిల్స్‌లో స్టాక్ ఉన్న 306 బాటిళ్లను రీకాల్ చేసినట్లు చెప్పారు. కొన్ని సిరప్ బాటిల్స్ పరిశీలించగా వాటిలో పురుగు అవశేషాలు లేవని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అనుభూతి శర్మ తెలిపారు. అయితే టెస్టింగ్ కోసం కొన్ని మందు సీసాలను భోపాల్‌లోని ల్యాబ్‌కు పంపినట్లు చెప్పారు. ఈ ఔషధం నమూనాలను కోల్‌కతాలోని సెంట్రల్ డ్రగ్ లాబొరేటరీకి కూడా పంపనున్నట్లు ఆమె వెల్లడించారు. మరోవైపు మధ్యప్రదేశ్‌లోని చింద్వారా జిల్లాలో కోల్డ్‌రిఫ్ దగ్గు సిరప్ వల్ల కిడ్నీలు పాడైన కారణంగా 24 మంది పిల్లలు మరణించారు. మరింత మంది అనారోగ్యం పాలయ్యారు. ఈ సంఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ నేపథ్యంలో తాజాగా పిల్లల యాంటీబయాటిక్ సిరప్‌లో పురుగులు కనిపించిన సంఘటన ఆందోళన కలిగిస్తున్నది.



# గుజరాత్ రాజకీయాల్లో భారీ కుదుపు

## కేబినెట్ మొత్తం రాజీనామా.. ఆమోదించిన గవర్నర్

## నేడు రాజ్‌భవన్‌లో కొత్త మంత్రివర్గం ప్రమాణస్వీకారం

## తాజా కేబినెట్‌లో క్రికెటర్ జడేజా భార్యకు ప్రమోషన్!

**అహ్మదాబాద్, అక్టోబరు 16:** గుజరాత్ రాష్ట్ర రాజకీయాల్లో అనూహ్యపరిణామాలు. రాష్ట్రంలో కొత్త కేబినెట్ శుక్రవారం కొలువు దీరనుంది. ఈ క్రమంలో గురువారం ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మినహా మిగిలిన 16 మంది మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. కేబినెట్ పునర్వ్యవస్థీకరణకు మార్గం సులువు చేసేందుకు మంత్రులు రాజీనామాలుచేసారు. గత కొన్ని రోజులుగా కేబినెట్ విస్తరణ ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ క్రమంలోనే గురువారం ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ నివాసంలో మంత్రులు సమావేశం అయ్యారు. బీజేపీ రాష్ట్ర, జాతీయ నాయకత్వం ఆదేశాల మేరకు మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ ఈ రాజీనామాలు అంగీకరించారు. అనంతరం గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌కు రాజీనామాలు అందజేయగా ఆయన ఆమోదం తెలిపారు. దీంతో శుక్రవారం కొత్త కేబినెట్ కొలువుదీరనుంది. గుజరాత్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మినహా మిగిలిన మంత్రులు అంతా తమ పదవులకు రాజీనామా చేశారు. గత కొంతకాలంగా గుజరాత్‌లో కేబినెట్ విస్తరణ ఉంటుంది అని అంతా భావించారు. అయితే దీపావళి పండుగకు ముందే ఈ విస్తరణ ఉంటుందని ఊహించ లేదు. ఈ విస్తరణలో కొత్త ము ఖాలు, యువ నాయకులు, ప్రాంతీయసామాజిక సమతుల్యతకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. అలాగే ఓబిసి పాటిదార్ సమతుల్యత, సౌరాష్ట్రఉత్తర గుజరాత్ ప్రాంతాలకు ప్రాధాన్యం ఇచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు రవీంద్ర జడేజా భార్య, జామ్‌నగర్ ఎమ్ఎల్ఏ రీవా జడేజాకు కేబినెట్ ర్యాంక్ ప్రమోషన్ ఇవ్వనున్నారనే ప్రచారం జరుగుతుంది. అలాగే ప్రస్తుతం రాజీనామా చేసిన మంత్రుల్లో కొందరికి కొత్త కేబినెట్‌లో ఛాన్స్ ఉండే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. 2027 అసెంబ్లీ ఎన్నికలే టార్గెట్‌గా ఈ విస్తరణ జరుగుతోంది. ఎందుకంటే 2027లో గుజరాత్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మధ్యలో మున్సిపల్ కార్పొరేషన్లు, పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు జగదీష్ విశ్వకర్మ సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. 2027 అసెంబ్లీ ఎన్నికలు, లోకల్ బాడీ పోల్స్‌కు ముందుగా పార్టీ బలాన్ని పెంచే ఉద్దేశ్యంతో ఈ కేబినెట్ విస్తరణ జరుగుతుంది అని తెలుస్తోంది. ప్రస్తుత మంత్రివర్గం ముఖ్యమంత్రి సహా 17 మందితో ఉన్నారు. గుజరాత్ చరిత్రలో అతి చిన్న మంత్రివర్గం ఇదే కావడం విశేషం. 182 సభ్యుల శాసనసభ పరిధిలో 27 మంది వరకు మంత్రులు ఉండవచ్చు. కానీ 17 మందితోనే మంత్రివర్గం ఏర్పడింది. మంత్రివర్గంలో ఈసారి దాదాపు 10 మంది కొత్త వారికి అవకాశం లభించవచ్చని తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న మంత్రుల్లో దాదాపు సగం మందిని మార్చే అవకాశం ఉందని సమాచారం. ప్రస్తుతం గుజరాత్ మంత్రివర్గంలో ముఖ్యమంత్రితో సహా మొత్తం 17 మంది మంత్రులు ఉన్నారు. వీరిలో ఎనిమిది మంది క్యాబినెట్ ర్యాంకు మంత్రులు కాగా మిగిలిన వారు సహాయ మంత్రులుగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ సారి 22 నుంచి 27 మందికి మంత్రులకు అవకాశం కల్పించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రాజ్ భవన్‌లో శుక్రవారం నూతన మంత్రివర్గం ప్రమాణ స్వీకారం చేయనుంది.

ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మంత్రివర్గాన్ని శుక్రవారం విస్తరించనున్నారు. మంత్రివర్గ విస్తరణకు అధ్యక్షుడు జెపీ నడ్డా, అమిత్ షా, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు సీ.ఆర్. పాటిల్, ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్ వంటి సీనియర్ నేతలు హాజరవుతారు.

### కోర్టు హాలులో ఆన్‌లైన్‌లోనే మహిళకు కిస్ ఇచ్చిన లాయర్!

**న్యూఢిల్లీ, అక్టోబరు 16:** న్యాయస్థానంలో వృత్తిగత హుందాతనాన్ని ప్రదర్శించాల్సిన ఓ న్యాయవాది అనుచితంగా ప్రవర్తించిన ఘటన తీవ్ర వివాదాస్పదంగా మారింది. ఢిల్లీ హైకోర్టులో ఓ కేసు వర్చువల్ విచారణ సందర్భంగా కెమెరా ఆన్‌లో ఉండగానే ఆయన ఓ మహిళను ముద్దుపెట్టుకోవడం కలకలం రేపింది. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, సదరు లాయర్ తీరుపై సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఆన్‌లైన్ విచారణ కోసం అందరూ లాగిన్ అయి న్యాయమూర్తి రాక కోసం ఎదురుచూస్తున్న సమయంలో కోర్టు దుస్తుల్లో ఉన్న ఆ లాయర్, తన కెమెరాకు కొద్దిగా పక్కకు కూర్చుని ఉన్నారు. ఆ సమయంలోముందు నిల్చుని ఉన్న మహిళ చేతిని ముద్దుపెట్టడం వీడియోలో స్పష్టంగా రికార్డయింది.

# మత్తుమందిచ్చి డాక్టర్ భార్యను హత్యచేసిన వైద్యుడు



**బెంగళూరు, అక్టోబరు 16:** వైద్య వృత్తిని అడ్డం పెట్టుకుని, కట్టుకున్న భార్యను హతమార్చిన ఓ వైద్యుడి కిరాతకం బెంగళూరులో వెలుగులోకి వచ్చింది. అనారోగ్యంతో చనిపోయిందని అందరినీ నమ్మించినా, ఆరు నెలల తర్వాత ఫోరెన్సిక్ నివేదిక అసలు నిజాన్ని బయటపెట్టడంతో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. బెంగళూరులోని విక్టోరియా ఆస్పత్రిలో జనరల్ సర్జన్‌గా పనిచేస్తున్న డాక్టర్ మహేంద్ర రెడ్డి, డెర్మటాలజిస్ట్ అయిన డాక్టర్ కృతిక రెడ్డి భార్యాభర్తలు. వీరికి గత ఏడాది మే 26న వివాహం జరిగింది. అయితే, ఈ ఏడాది ఏప్రిల్ 21న మున్నెకొల్లాల్‌లోని వారి నివాసంలో కృతిక అస్వస్థతకు గురయ్యారని చెబుతూ ఆమె భర్త మహేంద్ర రెడ్డే దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు అక్కడి వైద్యులు ధ్రువీకరించారు. దీంతో మరాతహళ్లి పోలీసులు తొలుత అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఘటనా స్థలంలో క్రైమ్ ఆఫీసర్లు తనిఖీ చేయగా, ఓ కానిలా సెట్, ఇంజెక్షన్ ట్యూబ్ వంటి వైద్య పరికరాలు లభించాయి. వాటిని ఫోరెన్సిక్ విశ్లేషణ కోసం పంపించారు. మృతురాలి అంతర్గత అవయవాల నమూనాలను కూడా ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీకి (ఎఫ్ఎస్ఎల్) పంపగా, అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఎఫ్ఎస్ఎల్ నివేదికలో కృతిక శరీరంలో ప్రోపోఫాల్ అనే శక్తిమంతమైన అనస్థీషియా (మత్తు) మందు ఆనవాళ్లు ఉన్నట్లు తేలింది. దీంతో ఇది హత్యేనని నిర్ధారణ కావడంతో మృతురాలి తండ్రి అక్టోబర్ 13న తన అల్లుడే మత్తుమందు ఇచ్చి కూతురిని చంపాడని ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు వేగంగా స్పందించి, అక్టోబర్ 14న కర్ణాటకలోని మణిపాల్‌లో ఉన్న నిందితుడు మహేంద్ర రెడ్డిని అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై బెంగళూరు పోలీస్ కమిషనర్ సీమంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ భార్యను ఆసుపత్రికి తీసుకొచ్చిన భర్త, ఆమెకు మత్తు మందు ఇచ్చిన విషయాన్ని దాచిపెట్టాడు. ఆమె ఆరోగ్యం బాగోలేదని మాత్రమే చెప్పాడు. ఇప్పుడు ఆమె శరీరంలో మత్తుమందు ఆనవాళ్లు బయటపడటంతో, ఇందులో దురుద్దేశం ఉన్నట్లు స్పష్టమైంది. ఈ కోణంలో లోతుగా దర్యాప్తు చేస్తున్నాం అని తెలిపారు. ప్రస్తుతం నిందితుడు పోలీస్ కస్టడీలో ఉన్నాడు. వైద్య పరిజ్ఞానాన్ని ఉపయోగించి హత్యను సహజ మరణంగా చిత్రీకరించేందుకు నిందితుడు ప్రయత్నించాడని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటన వైద్య వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది.

# పాక్ సైనిక దుస్తులను బహిరంగ ప్రదర్శనకు పెట్టిన తాలిబన్లు!




**కాబూల్, అక్టోబరు 16:** పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. సరిహద్దుల్లో భీకర ఘర్షణల నేపథ్యంలో, పట్టుబడిన పాకిస్థాన్ సైనికుల ప్యాంట్లు, రైఫిళ్లను ఆఫ్ఘన్ సైనికులు, తాలిబన్ అనుబంధ మిలీషియా సభ్యులు ఆఫ్ఘన్ నగర వీధుల్లో ప్రదర్శిస్తూ అవమానపరిచారు. కార్ల మీద నిలబడి, స్వాధీనం చేసుకున్న వస్తువులను ప్రదర్శిస్తున్న దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ముఖ్యంగా తూర్పు నంగర్‌హార్ ప్రావిన్స్‌లో ఈ ప్రదర్శన జరిగినట్లు ఆఫ్ఘన్ జర్నలిస్ట్ దావూద్ జున్‌బిష్ 'ఎక్స్' వేదికగా ఒక ఫొటోను పంచుకున్నారు. "డ్యూరాండ్ లైన్ వద్ద పాకిస్థాన్ సైన్యం విడిచిపెట్టిన సైనిక పోస్టుల నుంచి స్వాధీనం చేసుకున్న ఖాళీ ప్యాంట్లను ప్రదర్శించారని ఆయన ఆ ఫొటోకు క్యాప్షన్ జతచేశారు. ఈ వీడియోల ప్రామాణికతను స్వతంత్రంగా ధ్రువీకరించలేనప్పటికీ, ఇవి ఇరు దేశాల మధ్య నెలకొన్న తీవ్రమైన వైషమ్యాలకు అద్దం పడుతున్నాయి. ఆశ్చర్యకరంగా, ఇరు దేశాల మధ్య బుధవారం నుంచి 48 గంటల కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చినప్పటికీ ఈ ప్రదర్శనలు జరగడం గమనార్హం. సరిహద్దుల్లో జరిగిన ఘర్షణల్లో ఇరువైపులా డజన్ల కొద్దీ సైనికులు, పౌరులు మరణించడంతో ఈ ఒప్పందం కుదిరింది. అయితే కాల్పుల విరమణకు ఎవరు ముందు ప్రతిపాదించారనే దానిపై కూడా ఇరు దేశాలు పరస్పరం భిన్నమైన ప్రకటనలు చేశాయి. తహ్రీక్‌ఎతాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) నాయకుడిని లక్ష్యంగా చేసుకుని కాబూల్‌లో పాకిస్థాన్ వైమానిక దాడులు చేయడంతో ఇటీవలి ఘర్షణలు మొదలయ్యాయి. టీటీపీకి ఆఫ్ఘనిస్థాన్ ఆశ్రయం ఇస్తోందని పాక్ ఆరోపిస్తోంది. దీనికి ప్రతీకారంగా, ఆఫ్ఘన్ దళాలు డ్యూరాండ్ లైన్ వెంబడి పాక్ సరిహద్దు పోస్టులపై దాడులు చేశాయి. మరోవైపు, ఇస్లామిక్ స్టేట్ ఖొరాసన్ గ్రూప్ (ఐఎస్‌కే) దాడులకు పాక్ సైన్యం సహకరిస్తోందని ఆఫ్ఘనిస్థాన్ ఎదురుదాడి చేస్తోంది. ఈ ఘర్షణల్లో డజన్ల కొద్దీ శత్రు సైనికులను మట్టుబెట్టినట్లు ఇరుపక్షాలు ప్రకటించుకున్నాయి. పాక్ దాడుల్లో ఆఫ్ఘన్ పౌరులు లక్ష్యంగా మారారని తాలిబన్లు ఆరోపించారు. తమ దేశం ఉగ్రవాద బాధితు రాలని, దాడుల సమయంలో పౌర నష్టం జరగవచ్చని పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖావాజా ఆసిఫ్ గతంలోనే హెచ్చరించారు. 58 మందికి పైగా పాక్ సైనికులు మరణించారని, వందల మందిని బందీలుగా పట్టుకున్నామన్నారు.

## సంక్షిప్తంగా..

### వెనుజులాలో సిఐఎ రహస్య ఆపరేషన్‌కు ట్రంప్ గ్రీన్ సిగ్నల్



**వాషింగ్టన్, అక్టోబరు 16:** అమెరికాలోకి అక్రమంగా మాదకద్రవ్యాలు రావడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొదటి నుంచి ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే కరేబియన్ సముద్రంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా పడవలపై ఇటీవల అమెరికా సైన్యం పలుమార్లు దాడులు చేసింది. ఈ నేపథ్యంలో ట్రంప్ కీలక విషయం బయటపెట్టారు. వెనుజులాలో రహస్య కార్యకలాపాలు నిర్వహించేందుకు తాను సిఐఎకు అధికారికంగా అనుమతిచ్చినట్లు తెలిపారు. బుధవారం ఓవెల్ కార్యాలయంలో మాట్లాడుతూ ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నారనే దానిపై స్పష్టతనిచ్చారు. వెనుజులా నుంచి పెద్ద మొత్తంలో మాదక ద్రవ్యాలు వస్తున్నా యన్నారు. సముద్రం ద్వారా వస్తున్న వాటిని అడ్డుకోవడంతోపాటు ఆ దేశ ప్రజలు ఇక్కడ నేరాలకు పాల్పడి యు ఎస్ జైళ్లలో ఉంటున్నారన్నారు. ఈ క్రమంలో వారు మరిన్ని దాడులకు ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు.

### సిఎం పదవి ఇస్తానన్నా వద్దన్నా: రామ్‌దేవ్‌బాబా



**న్యూఢిల్లీ, అక్టోబరు 16:** యోగా గురు బాబా రాందేవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తనకు ముఖ్యమంత్రి పదవిని చేపట్టే అవకాశం వచ్చినా, పదవులపై ఆసక్తి లేకపోవడంతో దానిని సున్నితంగా తిరస్కరించానని వెల్లడించారు. దేశానికి సేవ చేయడమే తన ఏకైక లక్ష్యమని, అధికారం, కీర్తి ప్రతిష్ఠలపై తనకు ఏమాత్రం వ్యామోహం లేదని స్పష్టం చేశారు. రిపబ్లిక్ మీడియా నెట్‌వర్క్ నిర్వహించిన రాష్ట్ర సర్వోపరి సమ్మేళన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నాకు ముఖ్యమంత్రి పదవి ఇస్తామని ఆఫర్ చేశారు. నా వాళ్లను రాజ్యసభకు పంపమని, సొంతంగా పార్టీ పెట్టమని కూడా చాలామంది అడిగారు. కానీ నాకు అధికారంపై ఆశ లేదు. నా జీవితంలో ఒకే ఒక్క లక్ష్యం ఉంది, అది భరతమాతకు సేవ చేయడ మేనని రాందేవ్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీని ఆయన ఉదాహరణగా చూపారు. ఏదో ఒకటి అవ్వాలని కాకుండా, దేశం కోసం ఏదైనా చేయాలని ఆలోచించండి.

### కర్ణాటకలో టెన్త్‌పాస్‌కు 33 మార్కులే!

**బెంగళూరు, అక్టోబరు 16:** పదో తరగతి విద్యార్థులకు కర్ణాటక ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. పబ్లిక్ పరీక్షలో పాస్ మార్కులు తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఇకపై ప్రతీ సబ్జెక్ట్‌లో 33 మార్కులు తెచ్చుకుంటే పాస్ చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఒకటీ అరా మార్కులతో పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని, దీనిని నివారించేందుకే ఈ నిర్ణయం తీసు కున్నామని కర్ణాటక మంత్రి మధు బంగారప్ప పేర్కొన్నారు. గతేడాది వరకు పదో తరగతిలో పాస్ కావాలంటే ప్రతి సబ్జెక్ట్‌లో తప్పనిసరిగా 35 శాతం మార్కులు తెచ్చు కోవాల్సిందే. ఒకటీ అరా మార్కులతో ఫెయిలైన విద్యార్థి తిరిగి సప్లిమెంటరీ పరీక్షల కోసం వేచి ఉండాలి. ఈ గ్యాప్‌లో విద్యార్థులను వారి తల్లి దండ్రులు పనికి పంపించడం, ఆడపిల్లలైతే పెళ్లి చేసి పంపించడం చేస్తున్నారని ప్రాథమిక విద్యాశాఖ మంత్రి బంగారప్ప చెప్పారు. ఆ తర్వాత పిల్లలు చదువుకు శాశ్వతంగా దూరమవుతున్నారని తెలిపారు. దీనిని తప్పించేందుకు పాస్ మార్కులను 33 కు తగ్గిస్తున్నట్లు పేర్కొన్నారు.

### చైనా కరెన్సీలో భారత్ చెల్లింపులు: రష్యా డిప్యూటీ పిఎం



**మాస్కో, అక్టోబరు 16:** రష్యా చమురు కొనుగోళ్లకు చైనా కరెన్సీ యువాన్‌లో భారత్ చెల్లింపులు చేస్తోంది. ఈ విషయాన్ని రష్యా ఉప ప్రధాని అలెగ్జాండర్ నొవాక్ వెల్లడించారు. అయితే అది స్వల్ప మొత్తంలోనేనని, ఎక్కువ శాతం లావాదేవీలు రూబుల్స్‌లోనే జరుగుతున్నాయని స్థానిక మీడియా సంస్థతో మాట్లాడారు. రష్యా చమురుకు భారత్ రెండో అతిపెద్ద కొనుగోలుదారుగా ఉన్న సంగతి తెలిసిందే. ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్య ప్రారంభించిన తర్వాత ఈ చమురు కొనుగోళ్లు భారీగా పెరిగాయి. దాంతో రష్యాపై పాశ్చాత్య దేశాలు ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. అప్ప టి నుంచి వ్యాపారలావా దేవీల కోసం ప్రత్యా మ్నాయ కరెన్సీలు యు వాన్, యుఎఇ, దిరమ్ వాడకం పెరిగింది. ఇదిలా ఉంటే.. సెప్టెంబరులో రష్యా నుంచి చమురు కోసం భారత్ 2.5 బిలియన్ యూరోలను వెచ్చించింది. అంతకుముందు నెలతో పోలిస్తే అది 14 శాతం తక్కువ కావడం గమనార్హం.

# ఇంకా కొలిక్కిరాని 'సర్దుబాట్లు'!

## - లాలూకు రాహుల్ ఫోన్ - 61 సీట్లిచ్చేందుకు ఆర్‌జెడి ఓకే? - మహాకూటమి నేడు అధికారిక ప్రకటన

## - 16మందితో కాంగ్రెస్ తొలి జాబితా - బిజెపి - జెడియు అభ్యర్థులు ఫైనల్ - 40మంది బిజెపి స్టార్ క్యాంపెయినర్లు



**పాట్నా, అక్టోబరు 16:** బీహార్ మాజీ ముఖ్యమంత్రి, ఆర్‌జెడి అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌కు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ గురువారం ఉదయం ఫోన్ చేశారు. మహా కూటమిలో సీట్ల సర్దుబాటు అంశంపై ఇరువురు సమాలోచనలు జరిపినట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీ బీహార్ శాఖ కోరినట్లు 70–75 సీట్లు ఇచ్చేందుకు ఆర్‌జెడి సుముఖంగా లేదని, కాదు కూడదంటే 60–16 స్థానాలు కేటా యిస్తామని ఆ పార్టీ అగ్రనేతలు లాలూ, తేజస్వి తేల్చిచెప్పారు. ఈ నేపథ్యంలో లాలూకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఫోన్ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. మొత్తమ్మీద సీట్ల సర్దుబాటుకు సంబంధించిన చర్చలు తుదిదశకు చేరుకున్నాయని, శుక్రవారం అధికారికంగా ప్రకటన చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. ఇండియా కూటమిలో ఎలాంటి విభేదాలు లేవని కాంగ్రెస్ నేత పవన్ ఖేరా స్పష్టం చేశారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ 16 మంది అభ్యర్థులతో తొలి జాబితాను విడుదల చేసింది. ఇందులో సిట్టింగ్ స్థానాలే అధికంగా ఉన్నాయి. ఇక లాలూ తనయుడు, జన్‌శక్తి జనతా దళ్ అధ్యక్షుడు తేజ్ ప్రతాప్ యాదవ్ మహువ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. ఈ మేరకు గురువారంనాడు నామినేషన్ దాఖలు చేశారు. తేజ్‌ప్రతాప్‌కు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని పేర్కొంటూ సోదరి రోహిణి ఆచార్య సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలియజేశారు. అటు ఎన్‌డియేలోని ప్రధాన భాగస్వామ్య పార్టీలు బిజెపి-జెడియు తమకు కేటాయించిన చెరో 101 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించేశాయి. బిజెపి తొలి జాబితాలో 71, రెండో జాబితాలో 12 మంది అభ్యర్థుల పేర్లు ప్రకటించగా, మూడో జాబితాలో మిగిలిన 18 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. అలాగే జెడియు గురువారంనాడు మిగిలిన 44 స్థానాలకు తమ పార్టీ అభ్యర్థుల పేర్లతో జాబితా విడుదల చేసింది. మొత్తమ్మీద జెడియు ఒబిసి-37, ఇబిసి-22, జనరల్-22, ఎస్‌సి-15, ఎస్‌టి-1, ముస్లిం 4 స్థానాలకు కేటాయించింది. సిఎం నితీశ్ కుమార్ ఎన్నికల ప్రచారాన్ని అధికారికంగా ప్రారంభించారు. గురువారంనాడు పలు నియోజకవర్గాలలో ర్యాలీలు, కార్నర్ మీటింగ్‌లు నిర్వహించారు. అలాగే రాష్ట్రీయ లోక్‌మోర్చా తమకు కేటాయించిన ఆరు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి సంబంధించి భారతీయ జనతా పార్టీ ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ఆ పార్టీ అగ్రనేతలు అమిత్ షా, జెపి నడ్డా సహా 40 మందితో స్టార్ క్యాంపెయినర్ల జాబితాను ఎన్నికల అధికారులకు అందజేసింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో థర్డ్ ఫ్రంట్ ఏర్పాటైంది. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ నేతృత్వంలో కొత్త కూటమి ఏర్పాటైంది. మూడో కూటమిలో ఎంఐ ఎంతో పాటు ఆజాద్ సమాజ్ పార్టీ, రాష్ట్రీయ లోక్ జన్‌శక్తి పార్టీ, తేజ్‌ప్రతాప్ నేతృత్వంలోని జెజెడిలతో కూటమిగా ఏర్పడ్డాయి.

# కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుతోనే అభివృద్ధి సాధ్యం

## పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్



పార్టీలో చేరిన ఆదిలక్ష్మికి కండువా కప్పిన మీనాక్షి నటరాజన్, చిత్రంలో నవీన్‌యాదవ్, మహేష్‌గౌడ్, తుమ్మల నాగేశ్వర్‌రావు, అనీల్‌కుమార్ యాదవ్

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), అక్టోబరు 16, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపుతోనే జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతుందని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ అన్నారు. సోమాజీగూడ డివిజన్‌లోని శాలివాహననగర్‌లో గురువారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి సమా వేశంలో ఆమె ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ.. బీహార్ ఎన్నికలతోపాటు జూబ్లీ హిల్స్ నియోజకవర్గంలో జరుగుతున్న ఉప ఎన్ని కల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయ మన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే తమ లక్ష్యమని అన్నారు. బూత్ స్థాయిలో ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడి పనిచేయాలని, బూత్‌స్థాయిలో నమో దయ్యే ఓట్లను గుర్తిస్తామని ఆయా నాయకులకు తగిన గౌరవం కల్పిస్తామన్నారు. టీపీసీసీ ఛీఫ్ మహేష్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ శకం ముగిసిందన్నారు. జూబ్లీహిల్స్ సీటు కాంగ్రెస్ ఖాతాలో పడటం ఖాయమన్నారు. ప్రజాభిప్రాయం మేరకు నవీన్‌యాదవ్‌ను ఎంపిక చేశామన్నారు. బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల విధ్వంసాన్ని ఎవరూ మరిచిపోరని అన్నారు. రాష్ట్రాన్ని మాదకద్రవ్యాల మయంగా చేశారని, జూబ్లీహిల్స్ ఇందుకు అడ్డాగా నిలిచిందని అన్నారు. అనంతరం యూసుఫ్‌గూడలోని మహమూద్ ఫంక్షన్ హాల్‌లో, షేక్‌పేటలోని ఎస్సార్ కన్వెన్షన్ హాల్‌లో బూత్‌స్థాయి సమావేశాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా అభ్యర్థి నవీన్‌యాదవ్ మాట్లాడుతూ.. అభివృద్ధి అంశంతోనే తాను ముందుకెళ్తున్నానని, ప్రజలు చేయి గుర్తుకు ఓటువేసి అభివృద్ధిని కొనసాగించేం దుకు మద్దతునివ్వాలని కోరారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, తుమ్మల నాగేశ్వర్‌రావుతోపాటు ఎంపీ అనీల్‌కుమార్ యాదవ్, కాంగ్రెస్ నేతలు అజారుద్దీన్, కార్పొరేటర్ విజయారెడ్డి తదితరులు పాల్గొన్నా రు. కార్యక్రమంలో భాగంగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఆదిలక్ష్మి, అనిత, జలజ, రేణుక, తేజ కుమారి తదితరులు మీనాక్షి నటరాజన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

# పేదల గురించి ఆలోచించే పార్టీ కాంగ్రెస్

## పిసిసి చీఫ్ మహేష్‌గౌడ్

**హైదరాబాద్ (యూసుఫ్‌గూడ), అక్టోబరు 16, ప్రభాతవార్త:** పేదల గురించి అహర్నిశలు ఆలోచించే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. గురువారం రహమత్‌నగర్ బూతుస్థాయి సన్నాహక సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ బీఆర్ఎస్ శకం ముగిసిందని జూబ్లీహిల్స్ సీటు కాంగ్రెస్ ఖాతాలో పడటం కాయమని తెలిపారు. ప్రజాభిప్రాయం మేరకే ఉప ఎన్నిక అభ్యర్థిగా నవీన్ యాదవ్‌ను ఎంపిక చేశామని తెలిపారు. కేటీఆర్ పదేళ్ల విధ్వంస పాలనను ప్రజలు మర్చిపోలేదని అన్నారు. 40 లక్షల రేషన్ కార్డులు, సన్న బియ్యం అందివ్వడం జరిగిందని ప్రజల కష్టకాలంలో తోడుగా ఉండే నాయకుడు కావాలని నవీన్ యాదవ్‌ను ప్రకటించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో బీఆర్ ఎస్ పని అయిపోయిందని ప్రజ లకు కావల్సింది సెంటిమెంట్ కాదు అభివృద్ధి అని అన్నారు.



బూత్ స్థాయి సన్నాహక సమావేశంలో పాల్గొన్న పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, అభ్యర్థి నవీన్‌యాదవ్.



బోరబండ సారథి కోఆపరేటివ్ సొసైటీలో బిజెపి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

# ఎంఐఎం కబంధహస్తాల నుంచి హైదరాబాద్‌ను రక్షించుకోవాలి: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ (యూసుఫ్‌గూడ), అక్టోబరు 16, ప్రభాతవార్త:** మజ్లీస్ పార్టీ కబంధహస్తాల నుండి హైదరాబాద్‌ను రక్షించుకోవాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం సారథినగర్‌లో ఎర్రగడ్డ, బోరబండ బీజేపీ బూత్ అధ్యక్షులు, కార్యకర్తల సమావేశంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి జూబ్లీహిల్స్ పార్టీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో మార్పును తెచ్చే ఎన్నికలవుతాయన్నారు. పదేళ్లు పాలించిన బిఆర్ఎస్, పదేళ్లకుపైగా కాంగ్రెస్ పార్టీ ఈ నియోజకవర్గానికి చేసింది ఏమీలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని పాలించడం లేదని మజ్లీస్ పార్టీ పాలిస్తున్నదన్నారు. పాతబస్తీలో మజ్లీస్ గూండాల కారణంగా చాలా ఇళ్లు ఖాళీచేసి వెళ్లిపోయారని తెలిపారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని నిర్ణయించింది గాంధీభవనో, రాహుల్‌గాంధో కాదని మజ్లీస్ పార్టీ అసదుద్దీన్ ఓవైసీ నిర్ణయించారన్నారు. నాడు కేసీఆర్ పాలనలో మజ్లీస్ పార్టీని బుజాలమీద మోశారని ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ కూడా అదే చేస్తుందన్నారు.

ఈ మూడు పార్టీలు ఒకటేనని వీరం దరూ కలిసి బీజేపీ పార్టీని అడ్డుకోవాలని చూస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యా రంటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఓట్ల కోసం వచ్చే నాయకులను నిరుద్యోగ యువకులు మహిళలు నిలదీయాలని సూచించారు. బీఆర్ ఎస్‌కు, కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే అది మజ్లీస్ పార్టీకి వేసినట్లే అన్నారు. బిఆర్ఎస్‌కు తెలం గాణలో భవిష్యత్ లేదని తెలిపారు. బీజేపీ అభ్యర్థి దీపక్ రెడ్డి ప్రజల మధ్యలో ఉండే నాయకుడని ఆయన కోసం కష్టపడి ఇష్టపడి పని చేయాలని తెలిపారు. తాను కూడా పూర్తి సమయాన్ని ఇక్కడే కేటాయిస్తానని ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసిన ఇక్కడ న్యాయమే గెలుస్తుందన్నారు.

# రూ.290 కోట్ల ఆర్థిక సాయం ఎప్పుడు?

## పరిహారం కోసం రైతుల ఎదురుచూపులు

## దిక్కులేని రూ.10 వేల సర్కార్ ప్రకటన

## వర్షాలతో దెబ్బతిన్న 3 లక్షల ఎకరాలు

**హైదరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇటీవల కాలంలో కురిసిన భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతాంగం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన సాయం కోసం కళ్ల కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్, మే, సెప్టెంబరు నెలల్లో కురిసిన భారీ వర్షాలకు రాష్ట్రంలోని వివిధ 3 లక్షల ఎకరాల్లో వరి, పత్తి, మొక్కజొన్న, సోయాబిన్ తదితర పంటలకు భారీగా నష్టం వాటిల్లింది. కొన్నిచోట్ల పంటలు వరదల్లో కొట్టుకుపోగా, మరికొన్ని చోట్ల నీట మునిగాయి. అంతేకాకుండా పంట పొలాల్లో భారీగా ఇసుక మేటలు వేశాయి. ఈ విధంగా మూడు సార్లు దెబ్బతిన్న పంటలకు గాను నష్ట పరిహారం కింద ఎకరానికి రూ.10 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించి నెలలు తరబడి అవుతున్నా బాధిత రైతాంగానికి ఇంత వరకూ అది కార్యరూపం దాల్చలేదు. అలాగే ఇటీవలే రాష్ట్రానికి వచ్చిన కేంద్ర బృందం పంట దెబ్బతిన్న ప్రాంతాల్లో పర్యటించి రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చింది. హెక్టారుకు రూ.6 వేల సాయం అందిస్తామని హామీ ఇచ్చి, మిగిలిన పరిహారం రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందని పేర్కొంది. ఈ విధంగా రైతులకు మొత్తం రూ.290 కోట్లు పరిహారంగా చెల్లించాల్సి ఉంది. ఇందులో భాగంగా మే 28న 51,528 ఎకరాల్లో పంటనష్టానికి రూ.51.52 కోట్లు విడుదల చేయనున్నట్లు ప్రకటించినా వాటిని విడుదల చేయలేదు.

మూడు దఫాలుగా కురిసన వర్షాలతో నల్లగొండ, మహబూబ్‌నగర్, నిజామాబాద్, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, కొత్తగూడెం, జగిత్యాల, కామారెడ్డి, మంచిర్యాల, ఆదిలాబాద్, వికారాబాద్, మెదక్, జగిత్యాల, సూర్యాపేట, గద్వాల, వనపర్తి, ఆసిఫాబాద్ జిల్లాలో పంట నష్టం సంభవించింది. వేసిన పంటలకు సాగు, కూలీ తదితర ఖర్చుల నిమిత్తం అప్పులు చేసి రైతులు భారీగా పెట్టుబడి పెట్టారు. చేలు ఏపుగా పెరడంతో యూరియా, ఇతర రసాయన ఎరువుల కోసం పెద్దమొత్తంలో ఖర్చు పెట్టారు. తీరా పంట చేతికొచ్చే సమయంలో అంతా వర్షం పాలైంది. దీంతో పంటలు దెబ్బతిని, పెట్టుబడులు కోల్పోయి, కనీసం పంటలు వేసుకునేందుకు భూముల్లో ఇసుక మేటలు వేసి కోలుకోలేని స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. పంట సాగు చేసిన వారికి పరిహారం అందించాలని కోరుతున్నారు. అప్పులు తీరే మార్గం కనిపించక, ప్రభుత్వం ప్రకటించిన నష్ట పరిహారం అందక, కనీసం పంటల బీమా కూడా అమలు కాక రైతన్నలు కష్టాల్లో ఎదురీదుతున్నారు. ఈ పరిస్థితుల్లో తమను ప్రభుత్వాలు త్వరిత గతిన ఆదుకోవాలని కోరుతున్నారు.

# పొట్టిశ్రీరాములు తెలుగు వర్సిటీలో త్వరలో అడ్మిషన్లు

## విసిగా ఆచార్య డి.మునిరత్నంనాయుడు నియామకం

## ఘనంగా సత్కరించిన సురవరం తెలుగు వర్సిటీ విసి నిత్యానందరావు

**హైదరాబాద్ (నాంపల్లి), అక్టోబరు 16, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమహేంద్రవరములో ఏర్పాటైన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి ఇన్‌చార్జ్ ఉపాధ్యక్షుడుగా ఆచార్య డి.మునిరత్నం నాయుడును నియమిస్తూ ఏపి ప్రభుత్వం జీఓ విడుదల చేసిన సందర్భంగా ఆయన్ను సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు గురువారం తన కార్యాలయంలో రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు, ప్రజాసంబంధాల అధికారి శ్రీనివాస్‌గౌడ్ తదితరులతో కలిసి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభించబోయే విద్యాత్మక కోర్సుల ప్రవేశాలలో తమవంతు పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రాష్ట్ర విభజన తర్వాత కూడా ఉభయ రాష్ట్రాల్లో విద్యాసేవలను అందిస్తూ వచ్చింది. విభజన చట్టం ప్రకారం పదేళ్లు పూర్తయిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ఈ సేవలు నిలిచిపోయాయి. ఈ పరిస్థితిలో ఏపి విద్యాశాఖ తీసుకున్న నిర్ణయంతో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడానికి మార్గం సుగమం అయ్యింది. రాజమహేంద్రవరం సమీపంలోని బొమ్మూరులో ఈ విశ్వవిద్యాలయం తన కార్యకలాపాలను ఇకనుండి నిర్వహించబోతుంది. ఈ సందర్భంగా నూతనంగా ఇన్‌చార్ ఉపాధ్యక్షుడుగా నియమితులైన ఆచార్య డి.మునిరత్నం నాయుడు మాట్లాడుతూ ఏపిలో ఏర్పడిన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో విద్యాత్మక కార్యకలాపాలు త్వరలో ప్రారంభించడానికి పూర్తి సన్నాహాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. కొంతకాలంగా నిలిచిపోయిన అడ్మిషన్ల ప్రక్రియను వేగవంతం చేస్తామని, విద్యార్థులకు విద్యా సంవత్సరం నష్టపోకుండా చర్యలు చేపడతామని తెలిపారు.



మునిరత్నంనాయుడును సత్కరిస్తున్న నిత్యానందరావు, హనుమంతరావు, శ్రీనివాస్‌గౌడ్ తదితర విశ్వవిద్యాలయ సిబ్బంది



# పోలీస్ కంప్లెయింట్స్ అథారిటీ 'ఎస్‌పిసిఎ'

## ప్రత్యేక వెబ్‌సైట్, లోగో ఆవిష్కరణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 16:** సచివాలయంలో 'తెలంగాణ స్టేట్ పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ (ఎస్‌పిసిఏ)' వెబ్ సైట్, లోగోను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్య దర్శి రామ కృష్ణా రావు, డీజీపీ శివధర్‌రెడ్డి, హోంశాఖ స్పెషల్ సీఎస్ సీవీ ఆనంద్, సిజిజి డిజి రవిగుప్త, ఇంటలిజెన్స్ ఎడిజి విజయ్‌కుమార్, ఎస్‌పిసిఏ చైర్మన్ రిటైర్డ్ జస్టిస్ శివ శంకర్‌రావు, సభ్యులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పేట్ బషీరాబాద్ పారిశ్రామికవాడలో భారీ అగ్నిప్రమాదం

**హైదరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** పేట్ బషీరాబాద్ దూలపల్లి పారిశ్రామికవాడలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ప్లాస్టిక్ కవర్ల తయారీ పరిశ్రమలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పరిశ్రమ నుంచి పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడి వ్యాప్తి చెందుతున్నాయి. స్థానికులు చూసి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో హుటాహుటీన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. రెండు అగ్నిమాపక యంత్రాల సిబ్బంది మంటలను ఆర్పడానికి తీవ్రంగా శ్రమిస్తున్నాయి. అయితే ఈ ప్రమాదానికి షార్ట్‌సర్క్యూట్ కారణమా? ఎవరైన నిప్పుతో ఉన్న సిగరేట్ పడేశారా? అన్న కోణంలో పేట్ బషీరాబాద్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మెత్తటి స్వభావమైన పాలిథిన్ కవర్లు కంపెనీలో అధికంగాఉండడంతో నిప్పుకణం పడిన అంటుకొని మంటలు వ్యాపించి ఎగిసిపడే అవకాశం ఉంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రతి జిల్లాలో రైతు విజ్ఞాన కేంద్రం

**హైదరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని రైతులకు పంటల సాగులో ఆధునిక సాంకేతికను అందుబాటులో తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రతి జిల్లాలో రైతు విజ్ఞాన కేంద్రం స్థాపించనుంది. తద్వారా రైతులకు వాతావరణ మార్పులపై అవగాహన కల్పించడం, పంటల మార్పిడి ఆవశ్యకతను వివరించడం, నేరుగా వరి విత్తనం వేయడం, పత్తిలో కలుపు మొక్కల నివారణ వంటి వాటిని ప్రోత్సహించనుంది. అదేవిధంగా డ్రోన్లు, యంత్రాల వినియోగం, కృత్రిమ మేధ, రోబోటిక్స్ వంటి ఆదునిక సాంకేతిక సేవలను అందించనుంది. వీటన్నింటి అమలుకు ప్రత్యేకంగా రైతు విజ్ఞాన కేంద్రాల ఏర్పాటుపై వ్యవసాయ అధికారులు దృష్టి సారించారు. కాగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం తొమ్మిది ఏరువాక కేంద్రాలు, ఎనిమిది కృషి విజ్ఞాన కేంద్రాలు పనిచేస్తున్నాయి. కొత్త వాటితో పాటు, ఈ కృషి విజ్ఞా కేంద్రాలను రైతు విజ్ఞాన కేంద్రాలుగా మారుస్తారు. ఈ విధంగా రాష్ట్రంలో మరో 15 జిల్లాల్లో కొత్తగా రైతు విజ్ఞాన కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఆర్‌వీకేలు అందుబాటులోకి వస్తాయి. వీటిని ఏర్పాటు చేయడంతోపాటు ప్రతి కేంద్రంలో ఆరుగురు చొప్పున శాస్త్రవేత్తలను నియమిస్తారు. ఇతర సహాయ సిబ్బంది ఉంటారు. రైతు విజ్ఞాన కేంద్రాల ద్వారా ప్రయోగశాలలు ఏర్పాటు చేస్తారు. వాటికి అనుబంధంగా విత్తన, సాగు క్షేత్రాలు ఉంటాయి. వాటిలో డ్రోన్లు, యంత్రాలపై శిక్షణ ఇస్తారు. నిత్యం రైతు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తూ రైతులకు అధునాతన సాగు విధానాలపై అవగాహన కల్పిస్తారు.

# వరి ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానం

**హైదరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త :** దేశంలో రికార్డు స్థాయిలో ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. రాష్ట్రంలో వరి పంట సాగుకు అనుకూల వాతావరణం ఉండటంతో పాటు, ప్రభుత్వ విధానాలతో గతేడాది 2024-25 సంవత్సరంలో తెలంగాణలో రికార్డుస్థాయిలో పంటల సాగు విస్తీర్ణం జరిగింది. దేశంలోనే అత్యధికంగా బియ్యం పండిస్తున్న రాష్ట్రంగా అగ్రస్థానంలో నిలిచిందని అర్థ, గణాంక శాఖ తెలిపింది. రాష్ట్రంలో సాధారణ సాగు విస్తీర్ణానికి మించి వరి పంట వేయడంతో దిగుబడులు రికార్డు స్థాయిలో వచ్చాయి. గత రబీ సీజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 16 లక్షల హెక్టార్లు కాగా, గతేడాది ఏకంగా 24.04 లక్షల హెక్టార్లలో సాగు చేశారు. 2023-24లో రాష్ట్రంలో 168.75 లక్షల టన్నుల బియ్యం ఉత్పత్తి జరిగింది. తదుపరి ఏడాది 2024-25 అంతకు ముందు ఏడాది వచ్చిన దిగుబడిని అధిగమించి 183.57 లక్షల టన్నులు అదనపు ఉత్పత్తి సాధించిందని తెలిపింది. గత సంవత్సరం ఖరీఫ్, రబీలో మొత్తం 275 లక్షల టన్నులకు పైగా ధాన్యం దిగుబడి వచ్చింది. దీని నుంచి 183 లక్షల టన్నుల బియ్యం ఉత్పత్తయినట్లు నివేదిక తెలిపింది. ధాన్యం ఒకటే కాకుండా, వివిధ రకాలకు చెందిన ఇతర పంటల దిగుబడి సైతం గతంలో కంటే పెరిగినట్లు తెలిపింది. అలాగే తృణ, చిరుధాన్యాలు కలిపి రాష్ట్రంలో 37.19 లక్షల టన్నులు, మినుములు 43,570, పెసలు 24,170, కందులు 1.99 లక్షల టన్నులు, అర్థ గణాంక శాఖ వెల్లడించింది.

# నూతన అమరవీరుల స్తూపం పనులపై డిజిపి శివధర్‌రెడ్డి పరిశీలన



**హైదరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** హైదరాబాద్ గోషామహల్ పోలీస్ మైదానంలో నూతనంగా నిర్మిస్తున్న పోలీస్ అమరవీరుల సంస్మరణ స్థూపం నిర్మాణ పనులను గురువారం డిజిపి బి.శివధర్ రెడ్డి పరిశీలించారు. అక్టోబరు 21న పోలీసు అమర వీరుల సంస్మరణదినం సందర్భంగా ప్రతి సంవత్సరం తెలంగాణ పోలీసు శాఖ ప్రత్యేక కార్యక్రమం గోషామహల్ స్టేడియంలో నిర్వహిస్తున్న విషయం విధితమే. కార్యక్రమంలో భాగంగా స్తూపం నిర్మాణ పనులను ఆయన హైదరాబాద్ పోలీసు అధికారులతో కలిసి పర్యవేక్షి ం చారు. కార్యక్రమములో అదనపు డిజిపి మహేష్ భగవత్, హైదరాబాద్ సి.పి. వి.సి సజ్జనర్, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ ఎం.డి. ఎం.రమేష్, జాయింట్ సిపి తఫ్సీర్ ఇక్బాల్, జాయింట్ ట్రాఫిక్ సిపి జోయల్ దేవిస్ తదితర అధికారులు ఉన్నారు.

# దేశ సేవకు నిబద్ధత అవసరం

## ఐసిఎఆర్ డైరెక్టర్ జనరల్, డేర్ కార్యదర్శి డాక్టర్ మంగీలాల్ జాట్

## ముగిసిన 114వ ఫౌండేషన్ కోర్సు ఫర్ అగ్రికల్చరల్ రీసెర్చ్ సర్వీస్ కార్యక్రమం

**హైదరాబాద్ (అత్తాపూర్) అక్టోబరు 16, ప్రభాతవార్త :** మార్పును స్వీకరించేటప్పుడు పరి శోధనకు ప్రాధాన్యత ఇవ్వడం చాలాముఖ్యమని ఐసిఎఆర్ డైరెక్టర్ జనరల్ మరియు డేర్ కార్యదర్శి డాక్టర్ మంగీలాల్ జాట్ అన్నారు. గురువారం నారంలో జరిగిన 114వ ఫౌండేషన్ కోర్సు ఫర్ అగ్రికల్చరల్ రీసెర్చ్ సర్వీస్ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆలోచనను వాస్తవంలోకి అను వదించడం, పరిమిత వనరులతో పనిచేయడం కెరీర్ పురోగతికి ఈ సమయానికున్న అవసరమని ఆయన అన్నారు. మానవత్వం మరియు జనాభా కోసం దేశానికి సేవ చేయడానికి నిబద్ధత అవసరమని ఆయన నొక్కి చెప్పారు. శాస్త్రవేత్తలు వారి బలహీనతలను తెలుసుకోవాలని మరియు సవాళ్లను అవకాశాలుగా మార్చుకుంటూ వ్యక్తిగతంగా ఎదగడానికి వారిపై పనిచేయాలని ఆయన సూ చించారు. ఫోకర్స్ అనేది వ్యవసాయ పరిశోధన సేవ (ఎఆర్ఎస్) కోసం ప్రధాన సామర్థ్య నిర్మాణ కార్యక్రమం, ఇది ఐసీఎఆర్ 2050 దార్శని కతను సాధించడంలో దోహద పడే ప్రొఫెషనల్ పరిశోధకుల కేడర్‌ను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. శిక్షణార్థులు ఏడు రాష్ట్రాలలోని 80 కేవీకే లలో క్షేత్ర అనుభవ శిక్షణ పొందారు. ఈ ఫౌండేషన్ శిక్షణలో తీసుకువచ్చిన ఆవిష్కరణలను నొక్కి చెబుతూ, కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్ వెంకట కుమార్ వివరణాత్మక నివేదికను సమర్పించారు. ఈ బ్యాచ్‌లో ఉత్తమ శిక్షణార్థులుగా డాక్టర్ స్మృతి రంజన్‌పథన్, డాక్టర్ రంజిత ఎం ఆర్‌లను డాక్టర్ జాట్ సత్కరించారు. 'వ్యవసాయ పరిశోధన కోసం కాన్సెప్ట్ నోట్ గ్యాలరీ'; 'వెల్త్ ఆఫ్ ఇండిజీనస్ సైన్స్ ఇన్ అగ్రికల్చర్' 'సావనీర్ ఆఫ్ 114వ ఫోకర్స్' అనే మూడు ప్రచురణలను ముఖ్య అతిథి ఈ సందర్భంగా విడుదల చేశారు. ముందుగా,ఐ సిఎ ఆర్‌నారం యాక్టింగ్ డైరెక్టర్ డాక్టర్ గోపాల్ లాల్ సమావేశానికి స్వాగతం పలికారు. వినూత్న పరిశోధనల ద్వారా భారతీయ వ్యవసాయానికి మార్గదర్శకులుగా ఉండాలని ఆయన ప్రొబెషనర్లకు సూచించారు.ఎ ఆర్ ఎస్ యొక్క 41 విభాగాలు, దేశంలోని 21 రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 105 మంది సైంటిస్ట్ ప్రొబెషనర్లు 3 నెలల వ్యవధిలో ఫౌండేషన్ శిక్షణ పొందారు. దేశవ్యాప్తంగా వివిధ ఐసీఎఆర్ సంస్థలలో పోస్టింగ్ పొందారు. సహాకోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ ఉమేష్ హుదేదమణి కృతజ్ఞతలు తెలిపారు. ముగింపు కార్యక్రమంలో అకాడమీ అధ్యాపకులు, శాస్త్రవేత్తలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఐసిఏఆర్ డైరెక్టర్ జనరల్, డేర్ కార్యదర్శి డాక్టర్ మంగీలాల్ జాట్

# పంటల కొనుగోళ్లు సమర్ధవంతంగా జరపాలి

## రైతుల శ్రేయస్సే అత్యంత ప్రాధాన్యత

## వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్

**హైదరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పంటల కొనుగోళ్లు పారదర్శకంగా, సమర్థవంతంగా, సమన్వయపూర్వకంగా జరిగేలా చూడాలని వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ సూచించారు. రైతుల శ్రేయస్సే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. పత్తి, వరి, మొక్కజొన్న తదితర కొనుగోళ్లపై గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ రైతులు సకాలంలో న్యాయమైన ధర పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా జిల్లాలలో కొనుగోలు కార్యకలాపాలను పర్యవేక్షి స్తూ జిల్లా కలెక్టర్, అధికారులతో సమన్వయం చేసుకుని రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ సజావుగా కొనసాగించే బాధ్యత ప్రత్యేక అధికారులపై ఉందని చెప్పారు. అదేవిధంగా రాష్ట్రంలో రైతుల వివరాలు క్రాప్ బుకింగ్ ద్వారా ఇప్పటికే నమోదు చేయబడినందున ఆ డేటా కప్పాస్ కిసాన్ యాప్‌తో సమన్వయం చేయబడుతుందని తెలిపారు. అయితే, క్రాప్ బుకింగ్‌లో నమోదైన రైతుల మొబైల్ నంబర్లు సరిగా ఉన్నాయా లేదా అనేది తప్పనిసరిగా ధృవీకరించాలన్నారు. ఏ రైతు మొబైల్ నంబరు తప్పుగా నమోదు చేసినట్లు ఉంటే, వాటినివ్యవసాయ శాఖ ద్వారా యాప్‌లో సవరించాల్సి ఉంటుందని వెల్లడించారు. ఇక కౌలు రైతులు విషయానికి వస్తే వారు తప్పనిసరిగా ఎఇఒ టిజి ప్రొక్యూర్‌మెంట్ ద్వారా నమోదు కావాలని, ఆ డేటా కపాస్ కిసాన్ యాప్‌కి నేరుగా పంపబడుతుందని తెలిపారు. అప్పుడు మాత్రమే వారు సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద తమ పత్తిని అమ్మగలుగుతారని పేర్కొన్నారరు. మార్కెట్ యార్డులు వద్ద స్లాట్ బుకింగ్ సహాయ కేంద్రాలు ఏర్పటు చేయడం జరుగుతుందని చెప్పారు. రైతుల ఫిర్యాదులు, సందేహాలను పరిష్కరించడానికి టోల్‌ఫ్రీ నెంబరు 1800 599 5779 ద్వారా హెల్ప్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌ను సజావుగా కొనసాగించేందుకు, రైతులకు గరిష్ట లాభం చేకూర్చే విధంగా చర్యలు తీసుకోవాలని తెలియచేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రత్యేక అధికారులు, మార్కెటింగ్, వ్యవసాయ, సహకార, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికార్లు పాల్గొన్నారు.



డిజిపికి వినతిపత్రం ఇస్తున్న లక్ష్మీనర్సింహ్మారెడ్డి, పత్యానాయక్, రాజేందర్, గణేష్ తదితరులు

## పెండింగ్ బిల్లుల కోసం డిజిపికి మొరపెట్టుకున్న మాజీ సర్పంచ్‌లు

**హైదరాబాద్, అక్టోబరు 16,ప్రభాతవార్త:** సర్పంచుల పెండింగు బిల్లుల విడుదలకు సిఫారసు చేయాలనిసర్పంచుల సంఘం ప్రతినిధులు రాష్ట్ర డిజిపికి మొర పెట్టుకున్నారు. ఈమేరకు గురువారం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ ్మ నర్సింహ్మా రెడ్డి ఆధ్వర్యంలోని పలువురు మాజీ సర్పంచులు డిజెపి శివధర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న 12,769 గ్రామ పంచాయతీలలో ఐదు సంవత్సరాల పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసి బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. గ్రామాలలో సర్పంచులు అప్పులు చేసి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని దీంతో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1200 కోట్ల రూపాయల బిల్లులు పెండింగులో ఉన్నాయన్నారు.దీంతో బిల్లులు సకాలంలో అందక సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారని డీజీపీకి వివరించినట్లు తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు కావస్తున్న ఇంకా బిల్లులు చెల్లించకపోవడంతో తాజా మాజీ సర్పంచులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని పెండింగు బిల్లుల విడుదలకు అనేక నిరసన కార్యక్రమాలు చేపట్టినా ప్రభుత్వం నుండి స్పందన కరువైందని కావున మీరైనా పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేసే విధంగా ప్రభుత్వానికి సిఫారసు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు పత్యా నాయక్, ముథోల్ మాజీ సర్పంచ్ రాజేందర్, వరికుప్పల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# బిసి బంద్‌కు కాంగ్రెస్ మద్దతు

### కామారెడ్డి డిక్లరేషన్‌కు కట్టుబడి ఉన్నాం

### పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, అక్టోబరు 16,ప్రభాతవార్త:** బిసి రిజర్వేషన్‌కు మోకాలడ్డుపెట్టేవారికి బిసి బంద్ కనువిప్పు కలగాలని టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. గాంధీ భవన్ లో బిసి సంఘాల నేతలతో టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ సమావేశమై తెలంగాణ జెఏసి 18న ఇచ్చిన బంద్‌కు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌కు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని రాహుల్‌గాంధీ ఆకాంక్షమేరకు ముఖనయమంత్రి మంత్రులతో సర్వేచేయించారని వివరించారు. రిజర్వేషన్‌లపై హైకోర్టులో తేల్చుకోవాలని సుప్రీంకోర్టు సూచించిందని చెప్పారు. బంద్ ప్రజలను మేల్కొల్పడానికి ఉపపయోగపడుతోందని ఆశాభావం వ్యక్తంచేశారు. కుల సర్వేకు ఆద్యులు రాహుల్ గాంధీ అనికొనియాడారు. స్వాతంత్రం అనంతరం శాస్త్రీయ బద్ధంగా కుల సర్వే నిర్వహించి అఫిషియల్ డాక్యుమెంట్ ఇచ్చామని తెలిపారు. కామారెడ్డి డిక్లరేషన్ కి కట్టుబడి ఉన్నామన్నారు. బిసి రిజర్వేషన్ల విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని అన్నారు. తెలంగాణ బిసి జెఏసి బంద్ కు మద్దతు ఇస్తున్నామని అది బంద్ విజయవంతం కావాలని ఆకాంక్షను వ్యక్తంచేశారు.అసెంబ్లీలో మద్దతు ఇచ్చి బయటకు వచ్చి మోకాలడ్డు పడుతున్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీ గారి ఎవరి వాటా వారికి నినాదం ఉద్యమంగా మారిందని తెలిపారు. రాహుల్ గాంధీ నినాదం గొప్ప వరమని కొనియాడారు. బిసి రిజర్వేషన్ల విషయంలో న్యాయ పరంగా పోరాడుదామని అన్నారు. రాజకీయాలు ఎన్నికల వరకే రిజర్వేషన్ల విషయంలో అందరం ఏకం కావాల్సిన అవశ్యకత ఉందని చెప్పారు. రిజర్వేషన్ల 9 వ షెడ్యూల్



చేర్చే విషయంలో ప్రధాని మోదీని అడిగేందుకు బిజెపి నేతలు ఎందుకు జంకుతున్నారని ప్రశ్నించారు. బిజెపి బిఆర్ఎస్ లోపాయికారి ఒప్పందంతో బిసి రిజర్వేషన్లకు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. బిసి రిజర్వేషన్ల కోసం అన్ని విధాలుగా పోరాడుతామన్నారు. సిఎం రేవంత్,నాకు ఉన్న సఖ్యత దేశంలో ఎక్కడా లేదని తెలిపారు.. రాహుల్ గాంధీ ఆశయ సాధన కోసం సీఎం రేవంత్ ఎనలేని కృషి చేస్తున్నారని కితాబు ఇచ్చారు.

## మంత్రి కూతురు ఆరోపణలపై విచారణ చేయాల్సిందే

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, అక్టోబరు 16:** డెక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీ వివాదంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు స్పందించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. సిమెంట్ ఫ్యాక్టరీ యజమానిని బెదిరించడంలో పెద్దవారి హస్తముందని కొండా కుటుంబ సభ్యులు అంటున్నారని.. దీని వెనుక ఎవరెవరు ఉన్నారో బయట పెట్టాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఓ మంత్రి ఇంట్లోకి వెళ్ళారు. మంత్రి కూతురు.. సీఎం రేవంత్ రెడ్డితో పాటు అనేక మందిపై ఎలిగేషన్ చేశారు. సిమెంట్ కంపెనీల యజమానులను బెదిరింపులకు పాల్పడినట్లు చెప్పారు. కాంగ్రెస్, కరెప్షన్ సమానంగా ప్రయాణం చేస్తున్నాయి. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ దీనిపై వివరణ ఇవ్వాలి. ఇది దోచుకునే ప్రభుత్వంగా మారిపోతోంది. టికెట్‌లు కూడా దోచుకునే వారికే ఇస్తున్నార్థు అని మండిపడ్డారు.మంత్రి కూతురు చేసిన ఆరోపణలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం దోచుకున్న సొత్తు పంచుకుంటున్నారని.. ఇప్పుడు దోచుకున్న సొత్తు పెంచుకునేందుకు తప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఈ ప్రభుత్వం దోచుకునే ప్రభుత్వమా అని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో తెలంగాణను దోచుకున్న పార్టీలను ఓడించాలన్నారు. కాంగ్రెస్ డీఎన్ఏ.. అవినీతి, తప్పుడు పాలన, దోపిడీ అంటూ వ్యాఖ్యలు చేశారు. ప్రజలకు వాస్తవాలు తెలపాలని బీజేపీ డిమాండ్ చేస్తోందని రామచంద్ర రావు వెల్లడించారు. స్థానికంగా తయారైన వస్తువులు కొనుగోలు చేసే ఆలోచన ప్రతి ఒక్కరిలో రావాలన్నారు. చేతి వృత్తులు భారత దేశంలో అనేక వస్తువులు ఉన్నాయని.. భువనగిరి, గద్వాల, సిరిసిల్ల వంటి ప్రాంతాల్లో చేతి వృత్తులకు ప్రత్యేకత ఉందని తెలిపారు. ఇలాంటి వృత్తి చేసేవారు ఈ మధ్య ఆత్మహత్యలు చేసుకోవడం దురదృష్టకరమన్నారు. వీరికి ఉపాధి అవకాశాలు కల్పించేలా స్థానికంగా తయారైన ఉత్పత్తులను కొనుగోలు చేయాలని బీజేపీ ఆలోచన చేస్తోందన్నారు. భారత వస్తువులకు బయట కూడా డిమాండ్ రావాలని.. ఈ ప్రభావం ఆర్థిక వ్యవస్థపై కూడా ఉంటుందన్నారు. బీజేపీ వచ్చిన తర్వాత లెఫ్ట్ వింగ్ ఎక్ట్రీమిజంను నిర్మూలిస్తామని చెప్పామని.. నిన్న అనేక మంది మావోలు ప్రభుత్వం ముందు లొంగిపోయారన్నారు. చాలామంది అజ్ఞాతంలో ఉన్న నక్సల్స్ లొంగి పోయారని తెలిపారు. లెఫ్ట్ వింగ్ ఎక్ట్రీమిజం ఫ్రీ భారతదేశంగా మారుతుందని పేర్కొన్నారు,

**లంక దీపక్‌రెడ్డికి బి ఫామ్ అందజేసిన రాంచందర్‌రావు**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బిజెపి అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డికి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్ రావు గురువారం బి ఫామ్ అందజేశారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో పార్టీ నేతలు, కార్యకర్తల సమక్షంలో దీపక్‌రెడ్డికి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా రాంచంద్రరావు మాట్లాడుతూ దీపక్ రెడ్డి విజయానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కేంద్రం అందిస్తున్న సంక్షేమ పథకాలు, నగరాభివృద్ధిలో చేపట్టిన పనులు, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు.

## జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు ఇవిఎంలు, వివిప్యాట్ల తొలి ర్యాండమైజేషన్ పూర్తి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు16:**జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నిక కోసం వినియోగించే ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు, వోటర్ వెరిఫైబుల్ పేపర్ ఆడిట్ ట్రయిల్స్ (వివిప్యాట్స్) తొలి ర్యాండమైజేషన్ పూర్తయిందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సుధర్షన్ రెడ్డి బుధవారం తెలిపారు.ఈ ర్యాండమైజేషన్‌ను హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో, ఈవిఎం మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఈఎంఎస్) ద్వారా గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించారని ఆయన పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి మొత్తం 407 పోలింగ్ కేంద్రాలు, 569 బ్యాలెట్ యూనిట్స్, 569 కంట్రోల్ యూనిట్స్, 610 వివిపాట్స్ కేటాయించబడ్డాయని వివరించారు. ర్యాండమైజ్ చేసిన యంత్రాల జాబితాలను అన్ని గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధులతో జిల్లా కేంద్రంలో పంచుకున్నట్లు తెలిపారు. అన్ని ఈవీఎంలు, వివ్ప్యాట్లు భద్రతా చర్యల మధ్య గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరచబడ్డాయని చెప్పారు.ప్రతిబంధుల తుది జాబితా ఖరారైన తర్వాత, తొలి ర్యాండమైజేషన్ వివరాలను అన్ని అభ్యర్థులకు అందజేస్తామని సుధర్షన్ రెడ్డి తెలిపారు.

## దగ్గుపాటి ఫ్యామిలీకి నాంపల్లి కోర్టు షాక్

### నవంబరు 14న కోర్టుకు హాజరు కావాల్సిందేనని ఆదేశం

**హైదరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** ఫిలింనగర్‌లో తమ స్థలంలో హోటల్ నిర్మాణం చేబట్టిన నందకుమార్ అనే వ్యక్తి దాఖలు చేసిన ఫిర్యాదుపై వచ్చే నవంబరు నెల 14వ తేదీన దగ్గుపాటి సోదరులు సురేష్ బాబు, వెంకటేష్‌తో పాటు సురేష్ బాబు తనయులు రానా, అభిరాంలు నాంపల్లి కో ర్టులో హాజరు కావాలని, లేకుంటే నాన్ బెయిలబుల్ వారంట్ జారీ చేస్తామని న్యాయమూర్తి ఆదేశించారు. నందకుమార్ దాఖలు చేసిన ఫిర్యాదు మే రకు కోర్టు ఆదేశాల ప్రకారం సురేష్ బాబు, వెంకటేష్, రానా, అభిరాంలపై ఫిలింనగర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు కాగా దీనిపై వారంతా బెయి ల్‌పై వున్నారు. ఈ కేసు విచారణ రెండేళ్లుగా నాంపల్లి కోర్టులో కొనసాగుతోంది. ఇందులో భాగంగా గురువారం నాడు విచారణ జరిగింది. ఈ విచా రణకు సురేష్ బాబు, వెంకటేష్, రానా, అభిరాంలు హాజరు కావాల్సి వుండగా వారి తరపున న్యాయవాది హాజరై బాండ్లు సమర్పించారు. దీనిని నా ్యయమూర్తి తిరస్కరించారు. నందకుమార్ అనే వ్యక్తి రామా నాయుడు స్థలంలో కొంత భాగం అద్దెకు తీసుకుని దక్కన్ కిచన్ పేరిట హోటల్ నిర్మా ణం చేబట్టగా, ఇది నిబంధనలకు విరుద్ధమని దగ్గుపాటి కుటుంబం ఆరోపించి దానిని కూల్చి వేసింది. 2022 నవంబర్‌లో జరిగిన ఈ ఘటనపై న ందకుమార్ కోర్టులో పోరాడుతున్నాడు. కోర్టు ఆదేశాల మేరకు దగ్గుపాటి సురేష్‌బాబు, వెంకటేష్, రానా, అభిరాం వాయిదాకు రావాల్సి వుండగా వా రి తరపున న్యాయవాది రావడంపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసి తదుపరి విచారణకు కచ్చితంగా రావాలని ఆదేశించింది.

# విద్యుత్ అధికారుల పొలం బాట

### యుద్ధ ప్రాతిపదికన వ్యవసాయ కనెక్షన్ల మంజూరు

### ఎస్పీడిసిఎల్ సిఎండి కర్నాటి వరుణ్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** రైతులకు మరింత చేరువై వారి సమస్యలను పరిష్కరించే దిశగా విద్యుత్ అధికారుల పొలం బాట కార్యక్రమాన్ని చేపట్టామని ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. నేరుగా రైతుల వద్దకు వెళ్లి వారికి ఉన్న విద్యుత్ సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తున్నామని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు ఇబ్బందులు లేకుండా నిబద్ధతతో పని చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు 4,064 పొలం బాట కార్యక్రమాలు చేపట్టామన్నారు. ట్రాన్స్ ఫార్మర్ల తరలింపులో రైతులకు ఇబ్బందులు కలగకుండ కొత్తగా వాహనాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు పెంచడానికి కొత్తగా ఎస్పీఎం షెడ్లు అందుబాటులోకి తెచ్చామని, తద్వారా త్వరితగతిన ట్రాన్స్ ఫార్మర్ల మరమత్తులు అవుతాయని వివరించారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌కు సంబంధించి ఎస్టిమేట్ మంజూరు, చెల్లింపులు, డిమాండ్ నోటీస్, స్కెచ్, మంజూరైన మెటీరియల్స్ తదితర వివరాలు మెసేజ్ రూపంలో రైతులకు వస్తుందన్నారు.

అలాగే ప్రతి వారం, నెలల వారీగా ప్రత్యేకంగా వ్యవసాయ సర్వీసుల మంజూరుపై సమీక్ష నిర్వహిస్తున్నామని వెల్లడించారు. విద్యుత్ ప్రమాదాలను నివారించడానికి వంగిన పోల్లను, లూజ్ లైన్లను సరిచేస్తున్నామని మధ్య స్తంభాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. తీగల మధ్య అవసరం ఉన్న చోట స్పేసర్స్ పెడుతున్నామని తెలిపారు.

ఓవర్ లోడ్ ఉన్న ట్రాన్స్ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచామన్నారు. ఇదే సమయంలో రైతులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సేవలు అందిస్తున్నామని వెల్లడించారు. వ్యవసాయ కనెక్షన్ల మంజూరు యుద్ధ ప్రాతిపదికన రిలీజ్ చేస్తున్నామని పేర్కొన్నారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసుల జారీలో మరింత పారదర్శకత తీసుకువచ్చామని, కొత్త కనెక్షన్ కొరకు నమోదు చేసుకున్నప్పటి నుంచి సర్వీస్ రిలీజ్ అయ్యే వరకూ ప్రతి దశలోనూ మొబైల్ నంబర్‌కు సమాచారం పంపిస్తున్నట్లు చెప్పారు. మెటీరియల్ కొనుగోలు పేరుతో రైతులు ఎవరూ డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.156 కోట్లు విడుదల

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు16:**రాష్ట్రంలోని అంగన్వాడీ కేంద్రాలకు పోషకాహార పథకం కింద సరఫరా చేసిన వస్తువుల బిల్లుల కోసం అవసరమైన నిధులను ఆర్థిక శాఖ గురువారం విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాల వారీగా వస్తువులు, కూరగాయలు, గ్యాస్ సరఫరాలు, ఇంటి అద్దెల వంటి ఖర్చుల కోసం మొత్తం రూ.156 కోట్లను ఆర్థిక శాఖ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో, ఖర్చులకు సంబంధించిన అన్ని బిల్లులను వెంటనే సమర్పించాల్సిందిగా మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టరేట్ కార్యాలయం అన్ని జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. రాబోయే రెండు రోజుల్లోపు అన్ని జిల్లాలు తమ బిల్లులను ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలని ఆదేశాల్లో పేర్కొంది.



## ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావును పరామర్శించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,అక్టోబరు16:** గచ్చిబౌలి ఎఐజి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని సిఎం అడిగి తెలుసుకున్నారు.

## రష్యా చమురుపై ట్రంప్ వ్యాఖ్యలకు భారత్ కౌంటర్

**న్యూఢిల్లీ, అక్టోబరు 16:** రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయదని.. ఈ మేరకు ప్రధాని మోదీ తనకు హామీ ఇచ్చారని ట్రంప్ చెప్పారు. ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలపై భారత్ తాజాగా స్పందించింది. దేశ భద్రత, ప్రయోజనాలే తమకు అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేసింది. ఇంధన దిగుమతుల విషయంలో తమ విధానాలు పూర్తిగా దేశీయ అవసరాల మేరకే ఉంటాయని పేర్కొంది. ఈ మేరకు కేంద్ర విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ ప్రకటన విడుదలచేస్తూ 'భారత్ భారీ మొత్తంలో చమురు, గ్యాస్ దిగుమతి చేసుకుంటుంది. అంతర్జాతీయంగా ఇంధన ధరల్లో ఒడిదుడుకులు నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల్లో భారతీయ వినియోగదారుల ప్రయోజనాలను కాపాడటమే మా ప్రథమ ప్రాధాన్యత. మా దిగుమతి విధానాలు పూర్తిగా ఈ లక్ష్యం ఆధారంగానే ఉంటాయి. స్థిరమైన ఇంధన ధరలు, సురక్షితమైన సరఫరా ఈ రెండే మా ఇంధన విధానంలోని ప్రధాన లక్ష్యాలు. దీనికోసం మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఇంధన వనరులను విస్తృతం చేసుకుంటున్నాం' అని తెలిపారు. ఇక అమెరికా విషయానికొస్తే చాలా ఏళ్లుగా ఆ దేశం నుంచి ఇంధన సేకరణను పెంచేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు.

# పాక్ సొమ్ము కోసం భారత్‌పై ట్రంప్ కక్ష!

### అమెరికా మాజీ రాయబారి రహమ్ ఇమాన్యుయేల్

**వాషింగ్టన్, అక్టోబరు 16:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఆ దేశ మాజీ రాయబారి ఒకరు సంచలన ఆరోపణలు చేశారు. పాకిస్థాన్ సొమ్ము కోసం ట్రంప్ అహంభావంతో వ్యవహరిస్తున్నారు. అందుకోసం భారత్-అమెరికా సంబంధాలను కూడా చెడగొట్టారని ఆరోపించారు. జపాన్‌కు అమెరికా మాజీ రాయబారి రహమ్ ఇమాన్యుయేల్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'చైనాను ఎదుర్కోవడంలో అగ్రరాజ్యానికి భారత్ అత్యంత కీలకమైన భాగస్వామి. ఆ విషయాన్ని గుర్తించకుండా అధ్యక్షుడు ట్రంప్ అహం చూపిస్తున్నారు 40 యేళ్ల వ్యూహాత్మక ప్రాణాళికను, దౌత్య సంబంధాలను ఆయన వదులుకున్నారు. భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ చేసింది తానేనంటూ ట్రంప్ చేసిన వాదనను భారత ప్రధాని మోడీ అంగీకరించలేదు. ఇక, పాక్ నుంచి ట్రంప్ కుమారుడికి భారీ మొత్తంలో డబ్బు అందుతోంది. ఈ కారణాల వల్లే భారత్-అమెరికా సంబంధాలను ట్రంప్ చెడగొడుతున్నారు. ట్రంప్ చేసిన ఈ భారీ తప్పిదాన్ని చైనా తమకు అనుకూలంగా మార్చుకుంటోంది' అని ఇమాన్యుయేల్ ఆరోపించారు.



ఈ యేడాది ఏప్రిల్‌లో పాకిస్థాన్ క్రిప్టో కౌన్సిల్‌తో, అమెరికా వ్యాపారవేత్త జాక్ విట్కాఫ్ మధ్య బిజినెస్ డీల్ జరిగింది. విట్కాఫ్ కంపెనీలో ట్రంప్ కుమారుడు జూనియర్ ట్రంప్, అల్లుడు జేర్డ్ కుష్నర్ వాటాదారులుగా ఉన్నట్లు వార్తలు వచ్చాయి. దీన్ని ఉద్దేశిస్తూనే ఇమాన్యుయేల్.. ట్రంప్‌పై విమర్శలు గుప్పించారు. ఇమాన్యుయేల్ గతంలో ఒబామా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో వైట్‌హౌస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా పనిచేశారు.

**ట్రంప్ మళ్లీ పాతపాటే..**

ఇదిలా ఉండగా భారత్-పాకిస్థాన్ కాల్పుల విరమణకు సంబంధించి ట్రంప్ మళ్లీ పాత పాటే పాడారు. యుద్ధం ఆపకపోతే 200 శాతం టారిఫ్‌లు విధిస్తానని ఈ దేశాలను తాను హెచ్చరించానని అన్నారు. వాణిజ్యంతోనే తాను భారత్-పాక్ ఉద్రిక్తతలను తగ్గించానని తెలిపారు. ఓ డిన్నరల్ ఈవెంట్‌లో మాట్లాడుతూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా భారత్‌కు కొత్తగా నియమితులైన అమెరికా రాయబారి సెర్గియో గోర్ గురించి ఆయన ప్రస్తావించారు. 'గోర్ గొప్పగా పనిచేస్తున్నారు. ఆయన భారత్‌లో అమెరికాకు మంచి ప్రాతినిధ్యం వహిస్తారు' అని పేర్కొన్నారు.

## హెచ్-4 ఇఎడి వీసాదారులకు భారీ ఊరట

### పిటిషన్ విచారణకు యుఎస్ సుప్రీం నిరాకరణ

**వాషింగ్టన్, అక్టోబరు 16:** అమెరికాలో నివసిస్తున్న వేలాది భారతీయ టెక్ నిపుణుల కుటుంబాలకు శుభవార్త అందింది. హెచ్1బీ వీసాదారుల జీవిత భాగస్వాములు అంటే హెచ్4 ఇఎడి వీసా హోల్డర్లు (ఉపాధి ధృవీకరణ పత్రం) అమెరికాలో ఉద్యోగాలు చేసుకునే హక్కును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించడానికి యూఎస్ సుప్రీంకోర్టు నిరాకరించింది. దీంతో దాదాపు దశాబ్ద కాలంగా కొనసాగుతున్న న్యాయపోరాటానికి తెరపడినట్లయింది. ఈ నిర్ణయంతో వేలాది భారతీయ కుటుంబాల్లో నెలకొన్న అనిశ్చితి తొలగిపోయి, వారిలో ఆనందం వెల్లివిరిసింది. హెచ్1బీ వీసాదారుల జీవిత భాగస్వాములు ఉద్యోగాలు చేసుకునేందుకు అనుమతించే హెచ్4 ఈఏడీ (ఎంప్లాయ్‌మెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్) విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ సేవ్ జాబ్స్ యూఎస్ఏ అనే సంస్థ చాలా కాలంగా న్యాయపోరాటం చేస్తోంది. ఈ విధానం వల్ల అమెరికన్ల ఉద్యోగావకాశాలు దెబ్బతింటున్నాయని ఆ సంస్థ వాదిస్తోంది. అయితే, ఈ పిటిషన్‌పై విచారణ జరపడానికి సుప్రీంకోర్టు ఆసక్తి చూపలేదు. ఫలితంగా కింది కోర్టు ఇచ్చిన తీర్పు అమల్లో ఉంటుంది. అంటే హెచ్4 వీసాదారుల ఉద్యోగ హక్కు ఇకపై కూడా కొనసాగుతుంది. 2015లో నాటి అధ్యక్షుడు బరాక్ ఒబామా ఈ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. గ్రీన్ కార్డ్ కోసం దరఖాస్తు చేసుకుని, ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్న హెచ్1బీ వీసాదారుల జీవిత భాగస్వాములకు ఇది ఒక వరంలా మారింది. ఈ సదుపాయం లేకపోతే గ్రీన్ కార్డ్ వచ్చేంత వరకు వారు ఖాళీగా ఉండాల్సి వచ్చేది. హెచ్4 వీసాదారుల్లో అత్యధికులు ఉన్నత విద్యావంతులు, నైపుణ్యం కలిగిన భారతీయ మహిళలే కావడం గమనార్హం. ఈఏడీ విధానం వల్ల వారు అమెరికాలో తమ కెరీర్‌లను కొనసాగించగలుగుతున్నారు.

అనేక మంది పెద్ద కంపెనీలలో ఉన్నత స్థానాల్లో స్థిరపడగా, మరికొందరు సొంతంగా వ్యాపారాలు కూడా ప్రారంభించారు. గతంలో డొనాల్డ్ ట్రంప్ హయాంలో ఈ విధానాన్ని రద్దు చేసేందుకు ప్రయత్నాలు జరిగాయి. దీంతో చాలా కుటుంబాలు ఆందోళనకు గురయ్యాయి. ఇప్పుడు సుప్రీంకోర్టు నిర్ణయంతో చట్టపరమైన అడ్డంకులు తొలగిపోయినప్పటికీ, భవిష్యత్తులో రాజకీయపరమైన సవాళ్లు ఎదురయ్యే అవకాశం లేకపోలేదని కొందరు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఏదేమైనా ప్రస్తుతానికి ఈ నిర్ణయం అమెరికాలోని భారతీయ వృత్తి నిపుణులకు, వారి కుటుంబాలకు గొప్ప స్థైర్యాన్ని ఇచ్చింది. ఇది అమెరికా ఆర్థిక వ్యవస్థకు కూడా మేలు చేస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు.

## మామునూరు విమానాశ్రయం అభివృద్ధికి మరో రూ.90 కోట్లు మంజూరు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు16:**రాష్ట్రంలోని వరంగల్ శివార్లలో ఉన్న మామునూరు విమానాశ్రయాన్ని భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థ (ఏఏఐ) ద్వారా అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ అభివృద్ధి పనులకు అవసరమైన భూసేకరణ నిమిత్తం ప్రభుత్వం అదనంగా రూ.90 కోట్లు మంజూరు చేస్తూ అనుమతులు జారీ చేసింది. ఈ మేరకు ట్రాన్స్‌పోర్ట్, రోడ్లు, భవనాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. మామునూరు విమానాశ్రయం అభివృద్ధి కోసం భూమిని సేకరించడానికి గతంలోనే అనుమతులు మంజూరు చేశారు. 2024 నవంబర్ 17న జారీ చేసిన జీఓ 43 ద్వారా భూసేకరణ కోసం రూ.205 కోట్లు మంజూరు చేస్తూ వరంగల్ జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చారు. విమానాశ్రయ భూసేకరణకు సంబంధించి అవార్డును ఖరారు చేయడానికి, భూమి కోల్పోయిన వారికి పరిహారం చెల్లించడానికి ఇప్పటికే మంజూరు చేసిన రూ.205 కోట్లతో పాటు అదనంగా రూ.90 కోట్లు మంజూరు చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ విజ్ఞప్తిని పరిశీలించిన ప్రభుత్వం భూసేకరణ నిమిత్తం అదనంగా రూ.90 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు భూసేకరణ ప్రక్రియను త్వరగా ముగించాలని వరంగల్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. దీంతో మొత్తం భూసేకరణ కోసం మొత్తంగా రూ.295 కోట్లు మంజూరయ్యాయి. ఈ విమానాశ్రయం అభివృద్ధి కోసం కన్సల్టెన్సీ సేవలను అందించడానికి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాను కన్సల్టెంట్‌గా నియమించినట్లు ప్రభుత్వం తెలిపింది.

## 42 శాతం బిసి రిజర్వేషన్ల కోసం నేడు చలో రాజ్‌భవన్

### రేపటి బిసి జెఎసి బంద్‌కు మద్దతు

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 42 శాతం బిసి రిజర్వేషన్లను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డుకోవడాన్ని నిరసిస్తూ సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ నేడు ఛలో రాజ్‌భవన్ కార్యక్రమాన్ని నిర్వహించనుంది. రాష్ట్రంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు కాకుండా బీజేపీ అడ్డుపడటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. ఈ నెల 18న బిసి జేఏసి నిర్వహించినున్న రాష్ట్ర బంద్‌కి సంపూర్ణ మద్ధతు ప్రకటిస్తున్నట్టు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, టి జ్యోతి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి సాగర్‌తో కలిసి జాన్ వెస్లీ గురువారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఎంబి భవన్‌లో మీడియాకి వివరించారు. కేంద్రం వెంటనే 42 శాతం రిజర్వేషన్లు అమలు బిల్లును ఆమోదించాలని, పార్లమెంట్‌లో చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. 9వ షెడ్యూల్‌లో రిజర్వేషన్ల ఏర్పాటుకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ నేడు(శుక్రవారం) ఛలో గవర్నర్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు జాన్ వెస్లీ తెలిపారు. శాసనసభలో బిసి రిజర్వేషన్ల బిల్లును బీజేపీ ఆమోదిస్తూనే కేంద్రంలో మాత్రం అడ్డుకుంటున్నదని విమర్శించారు. బిజెపి నేతలు కేంద్రంలో ఒక మాటను, రాష్ట్రంలోను ఒక మాట మాట్లాడుతున్నారని మండిపడానదరు. బిజెపికి 8 మంది ఎంపీలు, ఇదనదరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడంలేదన్నారు.

రాష్ట్రంలో బిసి రిజర్వేషన్లకు రాష్ట్ర బిజెపి మద్ధతు ఇస్తూ రేపు జరిగే రాష్ట్ర బంద్‌కి సహకరిస్తామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు ప్రకటించారని.. కానీ కేంద్రంలోని బిజెపి రిజర్వేషన్లను వ్యతిరేకిస్తుం దని.. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో బంద్‌కి సహకరి స్తున్న బిజెపి ఆ పార్టీ కేంద్ర నాయకత్వాన్ని వ్యతిరేకిస్తుందా? లేదా? అనే అంశాన్ని స్పష్టం చేయాలని జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేసి అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదించి గవర్నర్‌కు, రాష్ట్రపతికి పంపితే ఉద్దేశ్యపూర్వకంగానే ఎలాంటి ఉత్తర్వులు రాకుండా, బిసిలకు రిజర్వేషన్లు అమలుకాకుండా కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటున్నటున్నదన్నారు. ఫలితంగా స్థానిక సంస్థల ఎన్నికలు కూడా వాయిదాపడ్డాయన్నారు. కాబట్టి ఈబిల్లుపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా లీగల్‌గా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసినప్పటికీ కోర్టు కొట్టివేసిన నేపథ్యంలో రాష్ట్రంలో వెంటనే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి, కేంద్ర ప్రభుత్వంపై పోరాడితేనే సమస్య పరిష్కారమవు తుం దన్నారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. ఈ నెల 18న జరిగే బిసి జేఏసీ రాష్ట్రబంద్‌కు మద్ధతు ఇవ్వాలని జేఏసీ నేతలు కోరారని తెలిపారు.

బిసి రిజర్వేషన్ల బిల్లును కేంద్రంలోని బిజెపి అడ్డుకుంటోందని.. ఇదే అంశాన్ని బంద్‌కు కారణంగా చూపాలని జేఏసిని కోరారు. పార్లమెంట్‌లో బిల్లును, రాష్ట్రంలో ఆర్డినెన్స్‌ను ఆమోదించకుండా అడ్డుకుంటున్న కేంద్ర బీజేపీ ప్రభుత్వాన్ని నిరసిస్తూ బంద్‌కు పిలుపునిస్తే జయప్రదానికి సంపూర్ణ మద్ధతునిస్తున్నట్టు తెలతిపారు. అలాగే సిపిఎం కూడా స్వతంత్రంగా జిల్లాల్లో నిరసన కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించినట్టు తెలిపారు.

# తెర




## డ్యూడ్ ఖచ్చితంగా అందరిని అలరిస్తుంది: ప్రదీప్

లవ్ టుడే, డ్రాగన్‌లతో రెండు వరుస హిట్‌లను అందించిన యూత్ సెన్సేషన్ ప్రదీప్ రంగనాథన్ డ్యూడ్‌తో దీపావళికి ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రంతో కీర్తిశ్వరన్ డైరెక్టర్‌గా పరిచయంఅవుతున్నారు. 'ప్రేమలు' అద్భుతమైన విజయం తర్వాత ప్రదీప్ సరసన మమిత బైజు నటించగా, శరత్ కుమార్ కీలక పాత్ర పోషించారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా సాంగ్స్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యాయి. ట్రైలర్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. అక్టోబర్ 17న తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగామేకర్స్ గ్రాండ్ గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈవెంట్ లో హీరో ప్రదీప్ రంగనాథన్ మాట్లాడుతూ, అందరికి నమస్కారం. హైదరాబాదు నాకు ఇంకో ఫ్యామిలీ. నా సినిమాలన్నీ గొప్పగా ఆదరించారు. మీ అభిమానానికి కృతజ్ఞతలు. మీ కుటుంబంలో ఒకరిగా చూసినందుకు చాలా థాంక్స్. లవ్ టుడే, డ్రాగన్ మీకు నచ్చినట్లయితే ఖచ్చితంగా డ్యూడ్ కూడా నచ్చుతుంది. అదిరిపోయే సినిమా ఇది. మంచి ఫ్యామిలీ ఎంటర్టైనర్ మైత్రి మూవీ మేకర్స్‌కి థాంక్యూ. నాకు తెలుగులో ఇంకా ఎక్కువగా కనెక్ట్ అవ్వాలని ఉంటుంది. ఇది నాకు మంచి అవకాశం. మైత్రి మూవీ మేకర్స్ చాలా అద్భుతంగా పే చేస్తారు. ఈ సినిమా కోసం చాలా మంచి పేమెంట్స్ తీసుకున్నాను.)డైరెక్టర్ కీర్తికి థాంక్యూ. చాలా మంచి సినిమా తీశాడు. సినిమా చూసిన తర్వాత అతను ఎంత పెద్ద డైరెక్టర్ అవుతారో మీరే చెప్తారు. సాయి చాలా పెద్ద కంపోజర్ అవుతాడు. ఇప్పటికే తనకి చాలా మంది అభిమానులు ఏర్పడ్డారు. మమిత కి థాంక్యూ. తను అద్భుతమైన ఎనర్జీతో పెర్ఫాం చేశాడు. ఇక్కడికి వచ్చిన డైరెక్టర్స్ అందరికి థాంక్యూ. నికేత్ బొమ్మకి థాంక్యూ. డ్యూడ్ అక్టోబర్ 17న రిలీజ్ అవుతుంది. తప్పకుండా మీ అందరికీ నచ్చుతుంది. తెలుగు ఆడియన్స్..ఐలవ్ యు ఫరెవర్. హీరోయిన్ మమిత బైజు మాట్లాడుతూ,. చాలా సంతోషంగా ఉంది. మాము సపోర్ట్ చేయడానికి ఇక్కడికి వచ్చిన అందరికీ థాంక్యూ. మైత్రి మూవీ మేకర్స్ ఈ సినిమాకి స్ట్రాంగ్ పిల్లర్. మైత్రి మూవీ మేకర్స్ తో కలిసి పనిచేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. ప్రదీప్‌తో కలిసి నటించడం చాలా మంచి ఎక్స్పీరియన్స్. డ్యూడ్ సినిమా అక్టోబర్ 17 రిలీజ్ అవుతుంది. తప్పకుండాథియేటర్స్ లోవాచ్ చేయండి. మూవీ డైరెక్టర్ కీర్తి ఈశ్వరన్ మాట్లాడుతూ, ఇది ఒకగొప్ప అదృష్టంగా భావిస్తున్నాను. నేను స్క్రిప్ట్ రాసుకుని దర్శకుడు కావాలనుకున్న తర్వాత చెన్నై మొత్తం తిరిగాను. ఫైనల్‌గా ఇక్కడ జూబ్లీహిల్స్ లో నా సినిమా జర్నీ మొదలైంది. నా కలలో కూడా మైత్రి మూవీ మేకర్స్ తో వర్క్ చేస్తానని అనుకోలేదు. తెలుగు దర్శకులంతా వచ్చి మాకు బ్లెస్సింగ్ ఇవ్వడం ఆనందాన్ని ఇచ్చింది. ప్రదీప్ తెలుగుఆడియన్స్ గురించి చాలా ఆలోచిస్తారు. నేను ఈ సినిమా చేస్తున్న క్రమంలో ప్రతిసీన్



చదివి ఇవి ఖచ్చితంగా తెలుగు ఆడియన్స్ కి కనెక్ట్ అవుతుందనే వారు. మమిత చాలా స్వీట్. ఈ సినిమాలో ఒక డిఫరెంట్ మామితని చూస్తారు. అల్లు అర్జున్ గారి ఆర్య, ఈ స్క్రిప్ట్ చేయడానికి నాకు ఇన్స్పిరేషన్ ఇచ్చింది. మ్యూజికల్ సెన్సేషన్ సాయికి థాంక్యూ. అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. ఈ సినిమాలో బాగుందు పో అనే పాట ఉంది. ఈ సినిమాకు కోర్ కూడా అదే. తెలుగు ఆడియన్స్ మంచి ఎమోషన్స్, జెన్యూన్ ఫిలిం ఇష్టపడతారు. దీపావళి తోపాటుఈ సినిమా సెలబ్రేట్ చేసుకొనేలా వుంటుంది. డైరెక్టర్ హను రాఘవపూడి మాట్లాడుతూ.. మైత్రి మూవీ మేకర్స్‌లో కీర్తి సినిమా చేయడం తన అదృష్టంగా భావిస్తున్నాను. తనకి చాలా మంచి బ్లెస్సింగ్స్ ఉన్నాయి. ఇందులో బూమ్ బూమ్ సాంగ్ మంచి వైబ్ ఇచ్చింది. ఈ సాంగ్ ఒక్కటి చాలు ఈ సినిమా వైబ్ చెప్పడానికి. ప్రదీప్, మమత కెమిస్ట్రీ చాలా అద్భుతంగా ఉంది. టీమ్ అందరికీ కంగ్రాజులేషన్స్. డైరెక్టర్ బుచ్చిబాబు సాన మాట్లాడుతూ, నేను రంగస్థలంలో అసిస్టెంట్ డైరెక్టర్గా వర్క్ చేసినప్పటి నుంచి నవీన్ రవి ఎలా ఉన్నారో ఇప్పుడు అలానే ఉన్నారు. నా ఫస్ట్ ఫిలింకి మైత్రి మూవీ మేకర్స్ దొరకడం అదృష్టం. డ్యూడ్ సినిమా గురించి రవి నవీన్ చెప్పినప్పుడు చాలా ఎక్సైటింగ్ గా అనిపించింది. ఈ సినిమా చాలా పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నాను. ప్రదీప్ కి నేను పెద్ద ఫ్యాన్. ఈ సినిమా హిట్ వైబ్రేషన్ ముందే తెలిసిపోతుంది. ఖచ్చితంగా ఈ సినిమా మీ అందరిని ఎంటర్టైన్ చేస్తుంది. నిర్మాత నవీన్ ఎర్నేని మాట్లాడుతూ చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా మీద చాలా నమ్మకంగా ఉన్నాము. అక్టోబర్ 17న అందరూ థియేటర్స్‌కి కొచ్చి బ్లెస్ చేయాలని కోరుకుంటున్నాం. మా హీరో ప్రదీప్‌కి డైరెక్టర్ కీర్తికి సాయి మమత నికేత్ టీమ్ అందరికీ థాంక్యూ. సినిమా కోసం చాలా హార్డ్ వర్క్ చేశారు. సినిమా తప్పకుండా మీ అందరిని అలరిస్తుంది. రామ జోగయ్య శాస్త్రి మాట్లాడుతూ, మైత్రి మూవీ మేకర్స్ హస్తవాసి చాలా మంచిది. ఈ సినిమాతో కీర్తి దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ఇది చాలా శుభారంభం. డైరెక్టర్ కీర్తి చాలా క్లారిటీ ఉన్న వ్యక్తి. పర్స నల్గా నాతో ఇంట్రాక్ట్ అయ్యి ఈ సినిమా లిరిక్స్ రాయించారు. అది ఆయనకి వర్క్ మీద ఉన్న ఫ్యాషన్. ప్రదీప్, మమత ఇలా చాలా మంచి టీం తో వస్తున్న సినిమా తప్పకుండా మీ అందరిని అలరిస్తుంది. ఈ సినిమాతో ప్రదీప్ హ్యాట్రిక్ కొడతారని నమ్మకం ఉంది. డ్యూడ్ టీంతో పని చేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. తప్పకుండా ఈ సినిమా చాలా మంచి విజయాన్ని సాధిస్తుంది. మూవీ యూనిట్ అందరూ పాల్గొన్న ఈ వేడుక చాలా గ్రాండ్ గా జరిగింది .

## 17మిలియన్ వ్యూస్ సాధించిన 'మీసాల పిల్ల' లిరికల్ సాంగ్

మెగాస్టార్ చిరంజీవి మోస్ట్ ఎవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మన శంకరవర ప్రసాద్‌ఫస్ట్ సింగిల్ మీసాల పిల్ల మ్యూజిక్ వరల్డ్‌ని షేక్ చేస్తోంది. చిరంజీవి మాస్‌అండ్‌క్లాస్ కాంబినేషన్‌ని ప్రజెంట్ చేసిన ఈ పాట రికార్డుల వర్షం కురిపిస్తోంది. హిట్ మెషీన్ నిల్‌రావిపూడిదర్శకత్వంలో రూపొందు తున్న ఈ మ్యూజికల్ ఫీస్ట్‌లో చిరంజీవి తన యంగ్ ఎనర్జీ, మ్యాజికల్ డ్యాన్స్ మూవ్స్ తో అదరగొట్టారు. నయనతారతో ఆయన కెమిస్ట్రీ స్క్రీన్‌పై చూడముచ్చటగా వ్నుంది. భీమ్ సీసిరోలియో స్వరపరిచిన ఈ పాటలో ఎలక్ట్రానిక్ బీట్స్, సింథ్ సౌండ్స్, ట్రెడిషనల్‌పెర్కషన్ మేళవింపు అద్భుతంగాఉంది. భాస్కరభట్ల




సాహిత్యం చిలిపితనం, సరదా, ఫన్ తో ఆకట్టుకుంది. ఉదిత్‌నారాయణ్ వాయిస్‌లోని నాస్టాల్జిక్ టచ్, శ్వేతామోహన్ వాయిస్ లోని ఎలిగెన్స్ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రిలీజ్ అయిన రెండురోజుల్లోనే'మీసాల పిల్ల 17 మిలియన్‌కి పైగా వ్యూస్ సాధించి దేశవ్యాప్తంగా టాప్ ట్రెండ్‌గా కొంసగుతోంది. ఇది చిరంజీవి పాన్‌ఇండియా క్రేజ్‌కి నిదర్శనం. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీ, తమ్మిరాజు ఎడిటింగ్, ఏఎస్ ప్రకాష్ ఆర్ట్ డైరెక్టర్. మీసాల పిల్లఇచ్చిన సూపర్ స్టార్ట్‌తో ఈ సీజన్‌లో మరిన్ని మెగా చార్ట్‌బస్టర్స్ కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. చిరంజీవి ఎవర్ గ్రీన్ చరిష్మా, సినిమాటిక్ వైబ్ ని సెలబ్రేట్ చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారురష్మిక మందన్న, రవీంద్ర పుల్లె, అన్‌ఫార్ములా ఫిల్మ్స్ పాన్ ఇండియా ఫిల్మ్ 'మైసా'కి స్టార్ కంపోజర్ జేక్స్ బిజోయ్ మ్యూజిక్‌అందిస్తున్నారు.

## రవీంద్రపులె డైరెక్టర్‌గా అరంగేట్రం చేస్తున్న 'మైసా'


ఇప్పటికే ఆసక్తికరమైన టైటిల్, అద్భుతమైన ఫస్ట్ లుక్ పోస్టర్‌తో బజ్‌ను సృష్టించింది. అన్‌ఫార్ములా ఫిల్మ్స్ మైసాను భారీ బడ్జెట్‌తో పాన్‌ఇండియా స్థాయిలో భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. మేకర్స్ ఒక ఇంట్రస్టింగ్ అప్డేట్ ఇచ్చారు. బ్లాక్ బస్టర్ సరిపోదా శనివారం ఫేం జేక్స్ బిజోయ్ ఈ చిత్రానికి మ్యూజిక్ అందిస్తున్నట్లు అనౌన్స్ చేశారు. ఈ సందర్భంగా జేక్స్ బిజోయ్ ట్రైబల్ వాయిద్యాలతో రీరికార్డింగ్ చేస్తున్న విడియో రిలీజ్ చేశారు. సౌండింగ్



అదిరిపోయింది. మైసా మ్యూజికల్‌గ్రాండ్ స్కేల్‌లో వుండబోతుంది. మైసా గోండ్ తెగల బ్యాక్ డ్రాప్ లో హైఆక్టేన్ ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఉండబోతోంది. రష్మిక మందన్న ఇంతకు ముందు ఎప్పుడూ చూడని ఇంటెన్స్ అవాతర్‌లో కనిపిస్తుంది. ఈ చిత్రానికి సూర్య 'రెట్రో' సినిమాకి పని చేసిన శ్రేయాస్ పి కృష్ణ డీవోపీగా పని చేస్తున్నారు. యాక్షన్ 'కల్కి 2898 ఏడీ' ఫేమ్ ఆండి లాంగ్ డిజైన్ చేస్తున్నారు. మరిన్ని ఎక్సైటింగ్ అప్‌డేట్స్ మేకర్స్ త్వరలో తెలియజేస్తారు. తారాగణం: రష్మిక మందన్న.

## దీపావళికి 'కాంతార చాప్టర్ 1' కొత్త ట్రైలర్ రిలీజ్

రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో వచ్చిన 'కాంతార చాప్టర్ 1' సినిమా దసరా కానుకగా విడుదలై, బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లతో దూసుకుపోతోంది. ఈ పీరియడ్ యాక్షన్ మూవీ రూ.700 కోట్ల దిశగా పయనిస్తోంది. దీపావళి సందర్భంగా తాజాగా కొత్త ట్రైలర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. సినిమాలోని కీలక ఘట్టాలను ఆవిష్కరించిన ఈ ట్రైలర్ ఆడియన్స్‌ను విశేషంగా ఆకట్టుకుంటోంది కాంతార చాప్టర్ 1 దీపావళి ట్రైలర్..3 నిమిషాల్లో సినిమా మొత్తం చూపించేశారుగా!కన్నడ హీరో రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం కాంతార చాప్టర్ 1 హిట్ మూవీ కాంతారకు ప్రీక్వెల్‌గా రూపొందిన ఈ సినిమా..దసరా కానుకగా థియేటర్లలోకి వచ్చింది. బాక్సాఫీస్ దగ్గర భారీ వసూళ్లతో బ్లాక్‌బస్టర్ విజయం సాధించింది. రెండో వారం పూర్తి చేసుకోబోతున్న ఈ పీరియడ్ యాక్షన్ మూవీ. రూ.700కోట్లక్లబ్ దిశగా పయనిస్తోంది. దీపావళిని పురస్కరించుకుని చిత్ర బృందం తాజాగా కొత్త ట్రైలర్ ను రిలీజ్ చేసింది.




## వరుణ్ ఎమోషనల్‌వార్, సైకలాజికల్ వైలెన్స్‌ని జనరేట్ చేస్తాడు
### స్టార్ బాయ్ సిద్ధు జొన్నడగడ్డ

మిరాయ్ లాంటి పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ తర్వాత పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నుంచి వస్తున్న మోస్ట్ ఎవైటెడ్ మ్యూజికల్ రొమాంటిక్ ఎంటర్టైనర్ తెలుసు కదా. స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి, రాశి ఖన్నా హీరోయిన్స్. ప్రముఖ స్టైలిస్ట్‌ఫిల్మ్ మేకర్ నీరజా కోన దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా పాటలు చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. టీజర్ హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. తెలుసు కదా అక్టోబర్ 17న గ్రాండ్ గా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్‌గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ప్రీ రిలీజ్ ఈవెంట్ లో హీరో సిద్దు జొన్నలగడ్డ మాట్లాడుతూ, అందరికీ హాయ్. ఈరోజు చాలా బాధగా ఉంది. ఒక ఏడాదిగా చాలా రాడికల్ అండ్ ఇంట్రెస్టింగ్ క్యారెక్టర్ ప్లే చేస్తున్నాను. ఒక వింత మనిషి బుర్రలో బతుకుతున్నాను. ఎల్లుండి సినిమా రిలీజ్ కాబోతుంది. వరుణ్ అనే క్యారెక్టర్‌కి గుడ్ బై చెప్పేయాలి. నేను ఎందుకు ఆ క్యారెక్టర్ గురించి అంత పర్టికులర్‌గా చెప్తున్నాను అంటే సినిమా చూస్తున్నప్పుడు మీకు అర్థం అవుతుంది. వెరీ ఇంట్రెస్టింగ్ క్యారెక్టర్. అందుకే లాస్ట్ టైం వరుణ్ లాగా ఉందామను కుంటున్నాను. అందుకే తన దగ్గరికి వెళ్లి తన షర్ట్ కూడా తీసుకొచ్చాను. వరుణ్ నాకు రెండు కండిషన్స్ పెట్టాడు. ఇక్కడున్న ఆడపిల్లలు అందరితో మాట్లాడమన్నాడు. అమ్మాయిలతోనే సృష్టి మొదలైంది. మేము మీ ముందు చాలా నిమిత్త మాత్రులం. మేము ఏదైనా చిన్న తప్పు చేసినా మీరు పెద్దమనసు చేసి క్షమించేయాలి. మీరు గొప్ప మేము గొప్ప అని డిస్కషన్ లేదు. మీరే గొప్ప. మీ వల్ల మేము గొప్ప. ఇప్పుడు బాయ్స్‌తో మాట్లాడదాం. ఎప్పుడైనా ఒక అమ్మాయి మీ మనసు విరగ్గొట్టి వెళ్లిపోతే వెళ్లిపోనివ్వండి. లేదు అలా కాదు ఆమె వెంట పడితే మాత్రం మీ మీద మీకున్న మర్యాద పోతుంది. అబ్బాయిలకి సెల్ఫ్ రెస్పెక్ట్ ఎవరెస్టులో ఉండాలి. మనసు విరుగుతుంది, బాధేస్తుంది. రానివ్వండి. అసలు కథ అక్కడే మొదల వుతుంది.



అప్పుడు వరుణ్ లాంటివాడు మీ నుంచి బయటకు వస్తాడు. మన ఎమోషన్స్ మన కంట్రోల్ లో ఉండాలని అర్థమవుతుంది. పవర్ కంట్రోల్ మనసులో మెయింటైన్ అవ్వాలి. ఇంకేమైనా డౌట్లు మిగిలిపోయి ఉంటే అక్టోబర్ 17న థియేటర్స్ కి వచ్చి తెలుసు కదా సినిమా చూడండి. ఈ సినిమాలో వరుణ్ అనే క్యారెక్టర్ ఒక్క చుక్క రక్తం చిందించకుండా ఎమోషనల్ వార్, సైకలాజికల్ వైలెన్స్ ని జనరేట్ చేస్తాడు. అది నా ప్రామిస్ .బెర్ముడా ట్రయాంగిల్ మీద నుంచి షిప్ వెళ్లిన ఎయిర్ క్రాఫ్ట్ వెళ్ళినా దానిలోకి లాగేసుకుంటుంది. తెలుసు కదా కూడా అలాంటి లవ్‌ట్రయాంగిల్. ఈ సినిమా చూసిన వాళ్ళందరినీ కూడా అది లాగేస్తుంది. వరుణ్ క్యారెక్టర్‌కి గుడ్ బై చెప్పడం నిజంగా బాధగా ఉంది. అందరికీ దీపావళి శుభాకాంక్షలు. సినిమా థియేటర్స్ లో చూడండి తప్పకుండా మిమ్మల్ని ఎంటర్టైన్ చేస్తుంది. హీరోయిన్ రాశిఖన్నా మాట్లాడుతూ, తెలుసు కదా నా మనసుకు చాలా దగ్గర సినిమా. చాలా కష్టపడ్డాం. ఇంత అద్భుతమైన క్యారెక్టర్ చేసిన రాసినందుకు నీరజాకి థాంక్యూ. శ్రీనిధి చాలా కష్టపడింది. తన బ్యూటిఫుల్ సోల్. తనతో వర్క్ చేయడం చాలా మంచి ఎక్స్పీరియన్స్. సిద్దుకి సినిమా అంటే పిచ్చి. అంతఫ్యాక్షన్ ఉన్న కోస్టార్ ని నేను ఎప్పుడు చూడలేదు. ఈ సినిమా చూసిన తర్వాత మీరు టిల్లును కూడా మర్చిపోతారు. ఈ సినిమా అందరూ చూడాలని కోరుకుంటున్నాన డైరెక్టర్ నీరజకోన మాట్లాడుతూ., విశ్వకి కృతికి థాంక్యూ సో మచ్ ఫస్ట్ టైం డైరెక్టర్ కి వాళ్ళు ఇచ్చిన సపోర్టు మర్చిపోలేను ఈ సినిమా ఇంత అద్భుతంగా రావడానికి కారణం మా నిర్మాతలే సిద్దు లేకుండా ఈ సినిమా ఉండేది కాదు ఈ సినిమాకి తను బ్యాక్ బోన్ నిధి రాశికి థాంక్యూ వాళ్ళిద్దరూ ఈ ప్రాజెక్టుకి రావడం అదృష్టంగా భావిస్తున్నాను ఈ ముగ్గురు సినిమాకి పిల్లర్స్ అద్భుతంగా పెర్ఫార్మ్ చేశారు. హర్ష క్యారెక్టర్ మీ అందరిని అలరిస్తుంది డైరెక్టర్ రవికాంత్ మాట్లాడుతూ, ఈ సినిమా చూశాను. చాలా బాగుంది. ఫెంటాస్టిక్. సిద్ధూలో మరో కోణం చూస్తారు. మీరు ఎప్పుడూ అలా చూసి ఉండరు. సిద్దు ఈ జనరేషన్ స్టార్. అందరు కూడా అద్భుతంగా పెర్ఫాం చేశారు. నీరజాకి ఆల్ ది బెస్ట్. తప్పకుండా సినిమా బ్లాక్ బస్టర్ అవుతుంది. డిఓపి జ్ఞాన శేఖర్ మాట్లాడుతూ, ఈ సినిమా బ్యూటిఫుల్ జర్నీ. ప్రతి మూమెంట్ ని ఎంజాయ్ చేశాం. సిద్దు నీరజ కృతి రాశి అందరితో పని చేయడం బ్యూటిఫుల్ ఎక్స్పీరియన్స్. తప్పకుండా ఈ సినిమా మిమ్మల్ని అందరిని ఎంటర్టైన్ చేస్తుంది.

## జటాధరకోసం గ్లోబ్ ట్రాటర్!

మన టాలీవుడ్ నవ దళపతి సుధీర్ బాబు హీరోగా బాలీవుడ్ హీరోయిన్ సోనాక్షి సిన్హా సాలిడ్ రోల్ లో దర్శకులు వెంకట్ కళ్యాణ్ అలాగే అభిషేక్ జైస్వాల్ లు తెరకెక్కించిన సాలిడ్ చిత్రవే ఈ'జటాధర' ఇది కూడా ప్రస్తుతం కొనసాగుతున్న డివోషనల్ టచ్ సూపర్‌నాచురల్ థ్రిల్లర్ గా తెరకెక్కిస్తుండగా రీసెంట్ గానే ఒకో సాంగ్ ని కూడా మేకర్స్ రిలీజ్ చేస్తూ వచ్చారు. మరి ఈ చిత్రం నుంచి అవైటెడ్ ట్రైలర్ అయితే రిలీజ్ చేసేందుకు రంగం సిద్ధం అయ్యింది. అ యితే ఈ ట్రైలర్ కోసం సూపర్ స్టార్ ది గ్లోబ్ ట్రాటర్ మహేష్ బాబు ముందుకొచ్చారు.

దీనితో అక్టోబర్17న రిలీజ్ చేస్తున్నట్టుగా ఇప్పుడు మేకర్స్ కన్ఫర్మ్ చేయడంతో ఘట్టమనేని ఫ్యాన్స్ లో కొత్త ఉత్సాహం వచ్చింది. ఇక ఈ చిత్రానికి రాయిస్ అండ్ జైన్ - సామ్ లు సంగీతం అందించగా ఉమేష్ కుమార్ బన్సాల్, శివిన్ నారంగ్, అరుణ అగర్వాల్, ప్రేరణ ఆరోరా, శిల్పా సింఘాల్ మరియు నిఖిల్ నందా లు నిర్మాణం వహించారు. అలాగే ఈ నవంబర్ 7న సినిమా రిలీజ్ కి రాబోతుంది.






## ఆసియాకప్ హీరో యంగ్ క్రికెటర్ తిలక్ వర్మను సత్కరించిన చిరంజీవి,

మెగాస్టార్ చిరంజీవి మన శంకరవర ప్రసాద్ గారు సెట్స్‌లో హిట్ మోషన్ అనిల్ రావిపూడి మోస్ట్ ఎవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మన శంకర వర ప్రసాద్ గారు షూటింగ్ వేగంగా జరుగుతోంది. చిత్రీకరణలో బిజీగాఉన్న చిరంజీవి, ఒక మంచి సందర్భానికి సమయం కేటాయించారు. ఇటీవల ఆసియా కప్ ఫైనల్లో పాకిస్థాన్‌పై భారత్ ఘనవిజయం సాధించడంలో కీలకపాత్రపోషించిన వ క్రికెటర్ తిలక్ వర్మను మెగాస్టార్‌సన్మానించారు. ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఆడుతూ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో భారత్ విజయంలో కీలకమైన భాగస్వామి అయిన తిలక్ వర్మ ప్రతిభను చిరంజీవి అభినందించారు. తనసహజమైన వినయం, పెద్దమనసుతో చిరంజీవి, తిలక్ వర్మను ఆప్యాయంగా ఆహ్వానించారు. ఆయనకు శాలువా కప్పి, మ్యాచ్‌లోని ఆయన మెమొరబుల్ మూమెంట్ ని ఫ్రేమ్ చేసిన ఫోటోను అందజేశారు. కృషి, క్రమశిక్షణ కేవలం క్రీడలోనే కాకుండా జీవితంలోనూ విజయానికి మార్గదర్శకమని అన్నారు. నయనతార, దర్శకుడ్ను అనిల్ రావిపూడి, నిర్మాతలు సాహు గరపాటి, సుస్మిత కొణిదెల పాల్గొన్నారు. ఇండియన్ సినిమా ఐకాన్ చిరంజీవి చేత సన్మానం పొందడం తిలక్‌వర్మకు ఒకప్రత్యేక క్షణం. దయ, వినయం, సినిమాలకంటే మించి స్ఫూర్తినిచ్చే మెగా వ్యక్తిత్వానికి ఇది మరో అద్భుతమైన ఉదాహరణగా నిలిచింది.

## విజయ్ దేవరకొండ నట విశ్వరూపం
### హైప్ ఎక్కిస్తున్న'విడి 14'డైరెక్టరు

విజయ్ దేవరకొండ విశ్వరూపం చూస్తారు.. హైప్ ఎక్కిస్తున్న జుదీ 14 డైరెక్టర్( రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ బ్యాక్ టు బ్యాక్ ప్రాజెక్ట్స్ తో బిజీగా ఉన్నారు. కింగ్డమ్ లుక్ కోసం మిగతా సినిమాలను పక్కనపెట్టిన యువ హీరో..ఇటీవలరౌడీ జనార్ధన్ మూవీ షూటింగ్ ప్రారంభించారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌లో ఈపాన్‌ఇండియామూవీ రూపొందు తోంది. దీని తర్వాత రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతానికి 'విడి 14 'అనే వర్కింగ్ టైటిల్‌తో పిలుచుకుంటున్నారు. తాజాగా ఈ సినిమా గురించి రాహుల్ చెప్పిన మాటలు హైప్ క్రియేట్ చేస్తున్నాయి. బ్రిటీష్ ఇండియా కాలం నేపథ్యంలో పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా 'విడి 14 సినిమా రూపొందుతోంది. 19వ శతాబ్దంలో 1854 నుంచి



1878 మధ్య కాలంలో జరిగిన యదార్ధ చారిత్రక సంఘటనల ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతోందని సమాచారం.

భారీ స్థాయిలో ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్ ను రూపొందించాలని ప్లాన్ చేస్తున్నారు. ఇందులో విజయ్ దేవరకొండ క్యారెక్టర్, ఆయన గెటప్ చాలా కొత్తగా ఉంటాయని టాక్. ఈ సినిమాలో విజయ్ నట విశ్వరూపం చూపించబోతున్నారని రాహుల్ సంకృత్యన్ అంటున్నాడు.

# లలిత సంగీత సరస్వతి



**లలిత సంగీత సామ్రాజ్ఞి.. తేనెలూరే గళం, కోకిల స్వరంతో ఆణిముత్యా ల్లాంటి పాటలను ఆలపించిన తొలితరం సినీ నేపథ్యగాయని.. రావు బాల సరస్వతీదేవి (97) ఇక లేరు. లలిత సంగీత సామ్రాజ్ఞి.. తేనెలూరే గళం, కోకిల స్వరంతో ఆణిముత్యా ల్లాంటి పాటలను ఆలపించిన తొలితరం సినీ నేపథ్యగాయని. .**

ఆమె అసలు పేరు సరస్వతీదేవి. 1937లో వచ్చిన 'బాలయోగిని' చిత్రంలో ఆమె పేరును 'బాల సరస్వతీ దేవి'గా వేశారు. అప్పటి నుంచీ అదే పేరు ఆమెకు స్థిరపడిపోయింది. సరస్వతీ దేవీ తన నాల్గవ ఏటనే స్వస్థలం గుంటూరులో రత్నమహల్ థియేటర్ స్టేజీ మీద పాటలు పాడారు. ఆరో ఏట హెచ్‌ఎంవీ గ్రామ్‌ఫోన్ రికార్డు కంపెనీ ద్వారా సోలోగా పాడి సంగీత ప్రియులను రంజింప జేశారు! దరిమిలా సినిమాల్లో తన అమృత గానంతో తెలుగు సినీ, సంగీత అభిమానుల హృదయాలలో చిరస్థానం సంపాదించుకున్నారు. కోలంక రాజాతో వివాహానంతరం 'రావు బాల సరస్వతి'గా మారారు. సరస్వతీ దేవి 1929 ఆగస్టు 29న మద్రాసులో.. తన అమ్మమ్మగారింట జన్మించారు. ఆమె తల్లిదండ్రులు విశాలాక్షి, పార్థసారధి దంపతులు. తండ్రి సొంతూరు గుంటూరు. సుప్రసిద్ధ సినీ నటి, దర్శకురాలు, నిర్మాత.. అయిన విజయ నిర్మల బాలసరస్వతికి స్వయానా మేనమామ కూతురు. రావు బాల సరస్వతీ దేవి తన తండ్రి ప్రోత్సాహంతో ఆలత్తూర్ సుబ్బయ్య వద్ద కర్ణాటక సంగీతం, ముంబైలోని వసంత దేశాయ్ దగ్గర హిందుస్థానీ సంగీతం నేర్చుకున్నారు. హెచ్‌ఎంవీ వారి రికార్డులు విన్న దర్శకుడు సి.పుల్లయ్య ఆమెకు 'సతీ అనసూయ' సినిమాలో అవకాశం ఇచ్చారు. తెలుగు సినిమాలతో పాటు తమిళ, కన్నడ., సింహళ భాషల్లో రెండువేలకుపైగా పాటలు పాడారు.

**ఆమె పాటతోనే ప్రారంభం..** మద్రాసు ఆకాశవాణి కేంద్రంలో 1940లో లలిత సంగీతం బాలసరస్వతి పాటతోనే ప్రారంభమైంది. తర్వాత 1948లో విజయవాడ ఆకాశవాణి కేంద్రం కూడా ఆమె గాత్రంతోనే శ్రోతలకు పరిచయమైంది. 1940-50లమధ్య కాలంలో ఎస్.రాజేశ్వరరావుతో కలసి ఆమె ఆలపించిన లలిత గీతాలు రేడియో, గ్రామ్‌ఫోన్ రికార్డుల ద్వారా తెలుగునాట మారు మోగాయి. కాని ఆమె ఆర్థిక ఇబ్బదులుఎన్నో. ముఖ్యమంత్రిగా ఉన్న ఎన్టీఆర్‌ను కలసి తన కష్టాలను వివరించడంతో, హైదరాబాద్‌కు తరలి రావాల్సిందిగా ఆమెకు సూచించారు. ప్రభుత్వం నుంచి తగిన సహాయసహకారాలు అందిస్తానని మాటిచ్చారు. అలా 1995లో సరస్వతి కుటుంబంతో సహా బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు మారారు. కానీ.. ఆమె వచ్చిన మూడు నెలలకే ఎన్టీఆర్ మరణించడంతో తమకు సాయం చేసేవారు లేక చాలా అవస్థ పడినట్లు ఓ సందర్భంలో బాలసరస్వతి చెప్పారు. తర్వాత జయలలిత సిఎంగా ఉన్నప్పుడు 'అన్నా' అవార్డుతో సత్కరించడంతో పాటు చెన్నైలో మూడు గదుల ఫ్లాటు, పదిలక్షల రూపాయల నగదును అందించారు. అలాగే ఏపీలోని గత ప్రభుత్వం పది లక్షల రూపాయల నగదుతో లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డును ప్రదానం చేసింది. ఇంకా మరెన్నో అవార్డులు, సత్కారాలు ఆమె అందుకున్నారు.

# దేశంలోనే అగ్రశ్రేణి సంపన్నురాలు




**ప్రపంచ వ్యాప్తంగా చర్చ ఉండే ధనవంతుల గురించి ఎప్పుడూ జరుగుతూనే ఉంటుంది. ఆదాయల పరంగా ఆస్తులు ఎవరు ఏ స్థానంలో ఉన్నారో తెలుసుకోవాలనే ఆసక్తి చాలామందికి ఉంటుంది. ఈ విధంగానే పలు సంస్థలు ఏటా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కుబేరుల జాబితాను విడుదల చేస్తాయి. తాజాగా హురున్ సంస్థ 'ఎం3ఎం హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2025'ను విడుదల చేసింది. ఇందులో హెచ్‌సీఎల్ అధినేత్రి రోష్నీ నాడార్ మల్హోత్రా దేశంలోనే ధనవంతురాలైన మహిళగా నిలిచారు. ఈ జాబితాలో ఒక మహిళ టాప్-3లో చోటు దక్కించుకోవడం ఇదే తొలిసారి కావడం విశేషం! అంతేకాదు.. టాప్10లోనూ రోష్ని ఒక్కర్తే మహిళ కావడం మరో విశేషం! సుమారు రూ.2.84 లక్షల కోట్ల సంపదతో ఈ జాబితాలో మహిళల అగ్రస్థానంలో నిలిచిన రోష్ని గురించి కొన్ని విషయాలు తెలుసుకుందాం..**

సలహాదారుగా... హెచ్‌సిఎల్ వ్యవస్థాపకుడు శివ్ నాడార్, కిరణ్ నాడార్ల గారాలపట్టి రోష్ని (43). ఆమె 1982లో జన్మించారు. ఢిల్లీలోని వసంత్ వ్యాలీ స్కూల్లో పాఠశాల విద్యను పూర్తి చేశారు. ఆ తర్వాత ఉన్నత విద్యను అభ్యసించడానికి అమెరికాకు వెళ్లిన ఆమె నార్త్‌వ్రెస్టన్ యూనివర్సిటీలో కమ్యూనికేషన్స్ డిగ్రీ పట్టా పొందారు. అదే యూనివర్సిటీకి చెందిన కెల్లాగ్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఎంబీఏ పూర్తి చేశారు. రోష్ని పలు ప్రతిష్టాత్మక గ్లోబల్ అడ్వైజరీ బోర్డుల్లో సభ్యురాలిగానూ కొనసాగుతున్నారు. ఇందులో ఎంఐటి స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్‌కు సంబంధించిన డీన్స్ అడ్వైజరీ కౌన్సిల్, అమెరికా-ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరమ్ , ది నేచర్ కన్జర్వన్సీలూ ఉన్నాయి.

**అనుభవం వచ్చాకే..!** కుటుంబ పరంగా వ్యాపార సామ్రాజ్యం కొనసాగింపు చదువు పూర్తికాగానే తమ సంస్థల్లో భాగమవ్వాలనుకోలేదు. ఈ రంగంలో సొంతంగా అనుభవం గడించాకే కుటుంబ సంస్థలో చేరాలనుకున్నారు. అందుకు తండ్రి శివ్ నాడార్ కూడా మద్దతు తెలపడంతో మొదటగా సిఎన్‌బిసి, సిఎన్‌ఎన్ వంటి అంతర్జాతీయ మీడియా సంస్థల్లో ఇంటర్‌గా పనిచేశారు. ఆ తర్వాత లండన్‌లో స్కైన్యూస్‌లో న్యూస్ ప్రొడ్యూసర్‌గా విధులు నిర్వర్తించారు. కొంత అనుభవం గడించిన తర్వాత 2009లో హెచ్‌సీఎల్‌లో భాగమయ్యారు. ఏడాది కాలంలోనే తన ప్రతిభాపాటవాలతో ఎదిగిన ఆమె.. 27 ఏళ్ల వయసులో సంస్థకు సీఈవోగా నియమితులయ్యారు.

**నాన్న ఇచ్చిన బహుమతి..!**
2020లో సంస్థ చైర్మన్ పదవి నుంచి శివ్ నాడార్ వైదొలగడంతో ఆ బాధ్యతను రోష్ని స్వీకరించారు. ఈ భారత్‌లో ఒక ఐటీ సంస్థకు అత్యున్నత స్థాయిలో బాధ్యతలు నిర్వర్తించే మొదటి మహిళగా ఘనత సాధించారు. తనదైన వ్యూహ రచనతో హెచ్‌సీఎల్ సంస్థను లాభాల బాట పట్టిస్తూ.. దేశంలోనే ధనిక మహిళల్లో ఒకరిగా ఎదిగారు. ఈ ఏడాది 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం' సందర్భంగా శివ్ నాడార్ హెచ్‌సీఎల్‌లోని తన 47 శాతం వాటాను రోష్నికి బహుమతిగా ఇచ్చి.. అటు తన కూతురిపై ఉన్న ప్రేమను, ఇటు స్త్రీశక్తిని చాటారు. ఈ సమయంలో విడుదల చేసిన హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్ 2025 జాబితాలో 40 బిలియన్ డాలర్ల సంపదతో రోష్నికి 5వ స్థానం దక్కింది. ఇక తాజాగా విడుదల చేసిన 'ఎండిఎం హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2025' జాబితాలో ఏకంగా అగ్రస్థానానికి ఎగబాకిన ఆమె.. సుమారు రూ.2.84 కోట్ల సంపదతో దేశంలోనే శ్రీమంతురాలిగా నిలిచారు. ఇలా ఈ జాబితాలో ఒక టాప్3లో చోటు దక్కించుకోవడం ఇదే తొలిసారి కావడం విశేషం! అంతకాదు.. టాప్10లోనూ రోష్ని ఒక్కర్తే మహిళ కావడం మరో విశేషం! అలాగే గత కొన్నేళ్లుగా ఫోర్బ్స్, ఫార్చ్యూన్.. వంటి ప్రతిష్టాత్మక జాబితాలో చోటు దక్కించుకుంటూ ముందుకు దూసుకెళ్తున్న ఆమె.. ఫ్రాన్స్. అత్యున్నత పౌర పురస్కారం 'షెవెలియర్ డె లా లీజియన్ డి హానర్' ను అందుకున్నారు.



**..సామాజిక సేవలోనూ..!** రోష్ని సామాజిక సేవలోనూ ముందుంటారు. 'శివ్ నాడార్ ఫౌండేషన్' ద్వారా నెలకొల్పిన పలు విద్యాసంస్థల్లో ఎంతోమంది పిల్లలకు ఉచితంగా విద్యనందిస్తున్నారు. వ్యాపారంలో ఎంత ఉన్నా సమయం దొరికితే ఫౌండేషన్ పనులను చూసుకుంటారామె. ఈ అవసరమైన పిల్లల అవసరాలు తెలుసుకోవడంతో పాటు వాళ్ల కోసం ఇంకా ఏమి చేయాలో ప్రణాళికలు వేసుకుంటారట. రోష్ని పర్యావరణ ప్రేమికురాలు కూడా. 2018లో 'ది హాబిటాట్స్ ట్రస్ట్'ను ఏర్పాటు చేసి వన్యప్రాణులను, వాటి ఆవాసాలను పరిరక్షించడానికి కృషి చేస్తున్నారు. అలాగే వన్యప్రాణి సంస్థలతోనూ కలిసి పనిచేస్తున్నారు. కోట్ల ఆస్తులు ఉన్నా రోష్ని మాత్రం ఎప్పుడూ సింపుల్గానే కనిపిస్తారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలని తన తండ్రి చెప్పిన సిద్ధాంతాన్నే పాటిస్తున్నానంటున్నారీ బిజినెస్ లేడీ. రోష్ని తన సోల్మేట్ శిఖర్ మల్హోత్రాను 2010లో పెళ్లి చేసుకున్నారు. వీరిద్దరూ ఏడేళ్లు స్నేహం చేసి ఒకరినొకరు అర్థం చేసుకున్నాక పెళ్లి చేసుకున్నారట. ప్రస్తుతం శిఖర్ మల్హోత్రా సంస్థలకు వైస్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. ఈ దంపతులకు అర్మాన్, జహాన్ అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇక ఈ 'ఎం3ఎం హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2025'లో నైకా వ్యవస్థాపకురాలు ఫల్గుణీ నాయర్, బయోకాన్ ఫౌండర్ కిరణ్ మజుందార్ షా, అరిస్టా నెట్‌వర్క్ సిఇఒ-అధ్యక్షురాలు జయశ్రీ ఉల్లాల్, జోహో సహ-వ్యవస్థాపకురాలు రాధా వెంబు.. చోటు దకినకంచుకున్నారు. ఓవైపు తమదైన వ్యాపార దక్షతతో తమ సంస్థల్ని లాభాల దిశగా పరుగులు పెట్టిస్తూనే.. మరోవైపు దేశ ఆర్థికాభివృద్ధిలోనూ తమ వంతు పాత్ర పోసిస్తున్నారు.

# అందానికి యాలకులు !

**మిఠాయిలకు సువాసనలిచ్చే యాలకులు నోటి ఇన్ఫెక్షన్లను దూరం చేస్తున్నారు. ఆహారం జీర్ణమయ్యేలా చేయడంతోపాటు ఎన్నో అనారోగ్య సమస్యలకూ చెక్ పెడతాయనీ తెలుసు. అందాన్నీ పెంచుతాయనీ తెలుసా?**



స్పూను చొప్పున యాలకుల పొడి, పంచదార, తేనె తీసుకుని బాగా కలపాలి. దీన్ని ముఖానికి మృదువుగా రుద్ది, పదినిమిషాలయ్యాక గోరువెచ్చని నీటితో కడిగేస్తే సరి. ఈ స్క్రాబ్ మృతకణాలను తొలగించడంతోపాటు చర్మానికి కావాల్సిన తేమని అందిస్తుంది. మాస్క్ ప్రయత్నించాలంటే స్పూను యాలకుల పొడికి చిటికెడు పసుపు, కొన్ని చుక్కల నిమ్మరసం కలిపితే సరి. దీన్ని పావుగంటసేపు ముఖానికి రాసి, కడిగేయాలి. కప్పు రోజ్‌వాటర్‌ను స్పూను యాలకుల పొడి కలిపి, అరగంటసేపు నానబెట్టాలి. తరవాత వడకట్టి, స్ప్రే బాటిల్లో పోసు కోవాలి. దీన్ని ఫ్రిజ్‌లో ఉంచుకుంటే టోనర్లా పనిచేస్తుంది. యాలకుల్లో అక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఫ్రీరాడికల్స్‌లో పోరాడి వృద్ధాప్యచాయలు త్వరగా దరిచేరకుండా చూడటమే కాదు... అనేక చర్మసమస్యల నుంచీ కాపాడతాయి. రక్తప్రసరణ మెరుగయ్యేలా చూస్తూనే చర్మకణాలకు న్యూట్రియంట్లు, ఆక్సిజన్ సరఫరా మెరుగయ్యేలా చేస్తుంది. తద్వారా యవ్వనవంతమైన చర్మం సొంతమయ్యేలా చూస్తాయి. ఎన్ని సుగుణాలో కదా... అలాగని చకచకా పూయడం మొదలు పెట్టేయొద్దు. ఇతర ఉత్పత్తుల్లాగే దీన్ని ముందు స్కిన్ టెస్ట్ చేసుకోండి. ఎర్రబడటం, దద్దుర్లు లేకపోతే... చక్కగా కొనసాగించండి.

# పోట్లాటలు వీటిపైనే..


వాదనలు, పోట్లాటలు... దాదాపు ప్రతి ఇంట్లోనూ ఉంటాయి. ఇవి ఆలూమగల మధ్యనే కాదు, తల్లిదండ్రులూ, పిల్లల మధ్యా వస్తుంటాయి. ఇవి దేని గురించి ఉంటాయనేదానిపై అమెరికాలో ఓ పరిశోధన చేశారు. ఇంట్లో 4-17 ఏళ్ల మధ్య వయసు పిల్లలు ఒక్కరైనా ఉన్న 593 మంది తల్లిదండ్రులపైన ఈ అధ్యయనం చేశారు. కమ్యూనికేషన్ సరిగ్గా లేకపోవడమే ఆలూమగల మధ్య వాదనలకు ప్రధాన కారణమట. ఆపై వారి భావోద్వేగాలు, పిల్లల పెంపకం, ఇంటి పనులు, ఆర్థిక అంశాలు.. దోహద పడుతున్నాయి. గత యాభయ్యేళ్లలో ఎన్నో సంస్కృతీ సంప్రదాయాలు, సాంకేతికంగా మార్పులు వచ్చినా దంపతుల మధ్య పోట్లాటలకు కారణాలు మాత్రం మారలేదట.



దీన్నిబట్టి భార్యాభర్తల అన్యోన్యతకు అవసరమయ్యే ప్రాథమిక అంశాలను అర్థం చేసుకోవచ్చని చెబుతున్నారు. అధ్యయనకర్తలు. తల్లిదండ్రులుటీనేజర్ల మధ్య చూస్తే... ఇంటి పనులు, గది శుభ్రత, సాంకేతిక అంశాలు, ఫోన్ వినియోగంపై వాదనలు ఉంటాయట. త్వరగా నిద్రకు ఉప క్రమించకపోవడం, నచ్చవంటూ ఆహారంలో కొన్నింటిని వదిలేయడం.. లాంటివి చిన్న పిల్లలతో వాదనలకు దారి తీస్తున్నాయట. చదువు, ఆర్థిక పరిస్థితి, వయసు.. లాంటివాటితో సంబంధం లేకుండా అన్ని ఇళ్లలోనూ ఇవి సాధారణంగా కనిపిస్తాయంటున్నారు. కుటుంబాలు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుంటే, ఇంట్లో పోట్లాటలు తగ్గి, బందాలు మరింత దృఢమవుతాయంటున్నారు పరిశోధకులు.

# బైఫేజిక్ స్లీప్ తెలుసా ?


**24 గంటల్లో రెండు దఫాలుగా నిద్రపోవడం...** పని ఒత్తిడీ, ఆందోళన, అలసట, మార్పులూ మహిళల్లో నిద్రలేమికి మూలకారణం. రాత్రి పదికి ముందే నిద్రకు ఉపక్రమించినా... నిద్ర పట్టేది మాత్రం ఏ పదకొండుకో, పన్నెండుకో... దీనివల్ల మహిళ అనారోగ్య సమస్యలు నానాటికీ చాపకింద నీరులా విస్తరిస్తున్నాయి. వీటినుంచి 'బైఫేజిక్ పరిష్కారం స్లీప్' విధానం అంటున్నారు నిపుణులు. సాధారణంగా మనం స్లీప్ మీద ఎక్కువగా ఆధారపడుతాం కదా... అంటే 7-8 గంటలు నిద్రపోవడం కాకుండా బైఫేజిక్ స్లీప్ లో రెండు సార్లు నిద్రపోవాలి. కుదరకో, నిద్ర పట్టకో రాత్రి 5మాత్రమే నిద్ర పోతే మిగిలిన నిద్రను వీలున్న సమయంలో పూర్తిచేయాలని చెప్పడమే అంటే మధ్యాహ్నామో, ప్రయాణాల్లోనో, పని విరామాల్లోనో చిన్నగా కునుకు తీయాలి



వీలున్నవాళ్లని 60 నుంచి 90 నిమిషాలు నిద్రకు కేటాయించమంటున్నారు. వీలులే నుంచి 20 నిమిషాలపాటు పవర్‌న్యాప్ ప్రయత్నించమంటున్నారు. దీంతో ఒత్తిడి, అలసట తగ్గి... మానసిక సమస్యలు దరిచేరవట. చాలామంది ఇలా నిద్రపోయే వీలున్నా..నిద్రపట్టదు, చుట్టూ ఉన్న వారు ఏమనుకుంటారో, యజమాని తిడతారు లాంటి పనుల మీదకి ధ్యాస మళ్లించుకుంటారు. దీనివల్ల అలసట మరింత ఎక్కువ, చేసే నాణ్యత, ఉత్పాదకత తగ్గుతాయి. అతిగా కాకుండా ఇలా 60 నుంచి 90 నిమిషలు న్యాప్‌లు వేయడం మంచిదేనని నిపుణులు చెబుతున్నారు.

# 'మారథాన్'కు సిద్ధమవుతున్నారా?

**ఈ రోజుల్లో చాలామంది ఆరోగ్యానికే మొదటి ప్రాధాన్యమిస్తున్నారు. ఇందులో భాగంగానే వయసుతో సంబంధం లేకుండా జాగింగ్, రన్నింగ్.. ప్రస్తుతం చేస్తున్నారు. మరో అడుగు ముందుకేసి మారథాన్లలోనూ పాల్గొంటున్నారు. వీరిలో మహిళల సంఖ్య ఎక్కువగా ఉంటుంది.**



పరుగు వల్ల కేవలం శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా ఎన్నో ప్రయోజనాలున్నాయంటున్నారు నిపుణులు, అయితే మొదటిసారి మారథాన్‌లలో పాల్గొనే వారు మాత్రం కొన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఫలితంగా గాయాలు పడకుండా ఉండొచ్చు. మరి ఆ జాగ్రత్తలేంటో తెలుసుకుందామా...?

**ఆరోగ్యంగా ఉన్నారా?** మారథాన్‌లో పాల్గొనే ముందు ఆరోగ్యపరంగా ఎలాంటి సమస్యలు లేకుండా ముఖం ముందు ఓసారి హెల్త్ చెకప్ చేయించుకొని, డాక్టర్ సలహాలు తీసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు. ఇలా శారీరకంగా సిద్ధపడినప్పుడే గాయాలు పాలయ్యే ప్రమాదం తగ్గుతుందని అంటున్నారు.

**లక్ష్యన్ని పెంచుకుంటూ..!** మొదటిసారి రన్నింగ్ చేసేవారు వేగంగా, తొందరగా లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రయత్నిస్తారు. ఫలితంగా మోకాళ్ల నొప్పులు, కండరాలు పట్టేయడం, కీళ్ల నొప్పులు.. వంటి సమస్యలు ఎదురవుతాయి. ఇలా జరగకుండా ఉండాలంటే ముందు నుంచే మారథాన్కు సిద్ధం కావాలి. ఈ కోరికనే ప్రాక్టీస్ చేసేటప్పుడు.. ఒకేసారి లక్ష్యనికి గురిపెట్టకుండా.. కొద్దికొద్దిగా లక్ష్యన్ని చేరుకునేలా సాధన చేయాలి. ఉదాహరణకు.. మొదటి వారమంతా కిలోమీటర్ రన్నింగ్ సాధన చేస్తే.. రెండో వారం పాటు మరో కిలోమీటర్ కలుపుకొని రెండు కార్లు పరిగెత్తేలా ప్రాక్టీస్ చేయాలి. ఇలా వేగం పెంచుకుంటూ పోయినప్పుడు లక్ష్యసాధన సులభమవుతుందంటున్నారు. నిపుణులు ఈ గాయాలు బారిన పడే అవకాశాలు తగ్గుతాయంటున్నారు.



**మారథాన్ సాధనలో భాగంగా..** రన్నింగ్ చేయడం వల్ల శరీరంలో ఎక్కువ క్యాలరీలు ఖర్చవుతాయి. అందుకు తగ్గట్టుగా ఆహారం తీసుకుంటేనే శరీరం తిరిగి దృఢంగా, ఉత్సాహంగా మారుతుంది. కాబట్టి తీసుకునే ఆహారంలో మార్పులు చేర్పులు చేసుకోవడం తప్పనిసరి అంటున్నారు నిపుణులు. ఈ కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్లు, ఫైబర్.. వంటి పోషకాలు ఎక్కువగా ఉండేలా ప్లాన్ చేసుకోవాలంటున్నారు. అలాగే డీహైడ్రేషన్కు గురి కాకుండా ఉండేందుకు. సరిపడినన్ని నీళ్లు తాగడం కూడా ముఖ్యమే!


**యోగా, ధ్యానం!** రన్నింగ్ చేసేటప్పుడు కేవలం శారీరకంగానే కాదు.. మానసికంగా దృఢంగా ఉండటం ముఖ్యం. ఈ అనుకూల మనసులో ప్రతికూల ఆలోచనలు రాకుండా జాగ్రత్తపడాలి. యోగా, వ్యాసం మేలు చేస్తుంది. అలాగే ఇతరులతో మాట్లాడేటప్పుడు కూడా సానుకూల అంశాలకే ప్రాధాన్యమివ్వాలి. అన్నీ మిమ్మల్ని మారథాన్కు అన్ని విధాలుగా సంసిద్ధం చేస్తాయి.

# ఎవరి కర్మకు వారే బాధ్యులు

ఆధ్యాత్మికం

తన ఒక్కగానొక్క కుమారుడు పాము కాటుతో చనిపోవడంతో గౌతమి కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది. అప్పుడే ఒక బోయ వాడు అక్కడికి వచ్చాడు. అచేత నుడైన బాలుణ్ణి, ఆ మాతృమూర్తి దుఃఖాన్ని చూసి కదిలిపోయాడు. పొదల్లో దూరిన పామును తీసుకొచ్చి తల్లీ! నీ వేదనకు కారణమైన ఈ సర్పాన్ని చంపుతాను అన్నాడు. అంత బాధలోనూ పామును చంపటానికి గౌతమి అంగీకరించలేదు. ఆ మూగజీవిని సంహారించినంతలో తన పుత్రుడు తిరిగిరాడు కదాని వదిలేయమంది. కానీ బోయ పట్టువదల కుండా 'ఈరోజు నీ కుమారుణ్ణి పొట్టన పెట్టుకున్న ఈ పాము రేపు ఇంకొకరిని కాటేస్తుంది. చంపాల్సిందే!' అన్నాడు. ఇంతలో ఆ పాము నేను కాటేసిన మాట నిజమే! కానీ అది నా సంకల్పం కాదు. మృత్యువు నన్ను అలా ప్రేరేపించింది. బాలుడి మరణానికి నేను కారణం కాదు అంది. కానీ మృత్యువు చేతిలో ఉపకరణం అయ్యావు! నిన్ను 'చంపాల్సిందే' అన్నాడు బోయ. ఆ క్షణం మృత్యుదేవత ప్రత్యక్షమై ఈ బాలుడి అకాల మరణానికి పాము కాదు, నేను కాదు. కాలపురుషుడే కారణం అంది. అప్పుడు కాలపురుషుడు ప్రత్యక్షమై "నాయనా! లోకంలో ఎవరి దుఃఖానికీ మరొకరు కారణం కాదు. సుఖదుఃఖాలనేవి వారు చేసుకున్న కర్మల ఫలితాలు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా అందుకు వారే బాధ్యులు. ఎవరినీ నిందించాల్సిన అవసరం లేదు అని అదృశ్యమయ్యాడు. ఇది మహాభారతంలోని కథ.

# గుమ్మడి హల్వా



**కావలసిన పదార్థాలు**
ఎర్ర గుమ్మడి తురుము: ఒక కప్పు, నెయ్యి: పావు కప్పు, పాలు: అర కప్పు, చక్కెర: అర కప్పు, యాలకుల పొడి: చిటికెడు, తరిగిన బాదం, కాజు: పావు కప్పు.

**తయారీ విధానం:** స్టవ్ మీద పాన్ పెట్టి ఒక టేబుల్ స్పూన్ నెయ్యి వేసి, బాగా వేడయ్యాక గుమ్మడి తురుమును జోడించాలి. దాన్ని సన్నటి మంటపై ఐదు నిమిషాలపాటు వేయించాలి. వేగిన గుమ్మడి మిశ్రమంలో పాలు పోసి మూత పెట్టి మరో రెండు నిమిషాలు ఉడికించాలి. చక్కెర, యాలకుల పొడి కలుపుతూ దగ్గర పడనివ్వాలి. స్టవ్ మీద మరోపాన్ పెట్టుకుని మిగతా నెయ్యి వేసి కాజు, బాదం వేయించి నెయ్యితో సహా గుమ్మడి మిశ్రమంలో వేయాలి. నెయ్యి పైకి తేలే వరకు వేయించి దించుకుంటే కమ్మని గుమ్మడి హల్వా సిద్ధం.

# పిల్లలు గోళ్లు తెగ కొరుకుతున్నారా..

**పిల్లలు కొందరు తెగ గోళ్లు కొరుకుతుంటారు.** వారించినా వినరు. బెదిరిస్తే చాటుమాటుగా అయినా కొరికేస్తుంటారు. ఈ అలవాటును మాన్పించిన వారిలో కొందరి అనుసరణీయ చిట్కాలివీ... చేదు రాసి, తినేవి ఇచ్చి... ఎలాగో తెలియదు కానీ మా పాపకి ఏడాదిన్నరకే గోళ్లు కొరకడం అలవాటైంది. గోరుచుట్టూ చర్మాన్నీ వదిలేది కాదు.

ఎంత వారించినా వినదే! అందుకని కాకరకాయ, వేపాకు, కరక్కాయ రసాలు తీసి చేతులకు రాయడం మొదలు పెట్టా. ఆ చేదుకి వేళ్ల నోట్లో పెట్టుకోవడానికి వీలవ్వట్లేదని తెగ ఏడ్చేది. తరువాత మిల్లెట్స్, నువ్వులు, రాగులు, బెల్లం వంటివాటితో చేసిన చక్రాలు లాంటివి ఏదో ఒకటి చేతిలో ఉంచడం మొదలు పెట్టా. అప్రయత్నంగా అయితే వాటిని నోట్లో పెట్టుకునేది. చక్రాలు లాంటివైతే తినేది కానీ చేత్తో అన్నం తినడానికే భయపడేది... ఎక్కడ చేదు తగులనని! దీంతో స్పూను ఇచ్చి తినేలా చేశాం. ఎలాగైతేనేం ఆ చేదు భయంతో వేళ్లు పెట్టుకోవడం, గోళ్లు కొరకడం మాత్రం తగ్గాయి.

### సుల్తాన్ ఆఫ్ జోహోర్ కప్‌లో

# భారత్ ఓటమి

### 2-4 తేడాతో ఆస్ట్రేలియా విజయం



**న్యూఢిల్లీ:** సుల్తాన్ ఆఫ్ జోహోర్ కప్-2025లో ఆస్ట్రేలియాపై భారత్ 2-4తేడాతో ఓటమి పాలైంది. మలేషియాలోని జోహోర్‌లో జరుగుతున్న జోహోర్ కప్‌లో భాగంగా గురువారం జరిగిన నాల్గవ పూల్‌స్టేజ్ మ్యాచ్‌లో భారత జూనియర్ పురుషుల హాకీ జట్టు వైఫల్యం చెందింది. బ్లూ కోల్ట్స్ తరఫున భారత కెప్టెన్ రోహిత్ (22వ నిముషం), అర్ష్‌దీప్ సింగ్ (60) గోల్స్ చేయగా, ఆస్ట్రేలియా తరఫున ఆస్కార్ స్ప్రోల్ (39, 42), ఆండ్రూ పాట్రిక్ (40), కెప్టెన్ డిలాన్ డౌనీ (51) గోల్స్ చేశారు. మొదటి క్వార్టర్‌లో ఇరు జట్ల మధ్య గట్టి పోటీ నెలకొంది. రెండవ క్వార్టర్‌లో భారత్ 17వ నిమిషంలో తొలి పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుంది, కానీ అన్మోల్ ఎక్కా ఫ్లిక్ గోల్ చేసి పోస్ట్‌ను దాటించాడు. 22వ నిమిషంలో భారత్ మరో పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకున్నా కెప్టెన్ రోహిత్ (22) తక్కువ స్ట్రైక్‌తో నెట్ లోకి వెళ్ళేలా విజయవంతంగా దానిని మలిచాడు. 25వ నిమిషంలో అమీర్ అలీ ఎడమ వైపు నుండి బలమైన సోలో పరుగు చేసి దూరం నుండి షాట్ తీయడంతో ఆధిక్యాన్ని పెంచే దశకు చేరుకున్నాడు. మూడో క్వార్టర్‌లో ఆస్ట్రేలియా వరుసగా మూడు గోల్స్ చేసి మ్యాచ్‌లో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. 39వ నిమిషంలో మొదటిగోల్‌రాగా, ఆస్కార్ స్ప్రోల్ (39) గోల్ చేసి స్కోరును సమం చేశాడు. తర్వాత పెనాల్టీ కార్నర్ సమయంలో ఆండ్రూ పాట్రిక్ (40) గోల్ చేయడంతో ఆధిక్యంలోకి వెళ్లారు. ఆస్కార్ స్ప్రోల్ (42) రెండవ గోల్ చేయగా, బ్యాక్‌హ్యాండ్ స్ట్రైక్‌తో 49వ నిమిషంలో భారత్ పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుంది, తర్వాత ఆస్ట్రేలియా ఐదవ పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుని డిలన్ డౌనీ గోల్‌గా చేసి ఆధిక్యాన్ని మరింత పెంచాడు. పోటీ చివరి నిమిషంలో, అర్ష్‌దీప్ సింగ్ గోల్‌లోకి నైపుణ్యంగా దూసుకెళ్లి భారత్ తరఫున సాయంత్రం రెండవ గోల్ సాధించి మ్యాచ్‌ను ముగించాడు.

## డెన్మార్క్ ఓపెన్‌లో దూసుకెళ్లిన సాత్విక్, లక్ష్య



**న్యూఢిల్లీ:** డెన్మార్క్ ఓపెన్ 2025లో భారత్ షట్లర్స్ సాత్విక్ చిరాగ్, లక్ష్య సేన్ రెండో రౌండ్‌కు చేరుకున్నారు. ఒడెన్స్‌లో జరిగిన వరల్డ్ టూర్ సూపర్ 750 ఈవెంట్ అయిన డెన్మార్క్ ఓపెన్ లో భారత పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్ రాంకిరెడ్డి మరియు చిరాగ్ శెట్టి బలమైన పునరాగమనం చేసి రెండో రౌండ్‌కు దూసుకెళ్లారు. ఆరో సీడ్ ఆటగాడు ఒక సెట్ పరాజయం నుండి కోలుకుని స్కాట్లాండ్‌కు చెందిన క్రిస్టోఫర్ గ్రిమ్లీ మరియు మాథ్యూ గ్రిమ్లీలను 17-21, 21-11, 21-17 తేడాతో ఓడించి ఒక గంటా నాలుగు నిమిషాల పాటు కొనసాగాడు. తొలి సెట్‌ను 17-21 తేడాతో కోల్పోయిన భారత జంట, రెండో సెట్‌లో 8-4తో నాలుగు పాయింట్ల ఆధిక్యాన్ని సాధించి, 21-11 స్కోరుతో ఆధిక్యాన్ని సంపాదించింది. మూడో సెట్ నిర్ణయాత్మకంగా మారింది. రెండు జట్లు 10 ఆల్‌తో సమానంగా తలపడ్డాయి. తర్వాత సాత్విక్-చిరాగ్ 18-12 ఆధిక్యంలోకి దూసుకెళ్లారు. స్కాటిష్ జంట ఆలస్యంగా తిరిగి పోరాడినా, భారత ధీటుగా ఎదుర్కొని 21-17తో ముగించింది. కేవలం ఒక గంటలోనే పోటీని ముగించింది.

### ఆసియా పారా ఛాంపియన్‌షిప్..

# భవీనా ఓటమి

### పురుషుల సింగిల్స్‌లో 2 కాంస్యాలు





**న్యూఢిల్లీ:** ఆసియాపారా టిటి ఛాంపియన్‌షిప్-2025లో ఎనిమిది సార్లు పారాలింపిక్ ఛాంపియన్‌షిప్ చేతిలో భవీనా పటేల్ ఓడిపోయింది. చైనాలోని బీజింగ్‌లో గురువారం జరిగిన ఆసియా టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో భారత స్టార్ ప్యాడ్లర్ భావినా పటేల్ క్వార్టర్ ఫైనల్‌లో నిష్క్రమించి నిరాశపరిచింది. మహిళల సింగిల్స్ 4-5 విభాగంలో ఆమె 8 సార్లు పారాలింపిక్ ఛాంపియన్ చైనాకు చెందిన జాంగ్ బియాన్‌పై 11-8, 3-11, 8-11, 9-11 తేడాతో నాలుగు గేమ్‌ల పోటీలో ఓటమి పాలైంది. క్లాస్ 4 క్రీడాకారిణి అయిన భావినా, ఈ పోటీలో ఎంట్రీలు లేకపోవడంతో క్లాస్ 5 కేటగిరీతో కలపాల్సి వచ్చింది. ఆమె క్లాస్ 4 విభాగంలో టాప్‌సీడ్ అయినప్పటికీ, 5వ కేటగిరిలో పారిస్ పారాలింపిక్ ఛాంపియన్ అయిన జాంగ్ అనే కఠినమైన ప్రత్యర్థితో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ను ఎదుర్కొంది. మరోవైపు, జెహాన్ మదన్, సందీప్ డాంగి ఇద్దరూ సెమీఫైనల్‌కు చేరుకోవడంతో, పురుషుల సింగిల్స్ క్లాస్ 1 విభాగంలో భారత్ డబుల్ పోడియంను సాధించింది. వారు తమ గ్రూప్‌లో రెండవ స్థానంలో నిలిచి సెమీఫైనల్‌కు చేరుకున్నారు. అయితే, వారు కొరియా ప్రత్యర్థుల చేతిలో సెమీఫైనల్స్‌లో ఓడిపోయారు, కానీ భారత్‌కు రెండు కాంస్య పతకాలను సాధించిపెట్టారు.





### డబ్ల్యుటిసి ఫైనల్స్‌లో పాక్‌తో భారత్

# మరోసారి బిగ్ ఫైట్

### మారుతున్న సమీకరణాలు

**న్యూఢిల్లీ:** ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో (డబ్ల్యూటిసి) పాయింట్ల పట్టికలో సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. దీంతో ఫైనల్స్‌కు ఎవరు చేరుతారనేది ఉత్కంఠంగా మారింది. ఈసారి టైటిల్ మ్యాచ్‌లో భారత్ వర్సెస్ పాకిస్తాన్ మధ్య కీలక పోరుకు దారితీసే ఆసక్తికరమైన సమీకరణాలు చోటు చేసుకున్నాయి. 2025-27 డబ్ల్యూటిసిలో పాక్ దక్షిణాఫ్రికాతో తన తొలి విజయాన్ని నమోదు చేసింది. ఫలితంగా పాయింట్ల పట్టికలో పాకిస్తాన్ టీమ్ ఇండియాను అధిగమించి రెండవ స్థానానికి చేరుకుంది.

పట్టికలో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో, శ్రీలంక మూడవ, భారత్ నాల్గవ స్థానంలో ఉన్నాయి. ఇంగ్లాండ్ ఐదవ స్థానానికి పడిపోయింది. వెస్టిండీస్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో విజయం సాధించిన తర్వాత, టీమ్ ఇండియా ఇప్పుడు స్వదేశంలో దక్షిణాఫ్రికా సవాలును ఎదుర్కోనుంది. భారత్ డబ్ల్యూటిసిలో ఆడటానికి ప్రస్తుతం 11 టెస్ట్ మ్యాచ్‌లు ఉన్నాయి. వీటిలో ఏడు స్వదేశంలో ఆడనుంది. దక్షిణాఫ్రికాతో రెండు టెస్ట్‌ల సిరీస్ నవంబర్ 14న ప్రారంభమవుతుంది. తర్వాత, రెండు టెస్ట్ ల కోసం ఆగస్టు 2026లో శ్రీలంక, అక్టోబర్, నవంబర్‌లో న్యూజిలాండ్‌లో పర్యటిస్తుంది. తదుపరి 2027 జనవరి, ఫిబ్రవరిలో స్వదేశంలో ఆస్ట్రేలియాతో ఐదు టెస్ట్‌ల సిరీస్ ఆడుతుంది. ఇలా టీం ఇండియా స్వదేశంలో ఏడు టెస్ట్ మ్యాచ్‌లు ఆడుతుంది. దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా జట్లే టీం ఇండియా ఫైనల్‌కు చేరుకోవడానికి ఒక అవకాశంగా మారనున్నాయి. పాకిస్తాన్‌కు సంబంధించి దక్షిణాఫ్రికాతో తొలి టెస్ట్ మ్యాచ్ గెలిచిన తర్వాత, 12 టెస్ట్ మ్యాచ్‌లు ఆడనుంది. వీటిలో 5 మ్యాచ్‌లు స్వదేశంలో, 7 విదేశీ గడ్డపై జరుగుతాయి. అక్టోబర్ 20న దక్షిణాఫ్రికాతో రెండవ టెస్ట్ తర్వాత, పాక్ నవంబర్ 2026లో స్వదేశంలో శ్రీలంకతో రెండు టెస్ట్‌లు, మార్చి 2027లో న్యూజిలాండ్‌తోను, ఇక మార్చి 2026లో బంగ్లాదేశ్, జూలై, ఆగస్టులో వెస్టిండీస్‌కు, సెప్టెంబర్ లో మూడు టెస్ట్ కోసం ఇంగ్లాండ్‌లో పర్యటిస్తుంది. బంగ్లాదేశ్, వెస్టిండీస్‌లతో పాకిస్తాన్ సిరీస్ సులభం కావచ్చు. అయితే, స్వదేశంలో, పాకిస్తాన్ అన్ని ఐదు టెస్ట్ మ్యాచ్‌లను ఎలాగైనా గెలవాలని లక్ష్యంగా పెట్టుకుంటుంది. ఈ పరిస్థితుల్లో ఈసారి డబ్ల్యూటిసి చివరి మ్యాచ్ భారత్, పాకిస్తాన్ మధ్య జరుగుతుందని భావిస్తున్నారు.

### టెస్ట్ ర్యాంకింగ్స్‌లో

## మెరుగుపడ్డ జైస్వాల్, కుల్దీప్

**న్యూఢిల్లీ:** రెడ్‌బాల్ క్రికెట్‌లో భారత్ ఆధిపత్యం తాజా ఐసీసీ ర్యాంకింగ్స్‌లో ప్రతిబింబిస్తూనే ఉంది, వెస్టిండీస్‌పై 2-0 టెస్ట్ సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసిన తర్వాత యశస్వి జైస్వాల్, కుల్దీప్ యాదవ్ గణనీయమైన లాభాలను సాధించారు. టెస్ట్ బ్యాట్స్‌మెన్ జాబితాలో జైస్వాల్ రెండు స్థానాలు మెరుగుపడి ఇంగ్లాండ్‌కు చెందిన జో రూట్ తర్వాత ఐదవ స్థానానికి చేరుకున్నాడు, కరేబియన్ జట్టుపై బంతితో తన అద్భుత ప్రదర్శన కారణంగా కుల్దీప్ ఏడు స్థానాలు మెరుగుపడి టెస్ట్ బౌలర్లలో 14వ స్థానానికి చేరుకున్నాడు. వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్ 34 స్థానాలు దాటి 66కు, సెంచరీ మేకర్ జాన్ కాంప్‌బెల్ టెస్ట్ బ్యాటింగ్ జాబితాలో ఆరు ఎగబాకి 68వ స్థానానికి చేరుకున్నాడు. ఇక బౌలర్లలో జోమెల్ వారికన్ రెండు పైకి ఎక్కి 30వ స్థానానికి చేరుకున్నాడు. బంగ్లాదేశ్‌పై 3-0 సిరీస్‌ను ఆఫ్ఘనిస్తాన్ కైవసం చేసుకున్న తర్వాత రషీద్ ఖాన్, అజ్మతుల్లా ఒమర్జాయ్ ఇద్దరూ తమ తమ విభాగాలలో నంబర్ 1 స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఒమర్జాయ్ ఒక స్థానం మెరుగుపరుచుకుని జింబాబ్వేకు చెందిన సికందర్ రాజాను నంబర్ 1 వన్డే ఆల్ రౌండర్‌గా నిలబెట్టాడు. రషీద్ ఆల్ రౌండర్ ర్యాంకింగ్స్‌లో రెండు ఎగబాకి నాల్గవ స్థానానికి చేరుకున్నాడు. ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా ఎంపికైన ఇబ్రహీం జాద్రాన్, ఆఫ్ఘనిస్తాన్ తరఫున బ్యాటింగ్ చార్టులలో ఎనిమిది ఎగబాకి రెండవ స్థానానికి చేరుకున్నాడు. ఇప్పుడు నంబర్ 1 స్థానంలో కొనసాగుతున్న భారత్ కెప్టెన్ శుభ్‌మాన్ గిల్ కంటే కేవలం 20 రేటింగ్ పాయింట్లు వెనుకబడి ఉన్నాడు.

## ఇన్ఫోసిస్ నికరలాభం రూ.7364 కోట్లు!





**బెంగళూరు, అక్టోబరు 16:** ఐటిసేవల దిగ్గజ కంపెనీ ఇన్ఫోసిస్ రెండోత్రైమాసికంలో నికరలాభం 13శాతంపెరిగి 7364 కోట్లు నమోదుచేసింది. దీనితో కంపెనీ కూడా ప్రతి షేరుకు రూ.23 డివిడెండ్‌ను ప్రకటించింది. ఈనెల 27వ తేదీ రికార్డు తేదీగాను, చెల్లింపులతేదీ నవంబరు ఏడోతేదీ గానుప్రకటించింది. ఈత్రైమాసికంలో రాబడులు 8.6శాతం పెరిగి 44,490 కోట్లుగా ఉన్నాయి. అంతకుముందు త్రైమాసికంలో 40,986 కోట్లనుంచి గణనీయంగా పెంచుకోగలిగింది. కంపెనీనుంచి ఉద్యోగులు వీడిపోవడం మాత్రం కొంతపెరిగింది.

గత ఏడాది ఇదే త్రైమాసికంలో 12.9శాతం ఉంటేఈ ఏడాది రెండోత్రైమాసికంలో 14.3శాతంగా ఉన్నట్లు కంపెనీ ప్రకటించింది. కంపెనీ భారీ డీల్స్ 3.1 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. రెండో త్రైమాసికంలో భారీ డీల్స్ సాధించామని, 67శాతం కొత్త కాంట్రాక్టులే ఉన్నాయని సిఇఒ సలీల్‌పరేఖ్ అన్నారు. క్లయింట్ల ప్రాధాన్యతలకు అనుగుణంగా కృత్రిమ మేథ వాతావరణంలో గణనీయమైన సేవలు అందించినట్లు చెప్పారు. కంపెనీ ప్రనతి షేరుకు రాబడులు 17.76 రూపాయలుగా ఉంది. స్వేఛ్ఛాయుత నగదు ఈ త్రైమాసికంలో 9677 కోట్లుగా ఉంది. సెప్టెంబరులోనే కంపెనీ 18 వేల కోట్ల షేర్ బైబాక్‌ను కూడా ప్రకటించింది. బిఎస్‌ఇలో ఇన్ఫోసిస్ షేర్లు స్వల్పంగా క్షీణించాయి. 0.08శాతంగా నమోదయి 1472.75గా ట్రేడ్ అయింది.

# ఆకాశాన్ని తాకుతున్న బంగారం, వెండి



**ముంబయి, అక్టోబరు 16:** బంగారం, వెండి ధరలు ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్నాయి. గురువారం ట్రేడింగ్‌లో పసిడి, వెండి ధరలు సరికొత్త ఆల్‌టైమ్ రికార్డు స్థాయికి చేరాయి. అంతర్జాతీయంగా నెలకొన్న రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితి కారణంగా పెట్టుబడిదారులు సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం వైపు పరుగులు తీస్తున్నారు. దీంతో పసిడికి డిమాండ్ అమాంతం పెరిగి ధరలు చుక్కలనంటాయి. దేశీయ మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో బంగారం డిసెంబర్ ఫ్యూచర్స్ ధర ఏకంగా రూ. 1,200 మేర పెరిగి, 10 గ్రాములు రూ. 1,28,395 వద్ద సరికొత్త జీవనకాల గరిష్టాన్ని నమోదు చేసింది. వెండి కూడా బంగారం బాటలోనే పయనించింది. ఎంసీఎక్స్ సిల్వర్ డిసెంబర్ ఫ్యూచర్స్ ధర కేజీకి రూ. 1,900కు పైగా పెరిగి, రూ. 1,64,150 వద్ద కొత్త రికార్డు సృష్టించింది. ఉదయం ట్రేడింగ్‌లో 10 గ్రాముల బంగారం ధర 0.60 శాతం లాభంతో రూ. 1,27,960 వద్ద, కేజీ వెండి ధర 1 శాతం లాభంతో రూ. 1,63,812 వద్ద ట్రేడ్ అయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఉద్రిక్తపరిస్థితులు, అమెరికాలో వడ్డీ రేట్లు తగ్గుతాయన్న అంచనాలు, డాలర్ బలహీనపడటం వంటి అంశాలు బంగారం, వెండి ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా నిలుస్తున్నాయని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ముఖ్యంగా, చైనా ఇటీవల రేర్‌ఎర్త్ మెటీరియల్స్ ఎగుమతులపై ఆంక్షలను మరింత కఠినతరం చేసింది. చైనా చర్యలను అమెరికా అధికారులు తీవ్రంగా విమర్శించడమే కాకుండా, ప్రతీకార చర్యలు ఉంటాయని సంకేతాలిచ్చారు. ఈ పరిణామాలు ప్రపంచ సరఫరా వ్యవస్థకు ముప్పుగా మారడంతో పెట్టుబడిదారులు బంగారం కొనుగోళ్లకు మొగ్గు చూపుతున్నారు. అమెరికా డాలర్ ఇండెక్స్ 0.1 శాతం తగ్గి, వారం రోజుల కనిష్టానికి చేరడం కూడా పసిడికి కలిసొచ్చింది. డాలర్ బలహీనపడటంతో ఇతర కరెన్సీలలో బంగారం ధరలు చౌకగా మారతాయి. దీంతో విదేశీ ఇన్వెస్టర్ల నుంచి డిమాండ్ పెరుగుతుంది. ఈ ఏడాది ఇప్పటివరకు బంగారం ధర ఏకంగా 61 శాతం పెరగడం గమనార్హం. అమెరికాలో షట్‌డౌన్ కొనసాగితే ఈ వారం విడుదల కావాల్సిన ద్రవ్యోల్బణం, రిటైల్ అమ్మకాల వంటి కీలకమైన ఆర్థిక డేటా వాయిదా పడవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# 16వేల మందికి నెస్లే ఉద్వాసన





**న్యూఢిల్లీ, అక్టోబరు 16:** ప్రపంచంలోనే అతిపెద్ద ప్యాకేజ్డ్ ఫుడ్ సంస్థ నెస్లే ఊహించని షాక్ ఇచ్చింది. ఈ ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్ కంపెనీ ఉద్యోగుల తొలగింపులు ప్రకటించి అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఒకేసారి ఏకంగా 16000 మంది ఉద్యోగులను తొలగించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు ఉద్యోగాల కోతలపై నెస్లే సిఇఒ ఫిలిప్ నవ్రాటిల్ గురువారం స్పందిస్తూ వచ్చే రెండేళ్ల కాలానికి ఈ తొలగింపులు ఉంటాయన్నారు. మొత్తంగా 16 వేల మందికి ఉద్వాసన పలుకుతున్నట్లు పేర్కొన్నారు. ఆ వివరాలు తెలుసుకుందాం. ప్రపంచం మారుతోంది. అందుకు తగినట్లుగా నెస్లే కంపెనీ వేగంగా మారాల్సి ఉంది. ఇది కఠినమైన నిర్ణయమే అయినా ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకోవడం అనేది ఆ మార్పులో ఒక భాగమే అని ఒక ప్రకటనలో సిఇఒ ఫిలిప్ నవ్రాటిల్ ప్రకటించారు. ఉత్పత్తి, సరఫరా విభాగాల్లో ఇప్పటికే 4 వేల మందిని తొలగించే ప్రాసెస్ మొదలైనట్లు చెప్పారు. వారితో పాటుగా మరో 12000 మంది వైట్ కాలర్ ఉద్యోగులను ఈలేఆఫ్స్‌లో భాగంగా తొలగిస్తామన్నారు. ఈ లేఆఫ్స్ వల్ల కంపెనీకి ఒక బిలియన్ స్విస్ ఫ్రాంక్స్ ఆదా అవుతాయని చెప్పారు. 2027 సంవత్సరం నాటికి నెస్లే తమ పొదుపు లక్ష్యాన్ని 3 బిలియన్ స్విస్ ఫ్రాంక్స్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఎఫ్ఎంసీజీ సెక్టార్‌లోని ఈ స్విస్ కంపెనీ 2000 బ్రాండ్లను కలిగి ఉంది. ఈ ఏడాది సెప్టెంబర్ నెలలో నాయకత్వ అస్థిరత సమస్యను ఎదుర్కొంది. తన సబార్డినేట్‌తో ప్రేమ వ్యవహారం నడిపించిన ఆరోపణలతో లారెంట్ ఫ్రీక్సే సిఇఒ పదవి కోల్పోయిన విషయం తెలిసిందే. ఇది కంపెనీ రూల్స్‌కి విరుద్ధమని నెస్లే కంపెనీ ఓ ప్రకటనలో వెల్లడించింది. దీంతో ఆయన్ను తక్షణం ఉద్యోగం నుంచి తొలగించామని తెలిపింది. తమ విలువలు కంపెనీకి బలమైన పునాదులుగా ఆ సంస్థ ఛైర్మన్ పాల్ బుల్కే ఈ సందర్భంగా తెలిపారు. తర్వాత పాల్ సైతం తన పదవి నుంచి తప్పుకున్నారు. తన పదవీ కాలం ముగియక ముందే ఆయన రాజీనామా చేయాల్సి వచ్చింది.

## రెండోరోజు లాభాల్లోనే ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

### మార్కెట్లకు బ్యాంకింగ్, ఎన్బీఎఫ్‌సిల మద్దతు

**ముంబయి, అక్టోబరు 16:** ఈక్విటీసూచీలు వరుసగా రెండోరోజు కూడా లాభాల్లోనే ముగిసాయి. ఎంపిక చేసిన స్టాక్స్‌లో భారీ కొనుగోళ్లకుతోడు రెండోత్రైమాసిక ఫలితాలు కూడా మార్కెట్లకు మద్దతిచ్చాయి. వీటికితోడు విదేశీ ఫండ్‌లరాక మరింతగా పెరిగింది. బ్యాంకింగ్; ఎఫ్ఎంసిజి కౌంటర్లలో కొనుగోళ్లు భారీగా ఉన్నాయి. ముడిచమురుదరలు కూడా కొంతమేర సడలింపులు కనిపించాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ మెంట్లలో కూడా వృద్ధినమోదయింది. బిఎస్ఇ స్మాల్‌క్యాప్ 0.47శాతం, మిడ్‌క్యాప్‌సూచీ 0.29శాతం పెరిగాయి. మార్కెట్లపరంగా బిఎస్ఇలో 2378 కంపెనీలషేర్లు పెరిగితే 1809 కంపెనీల షేర్లు క్షీణించాయి. 151 కంపెనీలషేర్లు స్థిరంగా కొనసాగాయి. రిలయన్స్ 1.69శాతం హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 1.54శాతం, ఐసిఐసిఐబ్యాంకు 1.34శాతం మేరపెరిగాయి. భారత్ పదేళ్ల బాండ్లపేపర్ 0.17 శాతం పెరిగి 6.495గా నిలిచింది. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో రూపాయి కొంతమేర పెరిగింది. డాలరుతో రూపాయి మారకం విలువలు 87.85గా నడిచింది. ఎంసిఎక్స్‌లో గోల్డ్ ఫ్యూచర్స్ డిసెంబరు ఐదు నాటికి 0.78శాతంగా ఉంది.

### అమెరికా మార్కెట్‌లో కుప్పకూలిన

# భారత్ ఎగుమతులు!



**న్యూఢిల్లీ, అక్టోబరు 16:** అమెరికా మార్కెట్‌లో భారత ఎగుమతులు పెనుసంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. వాషింగ్టన్ ప్రభుత్వం భారత వస్తువులపై 50 శాతం మేర భారీ సుంకాలను విధించడంతో కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే అమెరికాకు మన ఎగుమతులు 37.5 శాతం మేర కుప్పకూలాయి. ఈ ఆందోళనకర విషయాన్ని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ తన తాజా నివేదికలో వెల్లడించింది. జీటీఆర్ఐ గణాంకాల ప్రకారం ఈ ఏడాది మే 2025 నుంచి సెప్టెంబర్ 2025 మధ్య కాలంలో అమెరికాకు భారత ఎగుమతులు తీవ్రంగా పడిపోయాయి. మేనెలలో 8.8 బిలియన్ డాలర్లుగా ఉన్న ఎగుమతులు, సెప్టెంబర్ నాటికి 5.5 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. ఈ నాలుగు నెలల్లోనే నెలవారీ ఎగుమతుల విలువలో భారత్ ఏకంగా 3.3 బిలియన్ డాలర్లను కోల్పోయింది. వరుసగా నాలుగు నెలల పాటు ఎగుమతులు క్షీణించడం ఇదే తొలిసారి. అమెరికా విధించిన 50 శాతం సుంకాలు పూర్తిగాఅమల్లోకి వచ్చిన తర్వాత, సెప్టెంబర్ నెలలో అత్యంత తీవ్రమైన ప్రభావం కనిపించింది. ఆగస్టులో 6.87 బిలియన్ డాలర్లుగా ఉన్న ఎగుమతులు, సెప్టెంబర్‌లో ఏకంగా 20.3 శాతంతగ్గి 5.5 బిలియన్ డాలర్లకు చేరాయి. 2025లో ఒకే నెలలో ఇంతటి భారీ పతనం నమోదు కావడం ఇదే మొదటిసారి అని నివేదిక స్పష్టం చేసింది. ఈ సుంకాల ప్రభావం ముఖ్యంగా టెక్స్‌టైల్, జెమ్స్ అండ్ జువెలరీ, ఇంజినీరింగ్ వస్తువులు, రసాయనాలవంటి కీలక రంగాలపై పడింది. ఈ రంగాల నుంచి ఎగుమతులు భారీగా పడిపోవడంతో మొత్తంఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడింది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే, అమెరికా వంటి అతిపెద్ద మార్కెట్‌లో భారత తయారీ, ఎగుమతిరంగాల పోటీతత్వం దెబ్బతినే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాషింగ్టన్ విధించినసుంకాలే ఈ పతనానికి ప్రత్యక్ష కారణమని స్పష్టంచేసిన జిటిఆర్ఐ, భారత వాణిజ్య ప్రయోజనాలను కాపాడుకోవడానికి తక్షణమే విధానపరమైన సమీక్ష చేపట్టాలని సూచించింది.

# ధరల పెరుగుదలతో గోల్డ్‌బాండ్లకు భారీ రిటర్నులు!





**ముంబయి,అక్టోబరు 16:** బంగారం ధరలు పెరుగుతున్న కొద్దీ వాటిపై లాభాలు కూడా భారీగానే వస్తున్నాయి. డిజిటల్ గోల్డ్, గోల్డ్ ఇటిఎఫ్, గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్ వంటి వాటిల్లో పెట్టుబడులు పెడుతున్నారు. తద్వారా మంచి లాభాలు పొందుతున్నారని చెప్పొచ్చు. ఇక బంగారంపై పెట్టుబడులు చేసేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గతంలో సావరిన్ గోల్డ్ బాండ్ స్కీమ్ తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఇటీవల రుణ భారం నేపథ్యంలో కొత్తగా పలు విడతలను జారీ చేయట్లేదు. గతంలో ఇష్యూ చేసిన వాటికి సంబంధించి టెన్యూర్ ముగిసే వరకు కొనసాగించనుంది. సాధారణంగా గోల్డ్ బాండ్ల పరిమితి 8 సంవత్సరాలుగా ఉంటుంది.

ఇక్కడ ఐదేళ్ల దాటిన తర్వాత ముందుగా విత్‌డ్రా చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఇక్కడ ఒక్కో యూనిట్‌ను ఒక్కో గ్రాముగా పేర్కొంటారు. కనీసం గ్రాము నుంచి గరిష్టంగా 4 కిలోల వరకు కొనుగోలు చేయొచ్చు. బంగారం ధర పెరుగుతున్న కొద్దీ.. నేరుగా లాభం వస్తుందని చెప్పొచ్చు. ఇంకా వడ్డీ కూడా చెల్లిస్తుంది. కేంద్ర ప్రభుత్వం తరఫున ఆర్బీఐ ఈ గోల్డ్ బాండ్లను జారీ చేసింది. ఇండియన్ బులియన్ జువెల్లర్స్ అసోసియేషన్ ఇష్యూ డేట్, రిడెంప్షన్ డేట్ ముందు 3 రోజుల సగటు ధర ఆధారంగా ఇష్యూ ధర, రిడెంప్షన్ ధర ప్రకటిస్తుంటుంది. ఇప్పుడు 2017-18 సిరీస్ గోల్డ్ బాండ్ స్కీమ్ రిడెంప్షన్ ధరను ఆర్బీఐ ప్రకటించింది. ఈనెల 16 నుంచే రిడీమ్ చేసుకోవచ్చని ఆర్బీఐ ఒక సర్క్యులర్ విడుదల చేసింది. దీనిని 2017, అక్టోబర్ 16న ఇష్యూ చేయగా సరిగ్గా 8 ఏళ్లకు రిడెంప్షన్ డేట్‌గా ప్రకటించింది. ఇక్కడ బంగారం ధర పెరుగుదలకు అదనంగా 2.50 శాతం చొప్పున వడ్డీ కూడా చెల్లిస్తుంది. ఈ గోల్డ్ బాండ్ల ఇష్యూ ధర గ్రాముకు అప్పట్లో రూ. 2,866 గా ప్రకటించింది. ఇక్కడ ఆన్‌లైన్‌లో అప్లై చేసి డిజిటల్ పేమెంట్ చేస్తే రూ. 50 డిస్కౌంట్ వస్తుంది. అప్పుడు ఇష్యూ ధర రూ. 2,816గానే ఉంటుంది. ఇప్పుడు చూస్తే రిడెంప్షన్ ధర ఏకంగా రూ. 12,567 గా ఉంది. ఇక్కడ చూస్తే గ్రాముకే రూ. 9,751 చొప్పున లాభం వచ్చింది. ఇంకా వడ్డీ అదనం అని చెప్పొచ్చు. దీంతో ఏకంగా 346 శాతం రిటర్న్స్ రావడం విశేషం.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.